కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

శ్రీ శంకరాచార్య విరచిత

సౌందర్యలహరి

- భావార్థముతో -

శ్రీరస్తు

శుభమస్తు



అవిఘ్నమస్తు



సేకరణ: కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్, 3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

Kiron Type Institute

సౌందర్యలహరి

01. శివశ్శక్త్యాయుక్తో ... (శక్తిత్వము)
02. తనీయాంసంపాంసుం ... (పాదధూళి మహిమ)
03. అవిద్యానామంతః ... (పాదధూళి మహిమ)
04. త్వదన్యః పాణాభ్యాం ... (చరణములు)
05. హరిస్త్వామారాధ్య ... (సేవా మహిమ)
06. ధనుఃపౌష్పంమౌర్వీ ... (దయా ఫలము)
07. క్వణత్కాంచీదామా ... (బాహ్య రూపము)
08. సుధాసింధోర్మధ్యే ... (అంతర నివాస విలాసము)
09. మహీం మూలాధారే ... (సుషుమ్న - ఊర్ధ్వ మార్గము)
10. సుధాధారా సారై ... (సుషుమ్న - అధో మార్గము)
11. చతుర్భిశ్శ్రీకంఠైః ... (శ్రీ చక్రము)
12. త్వదీయం సౌందర్యం ... (సాయుజ్యము)
13. నరం వర్షీయాంసం ... (ఉపాసనాఫలము)
14. క్షితౌషట్పంచాశత్ ... (షట్చక్రముల కిరణములు)
15. శరజ్జ్యోత్స్నా శుద్ధాం ... (సారస్వత ప్రయోగము)
16. కవీంద్రాణాంచేతః ... (సారస్వత ప్రయోగము)
17. సవిత్రీభిర్వాచాం ... (సారస్వత ప్రయోగము)
18. తనుచ్ఛాయాభిస్తే ... (స్త్రీ వశీకరణ)
19. ముఖంబిందుంకృత్వా ... (జీవన్ముక్తి)
20. కిరంతీమంగేభ్యః ... (జ్వర, విష శాంతి)
21. తటిల్లేఖాతన్వీం ... (సాదాఖ్య కళ)
22. భవానిత్వందాసే ... (సద్యః ఫలము)
23. త్వయాహృత్వావామం ... (గౌరీశంకరత్వము)
24. జగత్సూతే ధాతా ... (సృష్ట్యాదికము)

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

25. త్రయాణాం దేవానాం ... (త్రిమూర్తి పూజ)
26. విరించిః పంచత్వం ... (సంహార విహారము)
27. జపోజల్పః శిల్పం ... (సర్వ సమర్పణము)
28. సుధామప్యాస్వాద్య ... (తాటంక మహిమ)
29. కిరీటం వైరించం ... (బ్రహ్మాది సేవ)
30. స్వదేహోద్భూతాభిః ... (నీరాజన విధి)
31. చతుష్షష్ట్యాతంత్రైః ... (64 తంత్రములు)
32. శివశ్శక్తిఃకామః ... (పంచదశాక్షరీ మంత్రము)
33. స్మరం యోనిం లక్ష్మీం ... (మంత్రోపాసనము)
34. శరీరం త్వం శంభోః ... (నవాత్మత్వము)
35. మనస్త్వంవ్యోమత్వం ... (విశ్వమూర్తిత్వము)
36. తవాజ్ఞాచక్రస్థం ... (ఆజ్ఞాచక్రము)
37. విశుద్ధౌతే శుద్ధ ... (విశుద్ధి చక్రము)
38. సమున్మీలత్సంవిత్ ... (అనాహత చక్రము)
39. తవస్వాధిష్ఠానే ... (స్వాధిష్ఠాన చక్రము)
40. తటిత్త్వంతం శక్త్యా ... (మణిపూర చక్రము)
41. తవాధారేమూలే ... (మూలాధార చక్రము)
42. గతైర్మాణిక్యత్వం ... (కిరీటము)
43. ధునోతుధ్వాంతం ... (కేశపాశము)
44. తనోతుక్షేమం ... (పాపట)
45. అరాళైస్స్వాభావ్యాత్ ... (ముఖము)
46. లలాటం లావణ్య ... (పాల భాగము)
47. భ్రువౌ భుగ్నే కించిత్ ... (కనుబొమ్మలు)
48. అహస్సూతే సవ్యం ... (నేత్రత్రయము)
49. విశాలా కళ్యాణీ ... (దృష్టి)
50. కవీనాంసందర్భః ... (ఫాలనేత్ర అరుణత్వము)

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

51. శివేశృంగారార్ద్రా ... (నవరస దృష్టి)
52. గతేకర్ణాభ్యర్ణం ... (నేత్రములు)
53. విభక్త త్రైవర్ణ్యం ... (నేత్రములు)
54. పవిత్రీకర్తుం నః ... (నదులు - నేత్రములు)
55. నిమేషోన్మేషాభ్యాం ... (అనిమేషత్వము)
56. తవాపర్ణేకర్ణే ... (మీనములు - నేత్రములు)
57. దృశాద్రాఘీయస్యా ... (విశాలదృక్పథము)
58. అరాళంతేపాళీ ... (కణతలు)
59. స్ఫురద్గండాభోగ ... (కపోలములు)
60. సరస్వత్యాస్సూక్తీ ... (కుండల గణము)
61. అసౌనాసావంశః ... (నాసిక)
62. ప్రకృత్యాఽఽరక్తాయా ... (పెదవులు)
63. స్మితజ్యోత్స్నాజాలం ... (చిరునవ్వు)
64. అవిశ్రాంతంపత్యుః ... (నాలుక)
65. రణేజిత్వాదైత్యాన్ ... (తాంబూలము)
66. విపంచ్యాగాయంతీ ... (వాజ్మాధుర్యము)
67. కరాగ్రేణస్పృష్టం ... (చిబుకము)
68. భుజాశ్లేషాన్నిత్యం ... (కంఠము)
69. గళేరేఖాస్తిస్రో ... (కంఠరేఖలు)
70. మృణాళీమృద్వీనాం ... (బాహువులు)
71. నఖానాముద్యోతైః ... (హస్తములు)
72. సమందేవిస్కంద ... (స్తనములు)
73. అమూతేవక్షోజా ... (స్తనములు)
74. వహత్యంబస్తంబే ... (స్తనములు)
75. తవస్తన్యంమన్యే ... (స్తన్యము)
76. హరక్రోధ జ్వాలా ... (నూగారు)
77. యదేతత్కాళిందీ ... (నూగారు)

78. స్థిరోగంగావర్తః ... (నాభి)
79. నిసర్గక్షీణస్య ... (నడుము)
80. కుచౌసద్యస్స్విద్యత్ ... (త్రివళులు)
81. గురుత్వంవిస్తారం ... (పిఱుదులు)
82. కరీంద్రాణాంశుండాన్ ... (తొడలు)
83. పరాజేతుంరుద్రం ... (పిక్కలు)
84. శ్రుతీనాంమూర్ధానో ... (పాదములు)
85. నమోవాకంబ్రూమో ... (పాదములు)
86. మృషాకృత్వాగోత్ర ... (పాదములు)
87. హిమానీహంతవ్యం ... (పాదములు)
88. పదంతేకీర్తీనాం ... (పాదాగ్రములు)
89. నఖైర్నాక స్త్రీణాం ... (పాద, నఖములు)
90. దదానేదీనేభ్యః ... (పాదములు)
91. పదన్యాసక్రీడా ... (గమనము)
92. గతాస్తే మంచత్వం ... (మంచ, పర్యంకములు)
93. అరాళాకేశేషు ... (కరుణారుణ శరీరము)
94. కళంకఃకస్తూరీ ... (సౌందర్య పేటిక)
95. పురారాతేరంతః ... (సపర్య)
96. కళత్రం వైధాత్రం ... (పాతివ్రత్యము)
97. గిరామాహుర్దేవీం ... (మహామాయ)
98. కదాకాలేమాతః ... (చరణ నిర్ణేజన జలము)
99. సరస్వత్యాలక్ష్మ్యా ... (ఫలశ్రుతి)
100 .ప్రదీపజ్వాలాభిః ... (స్తుతి సమర్పణము)

----===-----

శ్లో॥ చతుర్భుజే చంద్రకళావతంసే కుచోన్నతే కుంకుమ రాగశోణే।
పుండ్రేక్షు పాశాంకుశ పుష్పబాణా హస్తే నమస్తే జగదేకమాతః॥

హ్రీంకారాసన గర్భితా నలశిఖాం సౌః క్లీం కళాబిభ్రతీం
సౌవర్ణాంబరధారిణీం పరసుధాం ధౌతాం త్రినేత్రోజ్వలాం
వందే పుస్తకపాశ మంకుశధరాం స్రగ్భూషితా ముజ్వలాం
త్వాం గౌరీం త్రిపురాం పరాత్పర కళాం శ్రీచక్రసంచారిణీం॥

శర్వాణి శారదారాధ్యే శరచ్చంద్ర నిభాననే।
శరణ్యే త్ర్యంబకేదేవి శాతోదరి నమో஽స్తుతే॥

ఇంద్రియాలకన్నా మనస్సు శ్రేష్ఠమైనది - మనస్సుకన్నా బుద్ధి శ్రేష్ఠమైనది.
బుద్ధికన్నా మహత్తు శ్రేష్ఠమైనది - మహత్తుకన్నా అవ్యక్తము శ్రేష్ఠమైనది.
అవ్యక్తముకన్నా పరబ్రహ్మ శ్రేష్ఠమైనది-పరబ్రహ్మకన్నా శ్రేష్ఠమైనది ఏదీ లేదు.

"కకారాది క్షకారాంతా వర్ణాస్తే శివరూపిణః। అకారాదివి సర్గాంతాః స్వరాః షోడశ శక్తయః॥" (అ నుంచి అః వరకు ఉండే అచ్చులు శక్తిరూపాలు. క నుంచి క్ష వరకు హల్లులు శివరూపాలు. ఈ రెండూ కలిస్తేనే కాని అక్షరం పూర్తికాదు.)

శ్లో॥ శీమాతా స్త్రిపురే! పరాత్పరతరే! దేవీ! త్రిలోకీ! మహా
సౌదర్యార్ణవ మంథనోద్భవసుధా ప్రాచుర్యవర్ణోజ్వలం।
ఉద్యద్భాను సహస్ర నూతన జపాపుష్ప ప్రభం తే వపుః
స్వాస్తేయే స్ఫురతు త్రిలోక నిలయం జ్యోతిర్మయం వాఙ్మయం॥

(ఓ తల్లీ! త్రిపురా! పరాత్పరీ! ముల్లోకములందు సౌందర్యమైనదానా; అమృతము వంటిదానా, బాలభానుని అరుణారుణచ్ఛాయతో ప్రకాశించే ఓ దేవీ! త్రిలోకమయము, జ్యోతిర్మయము, వాఙ్మయము అయిన రూపము గలదానా! నా ఉపాసనలో నిరంతరము నీ రూపము దర్శనమిచ్చును గాక.)

ఆదినాథ సమారంభాం శంకరాచార్య మధ్యమాం।
అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరంపరాం॥
కోటిసూర్యప్రతీకాశం చంద్రకోటి సుశీతలం।
విద్యుత్కోటి సమానాభమరుణం తత్పరం మహః॥

సౌందర్యలహరి - భావార్థముతో -

01. శివ శ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుమ్
న చే దేవం దేవో న ఖలు కుశలః స్పందితు మపి।
అతస్త్వా మారాధ్యాం హరి హర విరించాదిభి రపి
ప్రణంతుం స్తోతుం వా కథ మకృత పుణ్యః ప్రభవతి॥

టీక:- (తల్లీ, జగజ్జననీ!) శివః = శివుడు; శక్త్యా = శక్తితో, యుక్తః = కూడి యున్నపుడు; ప్రభవితుం = సృష్టించుటకు; శక్తః = సమర్ధుడు; ఏవం = ఈ విధముగా; నచేత్ = కాదేని (అనగా శక్తితో కూడి ఉండనిచో), దేవః = ఆ శివుడు; స్పందితుం అపి = చలించుటకు కూడా; నకుశలః = నేర్పరికాడు, అతః = ఈ కారణము వలన, హరిహరవిరించాది భిరపి = విష్ణువు, శివుడు, బ్రహ్మ మొదలగు వారి చేత గూడా; ఆరాధ్యాం = పూజింపదగిన; త్వాం = నిన్ను గూర్చి, ప్రణంతుం = నమస్కరించుటకుగాని; స్తోతుంవా = స్తుతించుటకుగాని; అకృతపుణ్యః = పుణ్యము చేయనివాడు; కథం = ఏవిధముగా; ప్రభవతి = శక్తుడగును?

తల్లీ! భగవతీ! శివుడంతటివాడు శక్తిస్వరూపిణివైన నీతో కూడి యున్నపుడు సమస్త సృష్టిని చేయుటకు సమర్థుడగుచున్నాడు. ఆ విధముగా నీతో కూడి యుండనిచో - అంతటి శివుడైనను చలించుటకు గూడ శక్తుడు కాదు. హరిహర బ్రహ్మాదుల చేతగూడా ఆరాధింపబడు నిన్ను గూర్చి నమస్కరించుటకు గాని, స్తుతించుటకు గాని పుణ్యము చేయనివాడు ఏ విధముగా సమర్థుడగును? (సమర్థుడు కాదని భావము)

సౌందర్యలహరిలోని ప్రథమ శ్లోకాన్ని శివ శబ్దంతో ప్రారంభించారు ఆది శంకరులు. శివుడు, శక్తి వీరిద్దరికీ భేదం లేదు. శివ శక్తుల కలయికయే శ్రీ చక్రం. ఈ శ్లోకంలో శంకరులేమంటున్నారంటే, అమ్మా, పరమేశ్వరుడు కూడా శక్తివైన నీతో కలసినప్పుడే, అతడు, లయ కార్యమును చేయగలడు. శక్తి కలయికలేని శివుడు స్థాణువు మాత్రమే. అందుకనే, హరి హర బ్రహ్మలు శక్తి యొక్క అనుగ్రహంతోనే తమ తమ కార్యములు నిర్వహించ గలుగుతున్నారు. ఇక మానవులమైన మేమెంత. నీ అనుగ్రహం లేని మానవులు నిన్ను స్మరించడానికి అర్హులు కారు.

అమ్మా! ఓ పరమేశ్వరీ! సర్వమంగళకారకుడైన శివుడు కూడా జగన్నిర్మాణ శక్తివైన నీతో కూడితేనే కాని ఈ జగత్తులను నిర్మించలేడు. నీతో కలువకపోయినట్లైతే అతడు కదలటానికి కూడా శక్తి లేనివాడవుతాడు. కాబట్టి త్రిమూర్తులచేత కూడా పూజింపబడే నీకు నమస్కరించాలన్నా, నిన్ను పూజించాలన్నా, నిన్ను స్తుతించాలన్నా, కనీసం నీ పేరు తలచాలన్నప్పటికీ కూడా, గత జన్మలలో పుణ్యం చెయ్యనివాడు సమర్థుడు కాడు. అంటే పూర్మజన్మ సుకృతం లేనిదే నిన్ను అర్చించటం కాదు కదా, కనీసం నీ పేరు తలచటానికి కూడా అర్హత ఉండదు.

02. తనీయాంసం పాంసుం తవచరణ పంకేరుహ భవం
విరించి స్సంచిన్వన్ విరచయతి లోకా నవికలమ్।
వహత్యేనం శౌరిః కథమపి సహస్రేణ శిరసాం
హరః సంక్షుద్యైనం భజతి భసితో ద్ధూలనవిధిమ్॥
(హరః సంక్షుద్యైనం భజతి భస్మోద్ధూళనవిధిమ్)

టీక:- (తల్లీ జగజ్జననీ!) తవ = నీ యొక్క, చరణ పంకేరు హాభవం = పాద పద్మము నందు అంటి వున్న, పాంసుం = ధూళిని, తనీయాంసం = లేశమాత్రమును, సంచిన్వన్ = సంపాదించుచు, విరించిః = బ్రహ్మ, లోకాన్ = చతుర్దశ భువనములను, అవికలం = ఏ మాత్రము దెబ్బతినకుండా, విరచయతి = సృష్టించుచున్నాడు. ఏవం = ఈ లేశ మాత్ర ధూళినే, శౌరిః = విష్ణువు, సహస్రేణ శిరసాం = (ఆదిశేషువుగా) తన వేయి తలలతో, కథమపి = అతికష్టముతో, వహతి = భరించుచున్నాడు, ఏవం = ఈ లేశ మాత్ర ధూళినే, హరః = హరుడు (శివుడు), సంక్షుద్య = చక్కగా మెదిపి, భసితోద్ధూలన విధిం = విభూతిని పైపూతగా పూసుకొనునట్లు, భజతి = సేవించు చున్నాడు.

తల్లీ! భగవతీ! నీ పాదపద్మము అడుగున అంటి వున్న లేశ మాత్ర ధూళిని సంపాదించి దానితో బ్రహ్మ ఈ చతుర్దశ భువనములను ఎట్టి వైకల్యములేక సృజించుచున్నాడు. ఈ లేశ మాత్ర ధూళి కణమునే విష్ణుమూర్తి ఆదిశేషువుగా తన వెయ్యి తలలతో అతి కష్టముగా మోయుచున్నాడు. ఈ లేశ మాత్ర ధూళినే శివుడు చక్కగా మెదిపి తన శరీరమంతటిని విభూతి వలె పూసుకొనుచున్నాడు.

తల్లీ, నీ చేత సృష్టించబడిన బ్రహ్మదేవుడు, నీ శక్తి వల్లనే, సృష్టి కార్యమును నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాడు. నీ పాదధూళి రేణువులను శిరసుపై దాల్చి విష్ణుదేవుడు స్థితి కార్యక్రమాన్ని, ఆదిశేషుడు వేయి పడగలపై ఈ భూ భారాన్ని మోస్తున్నారు. శివుడు నీ పాద ధూళిని భస్మంగా శరీరం మొత్తం ధరించి లయ కార్యక్రమం నిర్వహిస్తున్నాడు. "శృతి సీమంత సింధూరీ కృత పాదాబ్జధూళికా"

ఓ తల్లీ! నీ పాదధూళిని అణుమాత్రం తీసుకున్న బ్రహ్మదేవుడు చరాచర జగత్తును సృష్టిస్తున్నాడు. అతల, వితల, సుతల, రసాతల, మహాతల, పాతళ, మర్త్యలోకాలనబడే అధో లోకాలను, భూలోక, భువర్లోక, సువర్లోక, మహాలోక, జనోలోక, తపోలోక, సత్యలోకాలనబడే ఊర్ధ్వలోకాలను మొత్తం పధ్నాలుగు లోకాలను సృష్టిస్తున్నాడు. అలాగే విష్ణువు తన వేయితలలతో ఈ భూమిని మోస్తున్నాడు. దానినే ఈశ్వరుడు శరీరమంతా భస్మముగా ధరిస్తున్నాడు.

03. అవిద్యానా మంత స్తిమిర మిహిర ద్వీప నగరీ
జడానాం చైతన్య స్తబక మకరంద స్రుతి ఝరీ।

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

దరిద్రాణాం చింతామణి గుణనికా, జన్మజలధౌ
నిమగ్నానాం దంష్ట్రా మురరిపు వరాహస్య భవతి॥

టీక:- (తల్లీ జగజ్జననీ! నీ పాద పద్మ పరాగము) అవిద్యానాం = అజ్ఞానులకు, అంతస్తిమిర = లోపల వున్న (అజ్ఞానమను) చీకటికి, మిహిర ద్వీపనగరీ = సూర్యుడు ఉదయించు ప్రదేశమునకు చెందిన పట్టణము, జడానాం = అలసులకు, మంద బుద్ధిగలవారికి, చైతన్యస్తబక = జ్ఞానమను పుష్ప గుచ్ఛమునుండి వెలువడు, మకరంద స్రుతి ఝరీ = నిరంతర చైతన్యధారగా వెలువడు తేనె ధారల ప్రవాహము, దరిద్రాణాం = దరిద్రుల పట్ల, చింతామణి గుణనికా = చింతామణుల వరుస (పేరు) జన్మజలధౌ = సంసార సముద్రము నందు, నిమగ్నానాం = మునిగి సతమతమగు వారి పట్ల, మురరిపు వరాహస్య = విష్ణుమూర్తి ఎత్తిన ఆది వరాహ అవతార మూర్తి యొక్క, దంష్ట్రా భవతి = కోరవంటిది అగుచున్నది.

తల్లీ! జగజ్జననీ! నీ పాద పద్మ పరాగము - అజ్ఞానుల పట్ల - సూర్యుడుదయించు పట్టణము వంటిది. మంద బుద్ధి గల జడుల పట్ల - జ్ఞానమను తేనెను జాలువార్చు ప్రవాహము వంటిది. దరిద్రుల పట్ల - చింతామణుల వరుస వంటిది. సంసార సాగరమున మునిగి సతమతమగు వారికి విష్ణుమూర్తి అవతారమైన ఆది వరాహపు కోరవంటిది. (వరాహమూర్తి ఈ కోరతోనే సముద్రమున దిగబడి వున్న భూమిని పైకి ఉద్ధరించి సంరక్షించెను).

జగన్మాతా! నీ పాదంపై నున్న ఒక్క రేణువు అజ్ఞానమనే వ్యాధికి పరమౌషధం. తిమిరాంధకారంలో ఉన్నవారికి నీ పాదరేణువు సూర్యకాంతి వలె దారిచూపుతుంది. నీ పాదరేణువు జడత్వంతో ఉన్న వారికి ఆత్మ ప్రభోదాన్ని, దరిద్రులకు ఐశ్వర్యాన్ని, ఈ భవసాగరంలో మునిగిపోతున్న వారికి విష్ణుమూర్తి యొక్క వరాహావతారంగా ఉద్ధరిస్తుంది.

అమ్మా! నీ పాదకమలపరాగరేణువు ఉన్నదే! అది అజ్ఞానమనే చీకటిలో ఉన్నవారికి సూర్యుడు ఉండే పట్టణము. మందబుద్ధులకు చైతన్యమనే కల్పవృక్ష పుష్పగుచ్ఛముయొక్క తేనె. దరిద్రుడి పాలిట చింతామణులప్రోగు. సంసార సాగరంలో మునిగిపోతున్న వాడికి యజ్ఞవరాహరూపియైన విష్ణువుయొక్క కోర.

04. త్వదన్యః పాణిభ్యా మభయవరదో దైవతగణః
త్వమేకా నైవాసి ప్రకటిత వరాభీత్యభినయా।
భయాత్త్రాతుం దాతుం ఫలమపిచ వాంఛా సమధికమ్
శరణ్యే లోకానాం తవహి చరణా వేవ నిపుణౌ॥

టీక:- లోకానాం = అన్నిలోకముల వారికి, శరణ్యే = శరణము పొందుటకు అర్హత గలిగిన ఓ జగజ్జననీ! త్వత్ అన్యః = నీ కంటే ఇతరులైన, దైవతగణః = దేవతలందరూ, పాణిభ్యాం = (తమ) రెండు హస్తములచే, అభయవరదః = అభయ ముద్ర, వరదముద్రలను దాల్చుచున్నారు, త్వం = నీవు, ఏకా = ఒక్క దానివి (వారి వలెనే హస్తములచే) ప్రకటిత =

తెలుపబడిన, వర = వరద ముద్రను, అభీతి = అభయ ముద్రను, నఏవ = ఏ మాత్రము, అభినయా = అభినయించని విధముగా, అనగా - తాల్చని విధముగా, అసి = వున్నావు, (కారణమేమనగా), భయాత్ = భయము వలన, త్రాతుం = రక్షించుటకు, వాంఛా సమధికం = కోరిన దాని కన్న ఎక్కువ, ఫలం + అపిచ = ఫలమపిచ = ఫలమును గూడా, దాతుం చ = ఇచ్చుటకును కూడ, తవ = నీ యొక్క, చరణౌ ఏవ = పాదములే, నిపుణౌ హి = సమర్ధములగుట చేసి గదా!

సర్వలోకముల వారికిని దిక్కైన ఓ జగజ్జననీ! ఇంద్రాది ఇతర దేవత లందరును తమ రెండు హస్తములందు వరద, అభయ ముద్రలను దాల్చుచుండగా నీవు ఒక్కదానివి నీ హస్తములతో వాటిని అభినయించ కున్నావు. భయము నుండి రక్షించుటకు, కోరిన వాటిని మించి వరములను ప్రసాదించుటకు - నీ రెండు పాదములే సమర్ధములై ఉన్నవి గదా! (మరి ఇంక అట్టి అవసరము నీకేల యుండును అని భావము)

ఓ తల్లీ! దేవి! దేవతలందరూ కూడా, తమ హస్తముల అభయ, వరముద్రలతో, అభయ వర ప్రదానములను సంకేతిస్తుంటారు. వాంఛాసిద్ధికి, భయ నివారణకు నీ పాదములుండగా, ఇక ఇతర అభయ, వరముద్రలతో పని ఏ మున్నది తల్లీ, ఈ సకల చరాచర జగత్తుకు, నీ పాదములే కదా శరణ్యము.

ఓ తల్లీ! నీకన్న ఇతరులైన దేవతలంతా చేతులయందు అభయ, వరదముద్రలు కలిగి ఉన్నారు. కానీ నీ పాదములే భక్తుల కోరికలు తీర్చి వారిని భయమునుండి కాపాడుతున్నాయి.

05. హరి స్త్వా మారాధ్య ప్రణత జన సౌభాగ్య జననీం
పురా నారీ భూత్వా పురరిపు మపి క్షోభమనయత్।
స్మరోఽపి త్వాం నత్వా రతినయన లేహ్యేన వపుషా
మునీనా మప్యంతః ప్రభవతి హి మోహాయ మహతామ్॥

టీక:- హరిః = విష్ణువు, ప్రణతజన = నమస్కరించు జనులకు, సౌభాగ్య జననీం = సౌభాగ్యమును (సుభగత్వము అనగా - సౌజన్య, ప్రకాశ చైతన్య రూపమును) ప్రసాదించు తల్లివైన, త్వాం = నిన్ను, ఆరాధ్య = ఆరాధించి, పురా = పూర్వము ఒకప్పుడు, నారీ భూత్వా = స్త్రీ రూపమును ధరించి, పురరిపుం + అపి = త్రిపుర హరుడైన శివుని సైతము, క్షోభం అనయత్ = చిత్తక్షోభమును కలుగ జేసెను, స్మరః + అపి = స్మరోఽపి = మన్మథుడు గూడా, త్వాం = నిన్ను; (గూర్చి) నత్వా = నమస్కరించి, (అనగా - పూజించి); రతినయన లే హ్యేన = రతీదేవి కన్నులకు ఆనందాస్వదకరమైన, వపుషా = చక్కని దేహముతో, మహతాం = గొప్పవారైన, మునీనాం + అపి = (వైరాగ్య భావముతో) మౌనముగా తపస్సు గావించు ఋషులను సైతము, అంతః = (వారి) మనస్సు లోపల; మోహాయ = మోహపరవశులను చేయుటకు, ప్రభవతి = సమర్థుడగు చున్నాడు, హి = గదా!

తల్లీ! జగజ్జననీ! నమస్కరించు భక్తులకు సౌభాగ్యమును ప్రసాదించు - నిన్ను ఆరాధించి,

విష్ణుమూర్తి పూర్వ మొకసారి జగన్మోహినీ రూపమును పొంది, త్రిపురహరుడైన శివుని సైతము మోహ పరవశుని చేసి - చిత్తక్షోభమును కలుగ జేసెను. అట్లే, మన్మథుడు గూడ నిన్ను పూజించి, నీ అనుగ్రహమును పొంది, తన సతి - రతీదేవికి కన్నుల పండుగను గొలుపు సుందర శరీరాకృతిని పొంది - జితేంద్రియుడై, మౌనముగా తపస్సు చేసుకొను ఋషులను సైతము - మోహ వివశులను చేయు సమర్థుడయ్యెను గదా!

నిన్ను శరణు వేడిన భక్తులకు సర్వ సౌభాగ్యదాయినివైన నిన్ను ఆరాధించే, శ్రీ మహా విష్ణు దేవుడు శివుని, జగన్మోహినిగా మోహానికి గురిచేశాడు. కామదేవుడైన మన్మథుడు, నీవు కటాక్షించబట్టే, పునర్జీవితుడై, రతీదేవికి ఆనందాన్ని కలిగించడమే కాక, మునులను కూడా మోహానికి గురి చెయ్యగలుగుతున్నాడు.

ఓ తల్లీ! నీకు నమస్కరించేవారికి, నిన్ను ఆరాధించేవారికి సౌభాగ్యప్రదురాలవు. అటువంటి నిన్ను ఆరాధించి, పూర్వకాలంలో విష్ణువు స్త్రీ రూపం పొంది త్రిపురాసుర సంహారము చేసిన శివుణ్ణి కూడా మోహింపచేశాడు. అలాగే అనంగుడైన మన్మథుడు
నిన్ను ఆరాధించినవాడై, రతీదేవికి మాత్రమే కనిపిస్తూ, తాపసోత్తములైన మహర్షులను కూడా మోహింపచేస్తున్నాడు.

06. ధనుః పౌష్పం మౌర్వీ మధుకరమయీ పంచవిశిఖాః
వసంత స్సామంతో మలయమరు దాయోధన రథః।
తథాఽప్యేక స్సర్వం హిమగిరిసుతే కామపి కృపామ్
అపాంగాత్తే లబ్ధ్వా జగదిద మనంగో విజయతే॥

టీక:- హిమగిరిసుతే = హిమవత్పర్వత రాజపుత్రికా, ధనుః = విల్లు, పౌష్పం పుష్పమయమైనది, మౌర్వీ = అల్లెత్రాడు, మధుకరమయీ = తుమ్మెదల వరస కూర్పు, విశాఖాః = బాణములు, పంచ = ఐదుమాత్రమే, సామంతః = చెలికాడు, వసంతః = (రెండు నెలల ఆయుష్షు కలిగిన) వసంత ఋతువు, ఆయోధన రథః యుద్ధమునకు ఉపయోగించు రథము, మలయమరుత్ = మలయ మారుతము, తథాపి = ఆవిధమైన పనికి సమర్థములు కాని సాధ్య సంపత్తి గలవాడైనను, అనంగః = శరీరమే లేని మన్మథుడు, ఏకః = ఒక్కడే (అయినను), తే = నీ యొక్క, అపాంగాత్ = కడగంటి చూపువలన, కాం + అపి = అనిర్వచనీయమైన, కృపాం = దయను, లబ్ధ్వా = పొంది, ఇదం = ఈ, సర్వం జగత్ = సమస్త జగత్తును, విజయతే = జయించుచున్నాడు.

ఓ హిమవత్పర్వత రాజపుత్రీ! "పుష్పమయమైన విల్లు, తుమ్మెదల వరుసతో కూర్చిన అల్లెత్రాడు, లెక్కకు ఐదు మాత్రమే బాణములు (కమలము (ఎర్రతామర) - రక్తకైరవము (ఎర్రకలువ) - కల్హారము (తెల్లకలువ) - ఇందీవరము (నల్లకలువ) - సహకారము (మామిడిపూవు)), అల్పాయుష్కుడు - జడుడు అయిన వసంతుడు చెలికాడు, మలయ మారుతమే రథము' - ఏ మాత్రమును సమర్థములు కానవియగు ఇట్టి సాధన సామాగ్రులతో

కనీసము శరీరము గూడా లేని వాడయ్యును మన్మథుడు నిన్ను ఆరాధించి, అనిర్వచనీయమైన నీ కరుణా కటాక్షమును పొంది ఈ సమస్త జగత్తును జయించు చున్నాడు కదా!

ఓ పర్వత రాజ పుత్రీ, మన్మధుని బాణం పుష్పములతోనూ, వింటి నారి తుమ్మెదలతోనూ చేయబడినది. అతడు తన అయిదు పుష్ప బాణములతోనూ, స్నేహితుడైన వసంతునితోను, మలయమారుతమనే రధముతోనూ, అశరీరుడైన కామదేవుడు, ఈ చరాచర జగత్తును మోహింప జేస్తున్నాడంటే, దానికి కారణం నీ చల్లని దృష్టి వీక్షణాలే కదా మాతా!

ఓ తల్లీ! హిమవంతుని కుమార్తె హైమవతీ! అనంగుడు ఉన్నాడే మన్మథుడు, అతడు పూలతో తయారుచేసిన ధనుస్సు, తుమ్మెదలు వరుసగా గల వింటి త్రాడు, ఐదు పూలబాణాలు తీసుకుని, మలయమారుతము అనే రథమెక్కి, వసంత కాలాన్ని చెలికానిగా చేసుకుని, నీ కృపాకటాక్షవీక్షణాలతో తాపసుల మీదకి యుద్ధానికి వెళ్ళి, వారిని ఓడించగలుగుతున్నాడు.

07. క్వణత్కాంచీ దామా కరి కలభ కుంభ స్తననతా
పరిక్షీణా మధ్యే పరిణత శరచ్చంద్ర వదనా।
ధనుర్బాణాన్ పాశం సృణి మపి దధానా కరతలైః
పురస్తా దాస్తాం నః పురమథితు రాహో పురుషికా॥

టీక:- క్వణత్ = చిరుసవ్వడి చేయు, కాంచీదామా = (గజ్జెల) మొలనూలు గలదియు, కరికలభ = గున్న ఏనుగుల, కుంభ = కుంభస్థలములతో పోల్చదగిన స్తన = స్తనములచేత, నతా = ఇంచుకవంగినట్లుగా కనబడునదియు, పరిక్షీణా = కృశించిన, మధ్యే = నడుము గలదియు, పరిణత = పరిపూర్ణమైన, శరత్ + చంద్రవదనా = శరదృతువునందలి పూర్ణిమా చంద్రుని వంటి వదనము గలదియు, కరతలైః = నాలుగు చేతులయందు, ధనుః = విల్లును, బాణాన్ = పుష్పమయమైన బాణములను, పాశం = పాశమును, అపి = మరియు, సృణి = అంకుశమును, దధానా = ధరించునదియు, పురమథితుః = త్రిపురహరుడైన శివుని యొక్క, ఆహోపురుషికా = అహంకార స్వరూపిణియగు జగన్మాత, నః = మాయొక్క, పురస్తాత్ = ఎట్టెదుట, ఆస్తాం = (సుఖాసీనయై) సాక్షాత్కరించు గాక!

చిరుసవ్వడి చేయు గజ్జెల మొల నూలు గలదియు, గున్న ఏనుగు కుంభములను పోలు స్తనములు కలిగి కొద్దిగా వంగినట్లు కనబడునదియు, సన్నని నడుము గలదియు, శరదృతువు నందలి పరిపూర్ణమైన పూర్ణిమా చంద్రుని పోలెడు ముఖము గలదియు, నాలుగు చేతుల యందు వరుసగా ధనస్సు, భాణములు, పాశము, అంకుశములను ధరించి యుండునదియు, త్రిపురహరుడైన శివుని యొక్క అహంకార స్వరూపిణియునగు జగన్మాత మాకు ఎదురుగా (సుఖాసీనురాలై) సాక్షాత్కరించు గాక!

నడుమకు ప్రకాశిస్తున్న వడ్డాణముతో, ఉన్నతమైన మాతృ స్థానములతో, సన్నని కటి భాగముతో, చంద్రబింబము వంటి ముఖముతో విరాజిల్లుతున్న జగన్మాత, తన చేతులలో, బాణములు, పాశము, అంకుశము, ధరించి ఉన్నది. త్రినేత్రుడైన శివ స్వరూపమే తన రూపమైన ఆదిశక్తి నా కనులకు గోచరమగుగాక!

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

దివ్యమైన కాంతులతో ప్రకాశిస్తున్న మణులు కూర్చిన గజ్జెలతో చేసిన మొలనూలు గలది, ఏనుగు కుంభస్థలములు వంటి పాలిండ్లు గలది, చేతులయందు ధనుస్సు, బాణములు, పాశము, అంకుశము ధరించి త్రిపురాసుర సంహారము చేసిన శివుని అహంకార రూపిణియైన ఆ దేవి నా ముందు సుఖాసీనయై ప్రత్యక్షమగుగాక.

08. సుధా సింధోర్మధ్యే, సురవిట పివాటీ పరివృతే
మణిద్వీపే నీపో పవనవతి చింతామణి గృహే।
శివాకారే మంచే పరమశివ పర్యంక నిలయామ్
భజంతి త్వాం ధన్యాః కతిచన చిదానంద లహరీమ్॥

టీక:- (తల్లీ! జగజ్జననీ!), సుధాసింధోః = అమృత లేదా క్షీర సముద్రము యొక్క, మధ్యే = మధ్య ప్రదేశ మందు, సురవిటపి = కల్పవృక్షముల యొక్క, వాటీ పరివృతే = వరుసలచే చుట్టబడిన, మణిద్వీపే = మణిమయమైన దీవియందు, నీప + ఉపవనవతి = కడిమి చెట్ల ఉద్యానవనము నందు, చింతామణి గృహే = చింతామణులచే నిర్మింపబడిన గృహము నందు, శివాకారే = శివాత్మకమైన, మంచే = మంచము నందు, పరమశివ పర్యంక = సదాశివుడను తల్పము, లేదా - సదాశివుని తొడను, నిలయాం = నెలవుగా గలిగిన, చిత్ + ఆనంద + లహరీం = జ్ఞానానందతరంగ రూపముగా నుండు, త్వాం = నిన్ను, కతిచిన = కొందరు, ధన్యాః = ధన్యులు (మాత్రమే), భజంతి = సేవించి తరించు చున్నారు.

జగజ్జననీ! సుధా సముద్రము నందలి మధ్య ప్రదేశము నందు, కల్పవృక్షముల వరుసచే చుట్టబడిన మణిమయ ద్వీపమునందు, కడిమి చెట్ల తోట యందు, చింతామణులచే కట్టబడిన గృహమునందు శివాకార మంచము నందు - సదాశివుని తొడను నిలయముగా కలిగి, జ్ఞానానంద తరంగ రూపముగా నున్న నిన్ను - కృతార్థులైన ఎవరో కొందఱు మాత్రమే సేవించి తరించుచున్నారు.

అమృత సముద్రం మధ్యలో, మణిద్వీపములో, కల్పవృక్షములు, కడిమి చెట్ల ఛాయలలో, కాంతులు చిందుతున్న చింతామణీ గృహంలో, పరమ శివుని పర్యంక తల్పంగా చేసుకుని, చిదానంద స్వరూపిణిగా ఆసీనురాలైన నిన్ను దర్శించగల అర్హత అందరూ పొందలేరు. ఎంతో ధన్యులైన కొంతమంది మాత్రమే, నీ నిరంతర స్మరణతో, నీ దివ్య దర్శన భాగ్యమును పొందగలరు.

దేవతా వృక్షాలు ఐదు: 1. మందారము, 2. పారిజాతము, 3. సంతానము, 4. కల్పవృక్షము, 5. హరిచందనము.

ఓ భగవతీ! పాలసముద్రము మధ్యన రతనాలదీవి. అందులో కల్పవృక్షాల వనం. ఆ మధ్యన కదంబ వృక్షాలు. వాటి మధ్యన చితామణులగృహము. అందులో త్రికోణాకారమంచమునందు, పరమశివుడు అనే శయ్యమీద ప్రకాశించే ఓ జ్ఞానస్వరూపిణీ! నిరతిశయ సుఖప్రదాయిని అయిన నిన్ను కొందరు ధన్యులు మాత్రమే సేవించగలుగుతున్నారు.

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

09. మహీం మూలాధారే, కమపి మణిపూరే, హుతవహం
స్థితం స్వాధిష్ఠానే, హృది మరుత, మాకాశ ముపరి।
మనోఽపి భ్రూమధ్యే, సకలమపి భిత్వా కులపథం
సహస్రారే పద్మే స హరహసి పత్యా విహరసే॥

టీక:- (జగజ్జననీ!) మూలాధారే = మూలాధార చక్రము నందు, మహీం = పృథివీ తత్త్వమును, మణిపూరే = మణిపూర చక్రము నందు, కం = ఆపస్తత్త్వము, అనగా - జలతత్త్వమును, స్వాధిష్ఠానే = స్వాధిష్ఠాన చక్రము నందు, హుతవహం = అగ్నితత్త్వమును, హృది = హృదయమందలి అనాహత చక్రము వద్ద, మరుతమ్ = వాయు తత్త్వమును, ఉపరి = పైన ఉన్న విశుద్ధి చక్రము నందు, ఆకాశం = ఆకాశతత్త్వమును, భ్రూమధ్యే = కనుబొమల నడుమవద్ద గల ఆజ్ఞా చక్రము నందు, మనోపి = మనస్తత్త్వమును గూడా (కలుపుకొని), కులపథం = కులమార్గము, అనగా - సుషుమ్నా మార్గమును, సకలం + అపి = సకలమపి = అంతను కూడ, భిత్వా = ఛేదించుకొని (చివరకు), సహస్రారే - పద్మే = సహస్రార కమలమందు, రహసి = ఏకాంతముగా నున్న, పత్యాసహ = భర్తయగు సదాశివునితో గూడి, విహర = క్రీడించుచున్నావు.

తల్లీ! జగజ్జననీ! మూలాధార చక్రమందు పృథివీ తత్త్వ మును, మణిపూరమందు జలతత్త్వమును, స్వాధిష్ఠానమందు అగ్నితత్త్వమును, హృదయ మందలి అనాహత మందు వాయు తత్త్వమును, విశుద్ధి యందు ఆకాశ తత్త్వమును, భ్రూమధ్యమందుండు ఆజ్ఞా చక్రమందు మనస్తత్త్వమును - ఈ విధముగా సుషుమ్నా మార్గము నంతను భేదించుకొనుచు పోయి, చిట్టి చివరకు సహస్రార కమలమందు ఒంటరిగానున్న నీ పతియైన సదాశివునితో కలసి రహస్యముగా విహరించుచున్నావు (గదా!).

దేవీ, మూలాధార, స్వాధిష్టాన, మణిపూర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞా చక్రములలో పృధ్వీ, జల, వాయు అగ్ని, ఆకాశ తత్వములను, మనసును దాటి, సహస్రార చక్రములో స్థితుడై ఉన్న సదాశివునితో క్రీడిస్తావు నీవు. ఈ విద్యను గురుముఖముగా సాధించినవారు మాత్రమే నిన్ను చేరగలరు.

ఓ తల్లీ! భగవతీ! నీవు మూలాధారంలో ఉన్న భూతత్వాన్ని, స్వాధిష్ఠాన చక్రంలోని అగ్నితత్వాన్ని, మణిపూరచక్రంలోని జలతత్వాన్ని, అనాహతచక్రంలోని వాయుతత్వాన్ని, విశుద్ధచక్రంలోని ఆకాశతత్వాన్ని, ఆజ్ఞాచక్రంలోని మనస్తత్వాన్ని దాటి సహస్రార కమలమందు ఉన్న సదాశివుని చేరుకుంటావు.

10. సుధాధారా సారైః చరణయుగళాంత ర్విగళితైః
ప్రపంచం సించంతీ పునరపి రసామ్నాయ మహసః।
అవాప్య స్వాం భూమిం భుజగనిభ మధ్యుష్ట వలయమ్
స్వ మాత్మానం కృత్వా స్వపిషి కులకుండే కుహరిణి॥

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

టీక:- (జగజ్జననీ!) చరణ + యుగళ + అంతర్విగళితైః = చరణాంబుజముల జంట మధ్య నుండి స్రవించుచున్న, సుధాధార + ఆసారైః = అమృత ధారా పాతము చేత, ప్రపంచం = పంచతత్త్వదేహమును ప్రేరేపించు నాడీమండల వ్యూహమును, సించంతీ = తడుపుచున్నదానవై, రస + ఆమ్నాయమహసః = అమృతము యొక్క గుణాతిశయ రూపకాంతులు గల చంద్రుని నుండి, స్వాంభూమిం = స్వకీయమైన భూతత్త్వమునకు సంబంధించిన ఆధార చక్రమును, పునఃఅపి = మరల, అవాప్య = పొంది, భుజగనిభం = సర్పమువలె, అధ్యుష్టవలయం = అధిష్ఠింపబడిన కుండలాకారమైన దానినిగా, స్వం + ఆత్మానాం = తనదగు నిజ స్వరూపమును, కృత్వా = చేసి (అనగా - ధరించి, లేదా - పొంది), కుహరిణీ = తామర పూవు బొడ్డు వద్ద నుండు సన్నని రంధ్రము వంటిదైన, కుల (కు = పృథివీ తత్త్వము, ల = లయము నొందు) సుషుమ్నా మూల మందలి, కుండే = కమల కందరూపమైన చక్రము నందు, స్వపిషి = నిద్రింతువు.

తల్లీ! జగజ్జననీ! నీ పాదముల జంట నడుమ జాలు వాఱు అమృతపు ధారాపాతముచే శరీరము నందలి 72,000 నాడీ మండల మార్గము నంతను తడిపి, అమృత రూపకాంతులు గల చంద్రుని వీడి, స్వస్థానమైన ఆధార చక్రము జేరి, అక్కడ నీ స్వరూపమును కుండలా కారముగా నుండు సర్పము వలె గావించి, తామర పూవు బొడ్డు వద్ద సన్నని రంధ్రము వలె నుండు మిక్కిలి సూక్ష్మమైన సుషుమ్నా మార్గము క్రింది కొన వద్ద గల ఆధార చక్రము-క్రింద కుండలినీ శక్తివై నిద్రింతువు.

ఈ శ్లోకం సహస్రార చక్రమును చేరే విధానాన్ని వివరిస్తోంది. అయితే సాధకులు తమంత తాముగా ఈ విధానాన్ని సాధన చేయరాదు. సిద్ధుడైన గురువు పర్యవేక్షణలోనే చేయాలి. దేవి యొక్క హస్తములనుండి ఉద్భవించిన అమృత ధార, సాధకుని యొక్క 72వేల నాడులను, ఆ అమృతంతో దడుపుతూ సహస్రార చక్రాన్ని చేరి, అక్కడ మూడు చుట్ల సర్పాకారములో ఉంటుంది.

ఓ తల్లీ! నీ పాదద్వంద్వము నుండి స్రవించిన అమృతధారలచేత సాధకుని శరీరంలోని 72,000 నాడీమండలము తడిపిన తరువాత, ఆ చంద్రమండలం వదలి స్వస్థానమైన మూలాధారచక్రం చేరి, అక్కడ నీ అసలురూపంతో పామువలె స్వయంభూలింగానికి మూడున్నర చుట్లు చుట్టుకుని, కుండలినీ శక్తివై నిద్రావస్థలో ఉంటావు

11. చతుర్భిః శ్రీ కంఠైః శివయువతిభిః పంచభిరపి
ప్రభిన్నాభి శ్శంభో ర్నవ భిరపి మూలప్రకృతి భిః।
చతుశ్చత్వారింశ ద్వసుదళ - కలాశ్ర - త్రివలయ-
త్రిరేఖాభి స్సార్థం తవ శరణ కోణాః పరిణతాః॥

టీక:- (తల్లీ! జగజ్జననీ!) చతుర్భిః = నలుగురైన, శ్రీ కంఠైః = శివులచేతను, శంభోః ప్రభిన్నాభిః = శివుని కంటె వేరైన, పంచభిరపి = ఐదుగురైన, శివయువతిభిః = శివశక్తులతోడను, నవభిః = తొమ్మిదియైన, మూల ప్రకృతిభిః అపి = మూలకారణములచేతను, తవ = నీ

యొక్క, శరణ = నిలయమగు శ్రీ చక్రము యొక్క, కోణాః = కోణములు, వసుదళ = అష్ట (ఎనిమిది) దళములచేతను, కలాశ్ర = షోడశ (పదునాలు) దళముల చేతను, త్రివలయ = మూడు మేఖలల (వర్తుల రేఖల) చేతను, తవ = నీ యొక్క, శరణ = నిలయమగు, శ్రీ చక్రము యొక్క, కోణాః = కోణములు, వసుదళ = అష్ట (ఎనిమిది) దళములచేతను, కలాశ్ర = షోడశ (పదునాలు) దళముల చేతను, త్రివలయ = మూడు మేఖలల (వర్తుల రేఖల) చేతను, త్రిరేఖాభిఃసార్థం = మూడు భూపురరేఖలతోడను, పరిణతాః = పరిణామమును పొందినవై, చతుశ్చత్వారింశత్ = నలుబది నాలుగు (అగుచున్నవి).

తల్లీ! జగజ్జననీ! నలుగురు శివుల చేతను, శివుని కంటె వేరైన ఐదుగురు శివశక్తుల చేతను, తొమ్మిది మూల ప్రకృతులతో, అష్టదళ, షోడశదళ, త్రివలయ త్రిరేఖల చేతను నీకు నిలయమైన శ్రీచక్రము నలుబది నాలుగు అంచులు గలది అగుచున్నది. (నలుగురు శివులనగా నాలుగు శివసంబంధ చక్రములని, ఐదు శివశక్తులనగా ఐదు శక్తి సంబంధ చక్రములని ఈ నాలుగు, ఐదు కలిసి మొత్తము మీద తొమ్మిది చక్రములతో (నవచక్రాత్మకమై) అలరారుచున్నదని తాత్పర్యము)

శ్రీచక్రముయొక్క వర్ణన ఈ శ్లోకములో వర్ణించబడినది. శ్రీకంఠుడైన ఈశ్వరునియొక్క నాలుగు కోణములు, జగన్మాత అయిన శక్తికి సంబంధించిన అయిదు కోణములు, శ్రీచక్ర నిర్మాణమునకు సంబంధ మూలములైన నవధాతువులు, వసుదళములు, కలాస్రము, త్రివలయము, త్రిరేఖలతో కూడి 44 కోణముల రూపముగా ఏర్పడినదే శ్రీ చక్ర రాజము. ఈ శ్రీచక్రమే నీ అధిష్టానము కదా తల్లీ!

ఓ తల్లీ! నాలుగుశివచక్రాలు, ఐదు శక్తి చక్రాలు, తొమ్మిది మూలప్రకృతికలతోను, అష్టదళము, షోడశదళము, వృత్తత్రయము, భూపురము అనే వాటితోను శ్రీచక్రము అలరారుతున్నది.

12. త్వదీయం సౌందర్యం తుహిన గిరికన్యే తులయితుం
కవీంద్రాః కల్పంతే కథమపి విరించి ప్రభృతయః।
యదాలోకౌత్సుక్యా దమర లలనా యాంతి మనసా
తపోభి ర్దుష్ప్రాపామపి గిరిశ సాయుజ్య పదవీమ్॥

టీక:- తుహిన గిరికన్యే = ఓ హిమవత్పర్వత రాజపుత్రీ! త్వదీయం = నీ యొక్క (దేహ), సౌందర్యం = అవయవముల అందచందములను, తులయితుం = ఉపమానములతో సరిపోల్చి చెప్పుటకు, విరించి ప్రభృతయః = బ్రహ్మ, విష్ణు ఇంద్రాదుల వంటి, క వీంద్రాః = కవిశ్రేష్ఠులు (సైతము), కథమపి = ఎట్లును సమర్థులుగాకున్నారు. (అనగా 'నీ సౌందర్యమును వర్ణించి చెప్పలేకున్నారు' అని అనుట). యదాలోకౌత్సుక్యాత్ = యత్ + ఆలోక + ఔత్సుక్యాత్ = ఏ కారణము వలన (అనగా నీ సౌందర్యమును చూచుట యందలి కుతూహలము వలన) అమర లలనాః = దేవతా స్త్రీలు (అనగా రంభ, ఊర్వశి, తిలోత్తమ మొదలైన అప్సరసలు), తపోభిః = నియమ నిష్ఠలతో తపస్సు చేసి గూడ, దుష్ప్రాపాం అపి = పొంద శక్యము

Kiron Type Institute
Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

కానిదైనను, గిరిశ సాయుజ్యపదవీం = శివునితోడ కలయికను (అనగా, శివసాయుజ్యానందమును), మనసా = మనస్సుచేత, యాంతి = పొందుచున్నారు.

ఓ హిమవత్పర్వత రాజపుత్రీ! నీ దేహ సౌందర్యమును ఉపమానములతో సరిపోల్చి వర్ణించి చెప్పుటకు బ్రహ్మ, విష్ణు, ఇంద్రాది కవి శ్రేష్ఠులు సైతము ఎంత ప్రయత్నించినను సమర్థులుగాకున్నారు. దేవతా స్త్రీలైన రంభ, ఊర్వశి, తిలోత్తమాది అతి సౌందర్యవతులగు అప్సరసలు నీ సౌందర్యమును చూచుటకు అమితముగా కుతూహలము గలవారై, నీ అందముతో తాము సాటి రానివారై, కఠిన తపస్సులచే గూడా పొందలేని శివసాయిజ్య స్థానమును మనస్సుచే పొందుచున్నారు.

ఓ పర్వత రాజ పుత్రీ, తాము ఎవరి సౌందర్యాన్నయినా వర్ణించగలమని కవులకు గర్వం, అటువంటి దేవతలు, కవులు కూడా నీ సౌందర్యాన్ని ఎవరితో పోల్చాలో తెలియక తికమక పడుతున్నారు. దేవతా స్త్రీలు నీ అందాన్ని ఒక్కసారైనా చూసి ఆనందించాలనీ, ఈశ్వరునితో కూడి ఉన్న నిన్ను తమ హృదయాలలో నిలుపుకోవాలని తాపత్రయ పడుతున్నారు. ఇంతకూ విషయమేమిటంటే మాతా, నీ సౌందర్యముతో పోల్చదగిన ఒక్క దేవతా స్త్రీ కూడా లేదు.

ఓ దేవీ! నీ శరీరలావణ్యమును వర్ణించటానికిగాని, నీ చక్కదనాన్ని చాటి చెప్పటానికిగాని, బ్రహ్మాది దేవతలు, కవిశ్రేష్ఠులు కూడా సమర్థులు కాలేకపోయారు. నీ సౌందర్యాన్ని వర్ణించటం వారికి వీలుపడటం లేదు. దేవలోకంలో అతిసుంద రాంగులైన అప్సరాంగనలు కూడా నీ చక్కదనాన్ని చూచి, విభ్రాంతులై, అదేపనిగా నిన్ను చూడాలనుకుంటున్నారు. నీ సౌందర్యముతో వారు కొంచెము కూడా సరిపోక, పరమశివునితో సాయుజ్యము పొంది, నీ సౌందర్యాన్ని అలా చూస్తూ ఉండిపోవాలని కోరుతున్నారు.

13. నరం వర్షీయాంసం నయన విరసం నర్మసు జడం
తవా పాంగాలోకే పతిత మను ధావంతి శతశః।
గలద్వేణీబంధాః కుచకలశ విస్రస్తసిచయాః
హఠాత్త్రుట్య త్కాంచ్యో విగళితదుకూలా యువతయః॥

టీక:- (తల్లీ జగజ్జననీ!) వర్షీయాంసం = మిక్కిలి ముసలివాడైనను, నయన విరసం = వికారమును గొలుపు కన్నులు గలవాడైనను, నర్మసుజడం = ప్రణయకామకేళీ విలాసాదుల యందు మోటువాడైనను, తవ = నీ యొక్క, అపాంగాలోకే = క్రీగంటి అనుగ్రహ వీక్షణమునకు పాత్రమైన, నరం = మనుష్యుని (అతడు మన్మథుని వలె కనబడి) చూచి, గళద్వేణీ బంధాః = జారుచున్న, లేదా - విడివడుచున్న జడల యొక్క ముడులు కలవారై; కుచకలశ = కడవల వంటి స్తనములపై నుండి, విస్రస్త = జారిపోయిన, సిచయాః = పైట కొంగులు గలవారై, హఠాత్ = ఆకస్మికముగా, త్రుట్యత్కాంచ్యః = తెగివిడిపోయిన మొలనూళ్ళు గలవారై, విగళిత దుకూలాః = వీడిపోయిన పోకముడులు కలవారై; శతశః = వందల కొలది, యువతయో = యౌవన దశలో నున్న ముద్దరాండ్రు, అనుధావంతి = అనుసరించి వెంట పరుగెత్తుచున్నారు.

అమ్మా! జగజ్జననీ! మిక్కిలి ముసలివాడైనను, వికారమును గొలుపు కన్నులు గలవాడైనను, ప్రణయ, కామకేళీ విలాసాదుల యందు మూఢుడైనను, నీయొక్క కృపావీక్షణమునకు పాత్రుడైనచో - అట్టివానిని చూచి - విడివడి జాఱిపడు జడముడులు కలవారై, కడవల వంటి స్తనములపై నుండి జాఱిపోయెడు పైటకొంగులు కలవారై, అప్పటికప్పుడే విడిపోయిన మొలనూళ్ళు, పోకముడులు కలవారై -వందల కొలది ప్రాయములో నున్న తరుణీ మణులు - వాని వెంట పరుగెత్తుదురు గదా! అనగా, అమ్మవారి అనుగ్రహము అట్టి కురూపిని గూడా మన్మథుని వంటి అందగాని వలె చేయునని భావము.

జగన్మాతా! నీ కరుణారస దృష్టి ఏ పురుషుని మీద ప్రసరిస్తుందో, అతడు ముదుసలియైన, అనాకారియైన, సమర్ధత లేనివాడైనా, ధనము లేనివాడైనా, నపుంసకుడైనా, ఈ గుణాలన్నీ అతనిని చూసేవారికి సుగుణాలుగా కనపడి, వయసుతో ఉన్న యువతులు, అతని పట్ల ఆకర్షితులై అతని చుట్టూ చేరుతారు. నీ చూపులకు ఉన్న శక్తి ఇది అని చెప్పడం శక్యం కాదు తల్లీ!

ఓ తల్లీ! పురుషుడు ఎంత ముసలివాడైనా, నడవటానికి ఓపిక లేనివాడైనా, అనాకారి అయినా, కళ్ళు కనుపించకపోయినా, జడుడయినప్పటికి, నీ కృపకు గనక పాత్రుడైనట్లైతే మదనవతులు తమ పయ్యెదలు జారిపోతున్నా, ఆభరణాలు చెదరి పోతున్నా, కట్టిన బట్టలు ఊడిపోతున్నప్పటికీ పట్టించుకోకుండా అతని వెంటపడతారు.

14. క్షితౌ షట్పంచాశ ద్ద్విసమధిక పంచాశదుదకే
హుతాశే ద్వాషష్టి శ్చతురధిక పంచాశ దనిలే।
దివి ద్విష్షట్త్రింశ న్మనసిచ చతుష్షష్టి రితి యే
మయూఖాస్తేషా మప్యుపరి తవపాదాంబుజ యుగమ్॥

టీకా:- తల్లీ! జగజ్జననీ! క్షితౌ = పృథివీ తత్త్వమునకు చెందిన మూలాధార చక్రమునందు, షట్పంచాశత్ = ఏబది యారు సంఖ్యగలవియు, ఉదకే = జలతత్త్వమునకు చెందిన మణిపూర చక్రమునందు, ద్విసమధిక పంచాశత్ = ఏబది రెండు సంఖ్య గలవియు, హుతాశే = అగ్నితత్త్వమునకు చెందిన స్వాధిష్ఠాన చక్రమునందు, ద్వాషష్టిః = అరువది రెండు సంఖ్యగలవియు, అనిలే = వాయు తత్త్వమునకు చెందిన అనాహత చక్రమునందు, చతురధిక పంచాశత్ = ఏబది నాలుగు సంఖ్యగలవియు, దివి = ఆకాశ తత్త్వమునకు చెందిన విశుద్ధి చక్రమునందు, ద్విఃషట్ త్రింశత్ = రెండు ముప్పది యాఱులు, అనగా డెబ్బది రెండు సంఖ్యగలవియు, మనసిచ = మనస్తత్త్వమునకు చెందిన ఆజ్ఞా చక్రము నందు, చతుఃషష్టిః = అఱువది నాలుగు సంఖ్య గలవియునై, ఇతి = ఈ విధముగా, యేమయూఖ = ఏ కిరణములున్నవో, తాషాం = వాటి అన్నిటికిని గూడ, ఉపరి = పైభాగమున, తవ = నీ యొక్క, పాదాంబుజయుగమ్ = చరణ కమలముల జంట (వర్తించుచున్నది).

అమ్మా! జగజ్జననీ! పృథివీ తత్త్వముతో కూడిన మూలాధార చక్రమునందు, ఏబది ఆరు, జలతత్త్వమునకు చెందిన మణిపూరమునందు ఏబది రెండు, అగ్ని తత్త్వమునకు చెందిన

Kiron Type Institute
Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

స్వాధిష్ఠానమునందు ఆరువది రెండు, వాయుతత్త్వమునకు చెందిన అనాహతమునందు ఏబది నాలుగు, ఆకాశ తత్త్వమునకు చెందిన విశుద్ధి యందు డెబ్బది రెండు, మనస్తత్త్వమునకు చెందిన ఆజ్ఞాచక్రము నందు అఱువది నాలుగు సంఖ్యలుగాగల వెలుగు కిరణములన్నిటిని అధిగమించి, వాటిపైన నీ చరణకమలములు ప్రకాశించు చున్నవి గదా!

మానవ శరీరములోని షట్చక్రమలకు సంబంధించిన విషయాన్ని, ఈ శ్లోకములో ప్రస్తావిస్తున్నారు శంకరులు. అమ్మా! మూలాధార చక్రములో 56, మణిపూర చక్రములో 52, స్వాధిష్టాన చక్రములో 62, అనాహత చక్రములో 54, విశుద్ధ చక్రములో 72, ఆజ్ఞా చక్రములో 64, మొత్తము 360 కిరణములు మూలాధారమునుండి సహస్రార చక్రము వరకు నిండి ఉన్నాయి. ఈ 360 కిరణములను దాటి వెళితే సహస్రార చక్రములో నీవు దర్శనమిస్తావు.

ఓ తల్లీ! పృథివీతత్త్వముతో కూడిన మూలాధార చక్రమందు యాభైఆరు, జలతత్త్వాత్మకమైన మణిపూర చక్రమందు యాభైరెండు, అగ్నితత్త్వాత్మకమైన స్వాధిష్ఠాన చక్రమందు అరవైరెండు, వాయుతత్త్వాత్మకమైన అనాహత చక్రమందు యాభైనాలుగు, ఆకాశతత్త్వాత్మకమైన విశుద్ధి చక్రమందు డబ్భైరెండు, మనస్తత్త్వాత్మకమైన ఆజ్ఞాచక్రమందు అరవైనాలుగు, వెరసి 360 కిరణాలు. ఈ మొత్తం చంద్ర మండలంలోని సహస్రారచక్రంలో ఉన్న నీ పాదాల నుంచే ప్రసరిస్తున్నాయి.

15. శరజ్జ్యోత్స్నా శుద్ధాం శశియుత జటాజూట మకుటాం
వరత్రాసత్రాణ స్ఫటిక ఘు(ఘ)టికా పుస్తక కరామ్।
సకృన్నత్వా నత్వా కథమివ సతాం సన్నిదధతే
మధుక్షీర ద్రాక్షా మధురిమ ధురీణాః ఫణితయః॥

టీకా:- తల్లీ! జగజ్జననీ! శరత్+జ్యోత్స్నా = శరత్కాలపు వెన్నెలవలె, శుద్ధాం = శుద్ధమైన స్వచ్ఛమైన తెల్లని కాంతులు విరజిమ్మునదియు, శశియుత = నెలవంకరేఖను కూడిన, జటాజూట = జుట్టు ముడి అనెడి, మకుటాం = కిరీటము గలదియు, వర = వరద ముద్రను, త్రాసత్రాణ = అభయముద్రయు, స్ఫటిక ఘుటికా = స్ఫటికములతో కూర్చబడిన అక్షమాలయు, పుస్తక = పుస్తకమును, కరాం = హస్తములందు గలిగినదానిగా, త్వా = నిన్ను, సకృత్ = ఒక్కమారు, నత్వా = నమస్కరించిన, సతాం = బుద్ధిమంతులకు, మధు = తేనె, క్షీర = పాలు, ద్రాక్షా = ద్రాక్ష ఫలముల, మధురిమ = తీయదనమును, ధురీణాః = వహించి యున్న మధురాతి మధురమైన, ఫణితయః = వాగ్విలాస వైఖరులు, కథమివ = ఎట్లు, సన్నిదధతే = ప్రాప్తించకుండును?

తల్లీ! జగజ్జననీ! శరత్కాలపు వెన్నెలను పోలెడు తెల్లని దేహచ్ఛాయ గల దానివి గాను, నెలపొడుపు చంద్రరేఖను కూడిన జుట్టు ముడి అనెడి కిరీటము గల దానివి గాను, వరద - అభయ - స్ఫటికాక్షమాల - పుస్తకములను - నాలుగు హస్తములందు గల దానివిగాను; నిన్ను ధ్యానించి, ఒక్కసారి నమస్కరించునట్టి సత్పురుషులకు పూదేనె - పాలు - ద్రాక్షా

Kiron Type Institute
Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

ఫలరసముతో సాటి వచ్చు మాధుర్యము గల వాగ్విలాస వైఖరులు ఎట్లు ప్రాప్తించకుండును? అనగా, తప్పక అట్టి వాక్కులు వారికి ప్రాప్తించునని భావము.

శరత్ కాలములో ఉజ్జ్వలంగా ప్రకాశించే చంద్రుని నీ శిరోజాలలో అలంకరించుకుని వెలిగిపోతున్నావు. వరద ముద్రను ఒక చేత, అభయ ముద్రతో మరొక చేత భక్తులను కరుణిస్తున్నావు. మరి రెండు చేతులలో – అక్షమాలను, పుస్తకమును ధరించిన నీ రూపమును దర్శించిన వారికి మధు క్షీర ద్రాక్షముల వలె అమృతపూరితములైన మధుర వాక్కులను ప్రసాదిస్తావు తల్లీ.

ఓ తల్లీ! శరత్కాలమునందలి వెన్నెలలాగా స్వచ్ఛమైన శరీరముతోను, లేత జాబిల్లితో కూడిన జడముడి, కిరీటము, సకలాభీష్టములను తీర్చే వరదముద్ర, భయాన్ని పోగొట్టే అభయముద్ర, స్ఫటికమణులతో కూడిన అక్షమాల, విద్యా సంకేతమైన పుస్తకము చేతులయందు ధరించిన నీకు నమస్కరించిన వారికి నిన్ను ఆరాధించిన వారికి తేనియవలె తీయనైనవి, ద్రాక్ష పాకమువలె రుచియైనవి (ఇంపైనవి) అయిన మధురమైన వాగ్వైఖరులు ప్రాప్తిస్తాయి.

16. కవీంద్రాణాం చేతః కమలవన బాలాతప రుచిం
భజంతే యేసంతః కతిచి దరుణామేవ భవతీమ్।
విరించి ప్రేయస్యా స్తరుణ తర శృంగారలహరీ
గభీరాభిర్వాగ్భి ర్విదధతి సతాం రంజనమమీ॥

టీక:- కవీంద్రాణాం = కవిశ్రేష్ఠుల యొక్క, చేతః కమలవన = చిత్తములు అనెడి పద్మవనములకు, బాలాతపరుచిం = ఉదయసూర్యుని లేత అరుణకాంతియై, అరుణాం + ఏవ = అరుణ వర్ణము గల, భవతీం = నిన్ను, కతిచిత్ = కొందఱు, ఏ సంతః = ఏ విబుధ జనులు, భజంతే = సేవించుదురో, (అట్టి) అమీ = వీరు, విరించి ప్రేయస్యాః = సరస్వతీ దేవి యొక్క, తరుణతర = ఉప్పొంగు పరువపు (ఉప్పొంగు యవ్వనపు), శృంగార = శృంగార రసము యొక్క, లహరీ = పొంగి ప్రవహించు ప్రవాహము వలె, గభీరాభిః = గంభీరములైన, వాగ్భిః = వాగ్విలాసము చేత, సతాం = సత్పురుషులకు, రంజనం = హృదయానందమును, విదధతి = చేయుచున్నారు.

ఉత్తమ కవుల చిత్తములనెడు కమలముల ఉద్యాన వనమునకు ఉదయ సూర్యుని లేయెండ ఛాయతో అరుణ వర్ణముతో నుండు నిన్ను (లేదా 'అరుణ' అను పేరు గల నిన్ను) సేవించు విబుధులు – సరస్వతీ దేవి యొక్క పరిఢవించిన పరువపు శృంగార రస ప్రవాహముల వలె నుండు గంభీరమైన వాగ్విలాస సంపద చేత సత్పురుషుల హృదయములను రంజింప చేయుదురు గదా!

అమ్మా! అసలే నీ రంగు ఎఱుపు. ఆ ప్రకాశవంతమైన అరుణ కాంతులతో ప్రజ్వరిల్లుతున్న నిన్ను ఎవరైతే మానసికంగా వీక్షిస్తారో, వారు నీ కటాక్షముచే అద్భుతమైన వాక్కును పొంది ఆ వాక్ప్రవాహముతో, జనులను మంత్ర ముగ్ధులను చేసి ఆకట్టు కోగలుగుతారు.

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

ఓ భగవతీ! నీవు కవీంద్రులు అనే పద్మవనానికి లేత సూర్యకాంతివి. అరుణారుణఛాయలో ఉన్న నిన్ను సేవించినవారు పుంభావసరస్వతులై శ్లాఘనీయమైన తమ శృంగార వాగ్విలాసములో సభను రంజింపజేయుచున్నారు.

17. సవిత్రీభిర్వాచాం శశిమణి శిలాభంగ రుచిభిః
వశిన్యాద్యాభిస్త్వాం సహజనని సంచింతయతి యంః।
స కర్తా కావ్యానాం భవతి మహతాం భంగిరుచిభిః
వచోభిర్వాగ్దేవీ వదన కమలామోద మధురైః॥

టీక:- (ఓ జగజ్జననీ!) వాచాం = వాక్కుకు, పవిత్రీభిః = జనక స్థానీయులును, శశిమణి శిలా = చంద్రకాంతమణుల, భంగ = ముక్కల యొక్క, రుచిభిః = కాంతులను పోలెడు (తెల్లని దేహ) కాంతి గలవారైన, వశిన్యాదిభిః సహ = వశినీ మొదలగు శక్తులతో గూడ, త్వాం = నిన్ను, యః = ఎవడు, సంచితయతి = చక్కగా ధ్యానించునో, సః = అతడు, మహతాం = వాల్మీకి మొదలైన మహాకవుల యొక్క, భంగిరుచిభిః = (రచనల) రీతుల వలె నుండు రసవంతమైన, వాగ్దేవీ వదన కమల = సరస్వతీదేవి ముఖము అనెడు కమలము నందలి, ఆమోద = పరిమళముచే, మధురైః = మధురములైన, వచోభిః = వాక్సంపత్తితో, కావ్యానాం = కావ్యములకు, కర్తాభవతి = రచయితగా సమర్థుడగు చున్నాడు.

జగజ్జననీ! వాక్కులను సృజించు వారును, చంద్రకాంతమణుల శకలముల వలె తెల్లనైన దేహముల కాంతికలవారును అగు - వశినీ మొదలగు శక్తులతో గూడ నిన్ను ఎవడు చక్కగా ధ్యానించునో వాడు - మహాకవులైన వాల్మీకి, కాళిదాసాదుల కవిత్వరచన వలె మధురమైన, శ్రవణరమణీయమైన, సరస్వతీ దేవి యొక్క ముఖ కమల పరిమళములను వెదజల్లు మృదువైన వాక్కులతో - రసవంతమైన కావ్య రచన చేయగల సమర్థుడగును.

అత్యంత ప్రకాశమునకు మారుపేరైన చంద్ర కాంత శిలల వంటి వశిన్యాది వాక్ దేవతలు కొలిచే నిన్ను సరస్వతీ స్వరూపముగా ఆరాధించే వారు కవీంద్రులై శారదా దేవి కృపతో అనేకానేక కావ్యాలను వ్రాయగలుగుతున్నారు.

ఓ తల్లీ! చంద్రకాంతి శిలలవలె తెల్లని శరీరచ్ఛాయ కలవారైన, వశిని మొదలైన ఎనిమిదిమంది వాగ్దేవతలు, పన్నెండుమంది యోగినులు, గంధాకర్షిణి మొదలైన ఆకర్షణ దేవతలు నలుగురుతో కూడిన నిన్ను ధ్యానించేవాడు సరస్వతీ స్వరూపుడై మృధుమధురమైన కవిత్వం చెప్పగల కాళిదాసువంటి మహాకవి అవుతాడు.

18. తనుచ్ఛాయాభిస్తే తరుణ తరణి శ్రీ సరణిభిః
దివం సర్వాముర్వీ మరుణిమ నిమగ్నాం స్మరతి యః।
భవంత్యస్య త్రస్యద్వన హరిణ శాలీన నయనాః
సహోర్వశ్యా వశ్యాః కతికతి న గీర్వాణ గణికాః॥

టీక:- (ఓ జగజ్జననీ!) తరుణ తరణి = ఉదయ సూర్యుని యొక్క, శ్రీ సరణిభిః = కాంతి సౌభాగ్యమును బోలు, తే = నీ యొక్క, తనుచ్ఛాయాభిః = దేహపు కాంతుల చేత, సర్వా = సమస్తమైన, దివం = ఆకాశమును, ఉర్వీం = భూమిని, అరుణిమని = అరుణ వర్ణము నందు, మగ్నాం = మునిగినదానిగా, యః = ఏ సాధకుడు, స్మరతి = తలంచు చున్నాడో, అస్య = అట్టి సాధకునికి, త్రస్యత్ = బెదరుచుండు, వనహరిణ = అడవి లేళ్ళ యొక్క, శాలీన = సిగ్గుతో అతి సుందరము లైన, నయనా = కన్నులు కలిగిన వారు, గీర్వాణ గణికాః = దేవలోక వేశ్యలు, (అనగా – అప్సర స్త్రీలు) ఊర్వశ్యాసహ = ఊర్వశి అను అప్సర స్త్రీతో సహా, కతికతి = ఎందరెందఱో, న వశ్యాః భవంతి = లొంగిన వారు ఏలకారు? – అనగా అందఱూ వశ్యులగుదు రని భావము.

జగజ్జననీ! ఉదయించుచున్న బాల సూర్యుని అరుణారుణ కాంతి సౌభాగ్యమునుబోలు నీ యొక్క దివ్య దేహపు అరుణ కాంతులలో – ఈ సమస్తమైన ఆకాశము, భూమియు మునిగి యున్నట్లు భావించి ధ్యానించెడు సాధకునికి – బెదురు చూపులతో నుండు అడవి లేళ్ళ యొక్క సింగారపు కన్నులు కలిగిన దేవలోక వేశ్యలైన అప్సర స్త్రీలు – ఊర్వశితో సహా – అందరూ వశీకృతులౌదురు గదా!

అమ్మా! నీ శరీరము తేజః కాంతి పుంజము. అందులో నుండి వెలువడే కాంతి కిరణములు ఈ జగమంతా వ్యాపించి ఉన్నాయి. ఎవరైతే నీ దివ్య కాంతి పుంజములను దర్శించగలరో, వారికి ఈ ప్రపంచములో వశము కానివారు ఎవరైనా ఉంటారా.

ఓ తల్లీ! ఉదయిస్తున్న బాలభానునిలాగా ప్రకాశిస్తున్న నీ శరీర కాంతి వల్ల ఈ భూమి, ఆకాశము అంతా ఎరుపు రంగులో ఎవరు ధ్యానిస్తారో, అడవి లేళ్ళవలె బెదురుచూపులు గల రంభ, ఊర్వశి మొదలైన అప్సరాంగనలతో సహా వశము కాని వారుండరు.

19. ముఖం బిందుం కృత్వా కుచయుగ మధస్తస్య తదధో
హరార్థం ధ్యాయే ద్యో హరమహిషి తే మన్మథ కలామ్।
ససద్య స్సంక్షోభం నయతి వనితా ఇత్యతి లఘు
త్రిలోకీ మప్యాశు, భ్రమయతి రవీందుస్తన యుగామ్॥

టీక:- హరమహిషి = ఓ శివుని పట్టమహిషీ!, ముఖం = ముఖమును, బిందుం కృత్వా = బిందువునుగా చేసి (అనగా – బిందుస్థానమును ముఖముగా ధ్యానించి అని అర్థము), తస్య = ఆ ముఖమునకు, అధః = క్రింది భాగమునందు, కుచయుగం కృత్వా = స్తనద్వయమును ధ్యానించి, తత్+అధః = తదధః = అస్తనద్వయమునకు క్రిందుగా, హరార్థం కృత్వా = హరుని సగభాగమును, అనగా – శక్తిని, అనగా త్రికోణమును, అనగా – యోని రూపమును, యః = ఏ సాధకుడు, ధ్యాయేత్ = ధ్యానించునో, సః = ఆ సాధకుడు, సద్యః = వెనువెంటనే, వనితాః = కామాసక్తులగు స్త్రీలను, సంక్షోభం = చిత్తవికారమున, నయతి ఇతి = పొందించు చున్నాడు. ఈ విషయము అతిలఘు = అతి స్వల్ప విషయము (అనగా – ఈ విధముగా

చేయుట పెద్ద గొప్ప విషయమేమియు కాదని భావము) ఏమనగా, అతడు – రవీందుస్తనయుగాం = సూర్య చంద్రులే స్తనములుగా గల, త్రిలోకీం అపి = మూడు లోకములనెడు (స్వర్గ, మర్త్య, పాతాళ లోకములనెడు) స్త్రీని సైతము, ఆశు = శీఘ్రముగా, భ్రమయతి = భ్రమింప చేయుచున్నాడు (కాబట్టి)

ఓ సదాశివుని పట్టమహిషీ! బిందుస్థానమును ముఖముగాను, దానికి క్రింద భాగమును కుచయుగముగాను, ఇంకను క్రిందుగానున్న హరార్ధమును శక్తి, లేదా – త్రికోణమును, లేదా – యోని రూపమును – ఏ సాధకుడు ధ్యానించునో, ఆ ధ్యాన ఫలితముగా – కామా సక్తులైన స్త్రీలను, చిత్తక్షోభమునకు, అనగా – కామ విషయమై కలవరపడునట్లు చేయుచున్నాడు. ఈ విషయము ఏమంత లెక్కలోనిది కాదు. ఏలననగా – ఆ సాధకుడు సూర్య చంద్రులను స్తనయుగముగా గలిగిన త్రిలోకిని, అనగా – స్వర్గ, మర్త్య పాతాళ లోకములనెడు స్త్రీనే శీఘ్రముగా భ్రమింప చేయుచున్నాడు కనుక.

(ప్రతి వ్యక్తిలోను – దేహము నందు నాభికి దిగువ భాగమును పాతాళముగా, నాభి–కంఠముల మధ్య భాగమును మర్త్య లోకముగా, కంఠమునకు పైన వుండు శిరోభాగమును దేవ లోకముగా భావింప వచ్చును)

ఈ శ్లోకము అర్ధనారీశ్వర తత్వములోని గూఢార్ధమును తెలియచేయు చున్నది. సూక్ష్మంగా చెప్పాలంటే **క్లీం** అక్షరములోని పై బిందువు అమ్మవారి ముఖము, క లోని మధ్య గీతకు ఇరువైపుల ఉన్నవి మాతృ స్థానములు గాను, క లో క్రింద ఉన్న గీత ఈశ్వరుడు గానూ భావించి నమస్కరించిన వారు త్రిలోకములను మోహమునకు గురి చేయగలరు.

ఓ జననీ! బిందుస్థానమందు ముఖాన్ని, దానికి కొంచెం క్రిందుగా స్తన యుగ్మము ఉంచి, దానికి కొంచెం దిగువన శివునిలో సగమయిన శక్తిని అంటే త్రికోణాన్ని యోనిగా భావించి ఆ త్రికోణంలో కామరాజ బీజాన్ని గనక ధ్యానం చేసినట్లైతే, అతడు మదవతులైన స్త్రీలమనసులను కలత చెందించటమే కాదు, సూర్యచంద్రులు చనుగవగా ఉన్న స్వర్గ, మర్త్య, పాతాళలోకాలు మూడింటినీ మోహింపచేస్తాడు.

20. కిరంతీ మంగేభ్యః కిరణ నికురం బామృత రసం
హృది త్వా మాధత్తే హిమకర శిలామూర్తి మివ యః।
స సర్పాణాం దర్పం శమయతి శకుంతాధిప ఇవ
జ్వరప్లుష్టాన్ దృష్ట్యా సుఖయతి సుధాధార సిరయా॥

టీక:- (ఓ జగజ్జననీ!) యః = ఏ సాధకుడు, అంగేభ్యః = కరచరణాది అవయవముల నుండి, కిరణనికురంబామృతరసం = వెలుగుల వెల్లువ నుండి పుట్టిన అమృతరసమును, కిరంతీం = వర్షించు చున్న దానివిగా, త్వాం = నిన్ను, హృది = హృదయమునందు, హిమకర శిలామూర్తి + ఇవ = చంద్ర కాంతి మణిమయ ప్రతిమవలె, ఆధత్తే = ధారణ చేసి ధ్యానించునో, సః = ఆ సాధకుడు, సర్పాణాం = పాముల యొక్క, దర్పం = పొగరును,

శకుంతాధిప ఇవ = గరుత్మంతుని వలె (అనగా – గరుత్మంతుడు శాంతింప చేసినట్లు) శమయతి = శాంతింప చేయుచున్నాడు. జ్వరప్లుష్టాన్ = జ్వరతాపముచే బాధపడువారిని, సుధాధార సిరయా = అమృతమును స్రవించు నాడివంటి, దృష్ట్యా = వీక్షణము చేత, సుఖయతి = సుఖమును కలుగ చేయు చున్నాడు.

జగజ్జననీ! కరచరణాది అవయవములనుండి ప్రసరించు కిరణ పుంజమునుండి జనించిన అమృత రసమును వర్షించు చుండు నిన్ను – ఏ సాధకుడు చంద్రకాంతి మణిచే నిర్మితమైన దేహము గల ప్రతిమవలె హృదయమున ధారణ చేసి ధ్యానించునో – ఆ సాధకుడు విషసర్పముల దర్పమును – గరుత్మంతునివలె శాంతింప చేయును.

అమ్మా! నీ శరీరం నుండి వెదజల్లబడుతున్న కాంతి కిరణాలు నిండు చంద్రుని నుండి స్రవించే అమృత ధారలుగా వెలుగుతున్నాయి. అటువంటి తేజముతో నిండిన కాంతిపుంజమును మనసులో దర్శించిన వారికి గరుడ భగవానుని దర్శించిన సర్పాలు ఎలా తొలగిపోతాయో, అదే విధంగా, అమ్మ అమృత ధారలను ఆస్వాదించిన వారికి జ్వరములు, రోగాలు తొలగిపోతాయి.

తల్లీ! కరచరణాది సర్వావయవముల నుండి, కిరణములనుంచి అమృతధారలు స్రవిస్తున్న నిన్ను, చంద్రకాంతి శిలాప్రతిమలాగా, హృదయమందు ప్రతిష్ఠించి ధ్యానించేవాడు, విషసర్పములకు దర్పాన్ని కలిగించే విషాన్ని గరుత్మంతునిలాగా హరించివేస్తాడు. విషబాధలు పోగొట్ట కలుగుతాడు. జ్వరతీవ్రతతో బాధపడే వారి తాపాన్ని తగ్గించగలుగుతాడు.

21. తటిల్లేఖా తన్వీం తపనశశి వైశ్వానరమయీం
నిషణ్ణాం షణ్ణా మప్యుపరి కమలానాం తవ కలామ్।
మహాపద్మాటవ్యాం మృది తమల మాయేన మనసా
మహాంతః పశ్యంతో దధతి పరమాహ్లాదలహరీమ్॥

టీక:- (ఓ జగజ్జననీ!) తటిత్ + లేఖా = మెఱుపు తీగవంటి, తన్వీం = సూక్ష్మమైన, క్షణ ప్రకాశ వికాస లక్షణము గలదియు, తపనశశి వైశ్వానరమయీం = సూర్య చంద్రాగ్ని రూపము కలదియు, షణ్ణాం = ఆరు సంఖ్యగలదియు, కమలానాం = పద్మముల యొక్క అనగా – షట్చక్రముల యొక్క, అపి ఉపిరి = మరియు పై భాగమందు, మహా పద్మాటవ్యాం = గొప్పతామర తోటయందు అనగా – సహస్రార కమలమందు, నిషణ్ణాం = కూర్చున్న, తవ = నీ యొక్క, కలాం = 'సాదాఖ్య' అను కళను, మృదిత = క్షాళనము కావింపబడిన, మలమాయేన = కామాది మలినములు, అనగా – మాయ, అవిద్య, అహంకారాదులు గల, మనసా = మనస్సు చేత, పశ్యన్తః = చూచుచున్న, మహాంతః = మహాపురుషులు, అనగా – యోగీశ్వరులు, పరమానందలహరీం = ఉత్తమ సుఖానుభవ రసానంద ప్రవాహమును, దధతి = పొందుచున్నారు.

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

తల్లీ! జగజ్జననీ! మెఱుపు తీగవలె సొగసైన, సూక్ష్మమైన, పొడవైన క్షణకాల ప్రకాశ వికాస విలక్షణము గలదియు, సూర్య చంద్రాగ్ని రూప సమన్వితమైనదియు, షట్చక్రముల పైభాగమున గల గొప్పతామర తోటయందు, అనగా – సహస్రార కమలమందు వెలుగొందు నీ యొక్క 'సాదాఖ్య' కళను – కామాది మలినములను పోగొట్టి కొనిన మనస్సుతో మహాపురుషులైన యోగీశ్వరులు – ధ్యానించి, మహదానంద ప్రవాహములో ఓలలాడు చున్నారు.

అమ్మా! సూర్యుడు, చంద్రుడు, అగ్ని ఈ మూడింటి తేజోస్వరూపమైన షట్ చక్రములు ఆ పైన సహస్రార చక్రము యొక్క పై భాగాన మెరుపు తీగలాగ వెలిగే నీ కాంతిపుంజ రూపమును మానసికంగా దర్శించగలిగినవారు దివ్యానుభూతులకు లోనై, అవ్యాజమైన ఆనందమునకు లోను అవుతున్నారు.

తల్లీ! మాయచేత ఏర్పడిన అవిద్య, అహంకారాలను పోగొట్టుకున్న యోగీశ్వరులు మూలాధారము మొదలైన షట్చక్రాలకు పైభాగాన సహస్రారము అనే సహస్రదళ కమలముల వనంలో, తామరదుద్దునందు మెరుపుతీగలాగా కాంతివంతమై, సూక్ష్మమై జ్యోతిరూపమైన నీ సాదాఖ్యకళను, సదా సేవిస్తూ నిరతిశయానందమును పొందుతున్నారు.

22. భవాని త్వం దాసేమయి వితర దృష్టిం సకరుణాం
ఇతి స్తోతుం వాంఛన్ కథయతి భవాని త్వ మితియః।
తదైవ త్వం తస్మై దిశసి నిజసాయుజ్య పదవీం
ముకుంద బ్రహ్మేంద్ర స్ఫుట మకుట నీరాజిత పదామ్॥

టీక:- (హే) భవానీ! = ఓ భవుని రాణీ!, త్వం = నీవు, దాసే = దాసుడనైన, మయి = నా యందు, సకరుణాం = దయతో కూడిన, దృష్టిం = చూపును, వితర = ప్రసరింప చేయుము, ఇతి = ఈ ప్రకారముగా, స్తోతుం = స్తుతించుటకు, వాంఛన్ = ఇచ్ఛ గించువాడై, 'భవానిత్వం' ఇతి = 'భవానిత్వం' అని, కథయతి = పలుకునో, తస్మై = ఆ విధముగా ఉచ్చరించు వానికు, త్వం = నీవు, తదైవ = ఆ విధముగా ఉచ్చరించుట పూర్తి కాకమునుపే, ముకుంద = విష్ణువు, బ్రహ్మ = బ్రహ్మదేవుడు, ఇంద్ర = దేవేంద్రుడు అనువారి యొక్క, స్ఫుట మకుట = స్పష్టముగా కనబడు కాంతివంత కిరీటముల చేత, నీరాజిత = హారతి ఇవ్వబడిన, పదాం = అడుగులు కల, నిజసాయుజ్య పదవీం = నీ తోడి తాదాత్మ్యమును, దిశసి = ఇచ్చెదవు.

తల్లీ! భవానీ! 'నేను దాసుడను. నీవు నా యందు దయతో కూడిన నీ చల్లని చూపును ప్రసరింప చేయుము' అని ఈ విధముగా స్తుతించదలచిన వాడై – నిన్ను పై విధముగా, అనగా – 'భవానిత్వం' అని మొదలు పెట్టి ఇంకను చెప్పబోవు లోపునే వానికి హరి బ్రహ్మేంద్రుల రత్న కిరీటములచే హారతి పట్టబడు నీ పద సాయుజ్యమును ఇత్తువు.

అమ్మా! భవానీ! నీ భక్తుడు నిన్ను స్మరించదలచి, ఓ భవానీ, నీ దాసుడనైన నన్ను కరుణాదృష్టితో చూడమని ప్రార్థించదలచి, భవానీ, త్వం అని ప్రార్థించే సరికే నీవు వాని

హృదయమును అర్థం చేసుకుని వానికి ముక్తిని ప్రసాదిస్తావు. భక్తి ముఖ్యం కానీ, భక్తి కాదుకదా! మా భక్తితోనే, బ్రహ్మ, విష్ణు, ఇంద్రాదులు తమ కిరీట కాంతులచే నీకు హారతులిచ్చే నీ పాదాలదగ్గర మాకు కూడా చోటు కల్పిస్తావు.

తల్లీ! నీ కృపాకటాక్ష వీక్షణాలను తన మీద ప్రసరింపజేయవలసినది అనే కోరికతో నిన్ను స్తుతించే భక్తుడు "తల్లీ నీవు" అనే రెండు మాటలు పలికినంత మాత్రం చేతనే హరిహర బ్రహ్మేదులు కోరుకునే సాయుజ్యపదవిని అతనికి అనుగ్రహిస్తున్నావు.

23. త్వయా హృత్వా వామం వపు రపరితృప్తేన మనసా
శరీరార్ధం శంభో రపరమపి శంకే హృతమభూత్।
యదౌ(దే)త త్వద్రూపం సకల మరుణాభం త్రినయనమ్
కుచాభ్యా మానమ్రం కుటిల శశి చూడాల మకుటమ్॥

టీక:- (ఓ జగజ్జననీ!) త్వయా = నీ చేత, శంభోః = శివుని యొక్క, వామం = ఎడమ భాగమైన, వపుః = దేహము, హృత్వా = అపహరింపబడి, అపరితృప్తేన = సంతుష్టినొందని, మనసా = మనస్సు చేత, అపరం = రెండవ (కుడి) భాగమైన, శరీరార్ధం అపి = (శివుని) శరీరము యొక్క రెండవ దైన కుడి భాగమును సైతము, హృతం = గ్రహింపబడినదిగా, అభూత్ = ఆయెనని, శంకే = సందేహ పడెదను, యత్ = ఏ కారణము వలన, ఏతత్ = (నా హృదయములో భాసించు) ఈ, త్వత్ రూపం = ఈ దేహము, సకలం = వామ దక్షిణ భాగములు రెండును, అరుణాభం = ప్రాతఃకాల సూర్యుని వంటి ఎఱ్ఱని కాంతి గలవియై, త్రినయనం = మూడు కన్నులతో గూడినదియు, కుచాభ్యాం = స్తన యుగ్మముచే, ఆనమ్రం = కొద్దిగా ముందుకు వంగినదియు, కుటిల శశిచూడాల మకుటం = వంకరగా నుండు చంద్రకళచే శిరోమణి గల కిరీటము గలదై ఒప్పుచున్నదో (అందువలన సందేహపడితిని - అని అర్థము)

తల్లీ! జగజ్జననీ! నీ దేహమంతయు అరుణకాంతులు వెదజల్లుతూ, మూడు కన్నులు గలిగి, స్తన భారముచే కొద్దిగా వంగినట్లు కనబడుచు, నెలవంకను శిరోమణిగా గలిగి యుండుటను చూడగా - మొదట నీవు శివుని శరీర వామ భాగమును హరించి, అంతటితో సంతృప్తి చెందక, కుడిభాగమైన శరీరార్థమును కూడ హరించితివి కాబోలునని సందేహము కలుగుచున్నది.

అమ్మా! తాదాత్మ్యమైన ఈశ్వరుని, నీరూపములు అభేదములు. ఈశ్వరునివలె అరుణమైన శరీర కాంతి, మూడు నేత్రములు, కుచభాగములు, బాలచంద్రునిచే ప్రకాశిస్తున్న కిరీటము ఇవి మీ ఇద్దరికీ కనబడుతున్నాయి. దీనిని చూస్తుంటే, ఈశ్వరుడు ప్రసాదించిన అర్థ శరీరముతో తృప్తి పడక ఆయన మొత్తం శరీరాన్ని నిండి ఉన్నావని భావిస్తాను.

ఓ పరమేశ్వరీ! నీవు మొదట శివుని శరీరములో సగభాగము హరించావు. కాని దానితో తృప్తి పొందక మిగిలిన సగభాగము కూడా అపహరించినట్లుగా నాకు అనిపిస్తోంది.

ఎందుకంటే నా హృదయకమలమున ప్రకాశించు నీ రూపము వామదక్షిణ భాగములతో కూడినదంతా బాలభానునివలె అరుణారుణ ఛాయతో ప్రకాశిస్తూ, మూడు కనులుగలదై, స్థనభారము చేత కొద్దిగా వంగినట్లు కనిపిస్తూ, శిరసున చంద్రకళతో ప్రకాశిస్తున్నది.

24. జగత్సూతే ధాతా హరిరవతి రుద్రః క్షపయతే
తిరస్కుర్వ న్నేతత్స్వమపి వపురీశ స్తిరయతి।
సదాపూర్వ స్సర్వం తదిద మనుగృహ్ణాతి చ శివః
తవాజ్ఞా మాలంబ్య క్షణ చలితయో ర్భ్రూలతికయోః॥

టీక:- (ఓ జగజ్జననీ!) ధాతా = సృష్టికర్త అగు బ్రహ్మ, జగత్ = ప్రపంచమును, సూతే = సృజించుచున్నాడు. హరిః = విష్ణువు, అవతి = (ఆ ప్రపంచమును) పాలించి రక్షించు చున్నాడు, రుద్రః = రుద్రుడు, క్షపయతే = లీనము చేయుచున్నాడు, ఈశః = ఈశ్వరుడు, ఏతత్ = ఈ ముగ్గురిని, తిరస్కుర్వన్ = తిరస్కరించువాడై, స్వమపి = తనదగు, వపుః = శరీరమును, తిరయతి = అంతర్ధానమును పొందించు చున్నాడు, సదాపూర్వః = 'సదా' అను శబ్దము ముందు గల, శివః = (సదా) శివుడు, తదిదం = (ఈ చెప్పబడిన) తత్త్వ చతుష్టయమును, క్షణ చలితయోః = క్షణ కాలమాత్ర వికాసము గల, తవ = నీ యొక్క, భ్రూలతికయోః = కనుబొమల యొక్క, ఆజ్ఞాం = ఆజ్ఞను, అలంబ్య = పొంది, అనుగృహ్ణాతి = అనుగ్రహించు చున్నాడు. అనగా మఱల సృజించు చున్నాడు.

తల్లీ! జగజ్జననీ! బ్రహ్మ ఈ లోకమును సృజించును. విష్ణువు రక్షించును, రుద్రుడు లయింప చేయును. ఈశ్వరుడు ఈ త్రయమును తన శరీరము నందు అంతర్ధానము నొందించును. సదాశివుడు నీ కటాక్షమును అనుసరించి ఈ తత్త్వ చతుష్టయమును మరల ఉద్ధరించు చున్నాడు. అనగా, అనేక కోటి బ్రహ్మాండములను సృజించుట యందును, రక్షించుట యందును, లయించుట యందును నీ భ్రూవిక్షేపము ననుసరించియే చేయుదురని అర్థము.

ఈ సృష్టిలో పంచబ్రహ్మలు ఉన్నారు. (సృష్టి(బ్రహ్మ), స్థితి(విష్ణువు), లయ(రుద్రుడు), తిరోధాన(ఈశుడు), అనుగ్రహము(సదాశివుడు)లను 'పంచకృత్యములు' అందురు – 'పంచకృత్య పరాయణా' (లలితాదేవి)

బ్రహ్మదేవుడు సృష్టి కార్యమును, మహావిష్ణువు స్థితి కార్యమును, ఈశ్వరుడు లయ కార్యమును నిర్వహిస్తున్నారు. సదాశివుడు ఈ విశ్వాన్నంతటినీ, ప్రళయ కాలములో ఒక బీజరూపములో తనలో స్థిరపరచి నీ ఆజ్ఞ ననుసరించి, తిరిగి సృష్టి ప్రారంభమయేటప్పుడు బయటకు వదలుతున్నాడు. చెప్పబోయేదేమిటంటే అమ్మా! నీ ఆజ్ఞలకు లోబడి ఉండే త్రిమూర్తులను ప్రార్థించినా అది నీకే చెందుతుంది.

ఓ తల్లీ! సృష్టికర్తయైన బ్రహ్మ చరాచర జగత్తును సృష్టి చేస్తున్నాడు. విష్ణువు రక్షిస్తున్నాడు. రుద్రుడు సంహారము చేస్తున్నాడు. ప్రళయకాలమందు వీరు ముగ్గురూ మహేశ్వరునిలో కలిసిపోగా, అతడు సదాశివునిలో అంతర్భూతుడవుతున్నాడు. ఆ తరువాత సదాశివుడు

కనులతో నీవు జేసిన సంజ్ఞ ప్రకారము బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరులను మళ్ళీ సృష్టిస్తున్నాడు.

25. త్రయాణాం దేవానాం త్రిగుణ జనితానాం తవశివే
భవేత్పూజా పూజా తవ చరణయో ర్యా విరచితా।
తథాహి త్వత్పాదోద్వహన మణిపీఠస్య నికటే
స్థితా హ్యేతే శశ్వ న్ముకులిత కరోత్తంస మకుటాః॥

టీక:- శివే = ఓ భవానీ, తవ = నీ యొక్క, త్రిగుణజనితానాం = సత్త్వ రజ స్తమో గుణముల వలన ఉద్భవించిన, త్రయాణాం = ముగ్గురైన, దేవానాం = బ్రహ్మ, విష్ణు, రుద్రులకు, తవ = నీ యొక్క, చరణయోః = పాదములందు, యాపూజా = ఏ పూజ, విరచితా = చేయబడినదో, పూజా = ఆ పూజయే, భవేత్ = అగును, (వేరొక పూజ కాదు – అని భావము), తథాహి = ఇది యుక్తము (ఏలననగా) త్వత్పాద = నీ పాదములను, ఉద్వహనమణిపీఠస్య = వహించు రత్న పీఠము యొక్క, నికటే = సింహాసన సమీపము నందు, శశ్వత్ = ఎల్లపుడూ, ముకుళిత = మోడ్పుబడిన, కర = హస్తములే, ఉత్తంస = భూషణముగాగల, మకుటాః = కిరీటములు గలవారై, ఏతే = ఈ త్రిమూర్తులు, స్థితాః = వర్తించుచున్నారు కాబట్టి.

ఓ భవానీ! సత్త్వ రజ స్తమో గుణముల వలన జన్మించిన బ్రహ్మ, విష్ణు, రుద్రులకు – నీ పాదములకు చేయు పూజయే పూజ అగుచున్నది. వేరుగా పూజ కాదు. అది యుక్తమే! ఏలననగా, నీ పాదములను ఎల్లప్పుడూ వహించు నవరత్నఖచితమైన పీఠమునకు సమీపమునందు నీ సింహాసనము చెంతజేరి తమ కైమోడ్పులనే మకుటములుగా గలిగిన త్రిమూర్తులు సదా నీ సజ్జను వర్తించు చున్నారు గదా!

త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు సత్వరజస్తమో గుణస్వరూపులు. నీవు ఆ గుణములకు అతీతురాలవు. అటువంటి త్రిమూర్తులు నీ మణిమయ పాద పీఠమునకు తమ కిరీటములను తాకించి నమస్కరిస్తున్నారు. త్రిమూర్తుల
సృష్టికర్తవు నీవే కదా మాతా!

ఓ తల్లీ! సత్త్వ రజ స్తమో గుణాలకు ప్రతీకలైన బ్రహ్మ, విష్ణు, రుద్రులు, నీ పాదాలు పెట్టుకునే రత్నపీఠం దగ్గర కిరీటాలు తీసి, తలలు వంచి, వినమ్రులై కూర్చుని ఉన్నారు. కాబట్టి వారికి వేరే పూజలేదు. నీ పాదాలకు జరిగే పూజయే వారికి పూజ.

26. విరించిః పంచత్వం ప్రజతి హరి రాప్నోతి విరతిం
వినాశం కీ నాశో భజతి ధనదో యాతి నిధనమ్।
వితంద్రీ మాహేంద్రీ వితతిరపి సమ్మీలిత దృశా
మహా సంహారే౽స్మిన్ విహరతి పతి త్వత్పతిరసౌ॥

టీక:- విరించిః = బ్రహ్మ, పంచత్వం = మరణమును, ప్రజతి = పొందుచున్నాడు, హరిః = విష్ణువు, విరతిం = చైతన్య రహితుడై, సమాప్తిని, ఆపోన్తి = పొందుచున్నాడు. కీనాశః = యముడు, వినాశంభవతి = వినాశమును పొందుచున్నాడు. ధనః = కుబేరుడు, నిధనం = మరణమును, యాతి = పొందుచున్నాడు. మాహేంద్రీ = ఇంద్రునికి సంబంధించిన, వితతిః అపి = పరివారము గూడ, సమ్మీలితదృశా = కనులు మూతపడి, వితంద్రీ = నిద్రాణమగు చున్నది. హే సతి! = ఓ పతివ్రతామ తల్లీ!, అస్మిన్ = ఈ కనబడు ప్రపంచము, మహా సంహారే = మహా ప్రళయము పొందునపుడు, అనగా - కల్పాంతమునందు, త్వత్ = నీ యొక్క, పతి = భర్త అయిన, అసౌ = ఈ సదాశివుడు మాత్రము (ఏ మార్పునకు గురికాక) విహరతి = క్రీడించుచున్నాడు.

తల్లీ! జగజ్జననీ! ఈ ప్రపంచమునకు మహా ప్రళయము సంభవించినపుడు బ్రహ్మదేవుడు, విష్ణువు, యముడు, కుబేరుడు, చివరకు ఇంద్రుడు – వీరందఱూ కాలధర్మము చెందుచున్నారు. కాని, ఓ పతివ్రతామతల్లీ! నీ భర్త అయిన సదాశివుడు మాత్రము ఎట్టి మార్పులకు గురికాకుండా నిరంకుశుడై విహరించు చున్నాడు గదా!

జగన్మాతా! ప్రళయకాలము వచ్చినపుడు బ్రహ్మ జీవితం పరిసమాప్త మవుతుంది. విష్ణువు రూప పరివర్తనుడౌతాడు. యముడు అదృశ్యుడౌతాడు, ఇంద్రుడు, కుబేరుడు, మొదలైనవారు పదవీచ్యుతులౌతారు. నీ పాతివ్రత్య ప్రభావమువలన ఈశ్వరుడు మాత్రం క్షయరహితుడుగా నిలిచిపోతాడు.

ఓ దేవీ! మహాప్రళయం సంభవించినప్పుడు ఈ జగత్తు పూర్తిగా నాశనమై పోతుంది. ఏమీ మిగలదు. సంపూర్ణనాశనం జరుగుతుంది. అప్పుడు ఈ జగత్తును సృష్టించిన బ్రహ్మ మరణిస్తాడు. లోకపాలకుడైన విష్ణువు మరణిస్తాడు. సంహార కర్త అయిన రుద్రుడు నశిస్తాడు. అందరి ప్రాణాలు తీసే యముడు, ధనాధిపతి కుబేరుడు నాశనమవుతారు. పద్నాలుగు మంది మనువులు, ఆ మన్వంతరాలలో గల ఇంద్రులు, అందరూ నశించిపోతున్నారు. కాని నీ భర్త అయిన సదాశివుడు మాత్రము ఏ అడ్డూ లేక విహరిస్తున్నాడు.

27. జపో జల్ప శ్శిల్పం సకలమపి ముద్రావిరచనా,
గతిః ప్రాదక్షిణ్యా క్రమణ మశనా ద్యాహుతి విధిః।
ప్రణామ స్సంవేశ స్సుఖమఖిల మాత్మార్పణ దృశా
సపర్యా పర్యాయ స్తవభవతు యన్మే విలసితమ్॥

టీక:- తల్లీ! జగజ్జననీ! ఆత్మ + అర్పణ + దృశా = ఆత్మ సమర్పణ బుద్ధితో, అనగా – సర్వమును పరమాత్మకు సమర్పించు చున్నానను బుద్ధితో, జల్పః = నేను చేయు సల్లాపము, జపః = నీకు చేయు జపము; సకలం = సమస్తమైన, శిల్పం = నేను చేయు క్రియా కలాపములు, ముద్రావిరచనా = నీకు చేయు ముద్రలు; గతిః = నా గమనములు, ప్రాదక్షిణ్య క్రమణం = నీకు చేయు ప్రదక్షిణలు; అశనా + ఆది = తిను భోజనాదులు, ఆహుతి విధిః =

నీకు సమర్పించు హవిస్సులు; సంవేశః = నేను నిద్రించు నపుడు, పరుండునపుడు జరుగు నా దేహ మందలి మార్పులు, ప్రణామః = నీకు చేయు సాష్టాంగ ప్రణామములు; అఖిలం = సమస్తమైన, సుఖం = సుఖకరమైన, వస్తువులు విలసితం = నా విలాసములు, తవ = నీకు, సపర్యా పర్యాయః = పరిచర్యలు గాను అయి, నీ పూజయే అగుగాకా!

తల్లీ! జగజ్జననీ! ఆత్మ సమర్పణ బుద్ధితో నేను చేయు సల్లాపములు – నీకు జపముగాను, క్రియా కలాపములు – నీకు చేయు ముద్రలు గాను, గమనములు – నీకు చేయు ప్రదక్షిణలు గాను, స్వీకరించు భోజనాదులు – నీకు సమర్పించు హవిస్సులు గాను, నిద్రించునపుడు, పరుండునపుడు జరుగు దేహములోని మార్పులు నీకు చేయు సాష్టాంగ ప్రణామములు గాను, ఉపయోగించు సమస్త సుఖకర వస్తువులు విలాసములును – నీకు చేయు పరిచర్యలు గాను అయి అన్నియు నీ పూజగానే అగుగాక!

అమ్మా! భాషా అక్షరాలన్నీ మాతృకా వర్ణాలే కనుక నేను తెలిసో, తెలియకో మాట్లాడిన మాటలు నీ స్మరణగా భావించు. నేను వ్రాసిన పిచ్చి గీతలను నీ ముద్రలుగా తీసుకో. నేను ఎటు తిరిగినా వాటిని నీ ప్రదక్షిణలుగా భావించు. నేను స్వీకరించే ఆహారమును నా జఠరాగ్నిలో వేసే హవిస్సుగా అనుకో. చిన్న పిల్లవాని పనులను తల్లి అలాగే భావిస్తుంది కదా. నేను అసమగ్రంగా చేసే పూజను నీ పూజగానే స్వీకరించు. నా మనసులో ఉన్న నీవు నేను ఏమి చేసినా దానిని నీ సేవగానే అనుకో తల్లీ.

తల్లీ! ఆత్మార్పణ చెయ్యాలి అనే దృష్టితో నేను నోటితో పలికిన మాటలన్నీ నీ మంత్రజపమే అవుతుంది. ఈ దేహము నీవు ప్రసాదించినదే కాబట్టి, నేను చేతులతో చేసే పనులన్నీ నీ ముద్రలే అవుతాయి. నేను చేసే సంచారమంతా నీకు ప్రదక్షిణమే. అంగభంగిమలన్నీ నీకు నేను చేసే నమస్కారము. శరీరంలో జఠరాగ్నివి నీవే కాబట్టి, నేను తీసుకునే అన్నపానాదులు నీకు నివేదన, హోమము. నేను సుఖించటానికి చేసే పనులన్నీ నీ సపర్యగా భావిస్తున్నాను.

28. సుధా మప్యాస్వాద్య ప్రతిభయ జరామృత్యు హరిణీం
విపద్యన్తే విశ్వే విధి శతమఖాద్యా దివిషదః।
కరాళం యత్క్ష్వేళం కబలితవతః కాలకలనా
నశంభో స్తన్మూలం తవ జనని తాటంక మహిమా॥

టీక:- (ఓ జగజ్జననీ!) విధి = బ్రహ్మ, శతముఖ = ఇంద్రుడు, ముఖాద్యాః = మొదలగు ముఖ్యమైన, విశ్వేదివిషదః = దేవతలందరు, ప్రతిభయ జరామృత్యు హరిణీం = మిక్కిలి భయంకరములయిన జరామరణములను పోగొట్టునది అయిన, సుధా = అమృతమును, ఆస్వాద్యఅపి = త్రాగినవారై కూడా, విపద్యంతే = కాలధర్మము చెందుచున్నారు. (అనగా చనిపోవుచున్నారు). కరాళం = కఠోరమైన, యత్క్ష్వేళం = ఏ కాలకూటవిషమును, కబళితవతః = భక్షించి (గూడ), శంభోః = (నీపతియైన) శివునకు, కాలకలనా = కాలధర్మము చెందుట (అనగా – మరణము చెందుట), న = లేదు, తత్మూలం = ఆ విధముగా మరణము

చెందక పోవుటకు కారణము, తవ = నీ యొక్క, తాటంక మహిమా = చెవికమ్మల (కర్ణాభరణముల) ప్రభావమే, లేదా - సామర్థ్యమే! (అయివుండవలెను).

ఓ జగజ్జననీ! బ్రహ్మ, ఇంద్రుడు మొదలైన ముఖ్యమైన దేవతలందరూ మిక్కిలి భయంకరమైన ముసలి తనము, చావులను పోగొట్టగలుగు అమృతమును సేవించిన వారైనను కాలమునకు వశులై చనిపోవుచున్నారు. కాని, నీ పతి అయిన సదాశివుడు ఘోరమైన కాలకూట విషమును మ్రింగి కూడా కాలమునకు వశుడు కాక, చెక్కు చెదరక, సదావసించు చున్నాడు. ఈ విధముగా నీ భర్త మరణమును పొందకుండుటకు నీ చెవి తాటంకముల ప్రభావమే అయి వుండవలెను. "తాటంకయుగళీభూతతపనోడుపమండలా" (హైందవ స్త్రీకి 'మంగళ సూత్రము, గాజులు, ముక్కు, చెవులకు పెట్టుకొను ఆభరణములు, పసుపు, కుంకుమ, కాటుక, పారాణి, మట్టెలు' సౌభాగ్య లక్షణములు)

లోకములో అందరికీ పుట్టుక మరణము సహజమైనవి. ఈశ్వరుడు మరణభయము లేకుండా హాలాహలాన్ని మింగాడు. ఆయినా ముఖములో ఏ బాధా లేకుండా ఉండగలిగాడంటే అది నీ తాంటంకముల గొప్పదనమేకదా తల్లీ! నీవు సర్వమంగళవు కనుకనే ఈశ్వరుడు నిర్భయంగా విషం పుచ్చుకున్నాడు. పోనీ మ్రింగాడా, అలా కంఠంలో నిలిపి ఉంచాడు. ఇదంతా నీ తాటంకముల మహిమేలే నాకు తెలుసు.

ఓ తల్లీ! బ్రహ్మాది దేవతలందరూ అమృతాన్ని త్రాగి అతిభయంకరమైన జరా మరణాలను పోగొట్టుకొని కూడా ప్రళయకాలమందు విగత జీవులవుతున్నారు. అయితే నీ భర్త అయిన పరమేశ్వరుడు అమృతం త్రాగలేదు సరికదా భయంకరమైన కాలకూటాన్ని త్రాగి ప్రళయమందు కూడా నాశనము పొందక శాశ్వతుడై ఉన్నాడు. ఇది నీ చెవులకు ఉన్న కమ్మల ప్రభావము.

29. కిరీటం వైరించం పరిహార పురః కైటభభిదః
కఠోరే కోటీరే స్ఖలసి జహి జంభారి మకుటమ్।
ప్రణమ్రేష్వేతేషు ప్రసభముపయాతస్య భవనం
భవస్యాభ్యుత్థానే తవ పరిజనోక్తి ర్విజయతే॥

టీక:- (ఓ భువనేశ్వరీ దేవీ!) పురః = నీ ముందు, వైరించ = బ్రహ్మకు సంబంధించిన, కిరీటం = కిరీటమును, పరిహర = వదలి దూరముగ నడువుము, కైట భభిదః = కైటభుడను రాక్షసుని వధించిన విష్ణుమూర్తి యొక్క, కఠోరే = (రత్నఖచితమగుటచే) కఠినముగా అయిన, కోటీరే = కిరీటము అంచులందు తాకి, స్ఖలసి = జాఱెదవేమో, జంభారి మకుటమ్ = జంభుడను రాక్షసుని సంహరించిన దేవేంద్రుని కిరీటమును, జహి = వదలి దూరముగా నడువుము - అని ఈ విధముగా - ఏతేషు = బ్రహ్మేంద్రాదులు, ప్రణమ్రేషుసత్సు = మ్రొకరిల్లుచుండగా, భవనం = (నీ) మందిరమునకు, ఉపయాతస్య = వచ్చిన, భవస్య = (నీ పతియగు) పరమేశ్వరునికి, ప్రసభ = వెంటనే, తవ అభ్యుత్థానే = నీవు ఎదురు వెళ్ళు సమయమందు, తవ = నీ యొక్క, పరిజన + ఉక్తి = నీ సేవికల వచనము, విజయతే = సర్వోత్కర్షతో విరాజిల్లుచున్నది.

నీ మందిరమునకు నీ పతియగు పరమేశ్వరుడు వచ్చిన తరుణములో నీవు వెనువెంటనే స్వాగత వచనములతో ఎదురేగి, ఆయనను పలుకరించుటకు లేచి ముందుకు సాగు ప్రయత్నములో నుండగా - దారిలో నీకు సాష్టాంగ దండ ప్రణామము లాచరించు స్థితిలో నున్న బ్రహ్మ, విష్ణు, ఇంద్రాదుల యొక్క కిరీటములు నీ పాదములకు అడ్డు తగుల వచ్చునను ఉద్దేశ్యముతో వీటిని జాగ్రత్తగా దాటుచు నడువుమని చెప్పు నీ పరిజనుల మాటలు సర్వోత్కృష్టముగా నున్నవి. (పత్నికి పతి సేవే ముఖ్యము - అందుకు అమ్మవారే ఆదర్శము)

భర్తరాకను తెలుసుకున్న నీవు పరుగు పరుగున వెడుతుంటే, నిన్ను చూసి దేవతలంతా కిరీటాలు వంచి నమస్కరిస్తుంటే, కఠినమైన కిరీటాలు తగిలి నీ పాదాలు నొచ్చుకుంటాయని నీ సఖులు వారిని హెచ్చరిస్తుంటే, నీవు పరమ శివుని సేవకు వెళ్ళి నమస్కరిస్తావు. అమ్మా నీవు పతివ్రతా శిరోమణివి.

ఓ దేవీ! ఒకానొకనాడు నీ భవనానికి నీ పతి అయిన పరమశివుడు విజయం చేశాడు.ఆ సమయంలో బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు మొదలగువారు నీకు సాష్టాంగ దండ ప్రణామాలు ఆచరిస్తున్నారు. శివునికి స్వాగతం పలకటానికి నీవు గబగబా ఎదురేగుతున్నావు. అప్పుడు నీ చెలికత్తెలు, పరిజనులు, "అమ్మా! నీ ముందు వైపున బ్రహ్మదేవుని కిరీటమున్నది, అటుప్రక్కన కైటభమర్దనుని కిరీటమున్నది, అటువైపున జంభారి కిరీటమున్నది, జాగ్రత్త తల్లీ! అవి నీ కాళ్ళకి తగిలి నీకు బాధ కలిగిస్తాయి" అని హెచ్చరిస్తున్నారు.

30. స్వదేహోద్భూతాభి ర్ఘృణిభి రణిమాద్యాభిరభితః
నిషేవ్యే నిత్యే త్వామహమితి సదా భావయతి యః।
కిమాశ్చర్యం తస్య త్రినయన సమృద్ధిం తృణయతః
మహా సంవర్తాగ్ని ర్విరచయతి నీరాజన విధిమ్॥

టీక:- నిత్యే = ఆద్యంతములు లేని తల్లీ!, నిషేవ్యే = చక్కగా సేవింపదగిన మాతా!, స్వదేహ + ఉద్భూతాభిః = తన యొక్క (అనగా - ప్రస్తుతము నీ యొక్క) దేహము నుండి, (అనగా - ప్రస్తుతము పాదముల నుండి), ఉద్భవించినట్టి, ఘృణిభిః = కిరణములతోడను, అణిమా + ఆద్యాభిః = అణిమా గరిమాది అష్టసిద్ధులతోడను, అభితః = చుట్టును ఉండు వానితోడను, (కూడి), త్వాం = (ఉన్న) నిన్ను, అహంఇతి = నేను 'అహం' అను భావన చేత, సదా = ఎల్లవేళల, యః = ఏ సాధకుడు, భావయతి = ధ్యానము చేయునో, త్రినయన సమృద్ధిం = సదాశివుని యొక్క ఐశ్వర్యమును, తృణయత = తృణీకరించుచున్న (గడ్డిపోచ వలె నెంచుచున్న), తస్య = ఆ సాధకునికి, మహాసంవర్త + అగ్ని = మహా ప్రళయాగ్ని, నీరాజన విధిం = నీరాజనమును, కరోతి = ఇచ్చు చున్నది (అని అనుటలో), కిం ఆశ్చర్యం = ఏమి ఆశ్చర్యము?

చక్కగా సేవించదగిన, ఆద్యంతములు లేని జగజ్జననీ!, నీ పాదముల నుండి ఉద్భవించు కిరణముల తోను, చుట్టునూ - అణిమా, మహిమా మొదలైన అష్ట సిద్ధులతోను ఆవరించి

యుండు నిన్ను 'నీవే నేను' అను భావనతో నిత్యము ధ్యానము చేయుచు నీతో తాదాత్మ్యమును పొందు సాధకుడు - సదాశివుని అష్టైశ్వర్యములనే గడ్డిపోచవలె ఎంచుననగా మహా ప్రళయాగ్ని ఆ సాధకునకు నీరాజన మెత్తుననుటలో ఆశ్చర్యమే మున్నది?

అమ్మా, శ్రీ చక్రరూపమైన నీ శరీర కాంతులు, అందలి ఆవరణ దేవతలు, భూపుర రేఖలు మొదలైన అణిమాది అష్ట సిద్ధులను ఏ సాధకుడు భావయుక్తముగా మనసులో ఆరాధిస్తాడో, అతడు ఎటువంటి భయము లేకుండా ప్రళయకాలాగ్నిని కూడా నీకు ఇవ్వబడే నీరాజనంగా భావిస్తాడు.

ఓ దేవీ! ఆద్యంతములు లేనిదానా! లోకమంతటిచేత సేవించబడేజగన్మాతా! నీ పాదపద్మములనుండి ప్రసరిస్తున్న మయూఖములతోను, అణిమాది అష్టసిద్ధులతోను నిత్యము సేవించబడే నిన్ను 'అహం' భావనతో నిరంతరము సేవించేవాడు ముక్కంటి అయిన సదాశివుని ఐశ్వర్యమునుకూడా తృణీకరిస్తాడు. అతడికి మహాప్రళయ కాలాగ్ని నీరాజనము పడుతున్నది.

31. చతుష్షష్ట్యా తంత్రైః సకల మతి సంధాయ భువనం
స్థిత స్తత్త త్సిద్ధి ప్రసవ పరతంత్రైః పశుపతిః।
పునస్త్వన్నిర్బంధా దఖిల పురుషార్థైక ఘటనా
స్వతంత్రం తే తంత్రం క్షితితల మవాతీత రదిదమ్॥

టీక:- (ఓ జగన్మాతా!) తత్‌తత్ = ఆయా, సిద్ధిప్రసవపరతంత్రైః = తంత్రముల ప్రయోజనములు ఇష్టపడునవైన, చతుష్షష్ట్యా = మహామాయా శాంబరాదు లగు అఱువది నాలుగు సంఖ్యగల, తంత్రైః = తంత్ర గ్రంథముల చేత, సకలంభువనం = సమస్త ప్రపంచమును, అతిసంధామ = మోహపెట్టి వంచింపచేసి, పశుపతిః = శివుడు, స్థితః = స్థిమితముగా నుండెను. పునః = మరల, తత్వత్ నిర్బంధాత్ = నీ నిర్బంధము వలన, సమస్తమైన, పురుషార్థ = చతుర్విధ పురుషార్థములను, ఏకఘటనా = ముఖ్యముగా సమకూర్చుట యందు, స్వతంత్రం = 'స్వ' తంత్రమైన, తే = నీ యొక్క, తంత్రం = శ్రీ విద్యా తంత్రమును, ఇదం = ఈ చెప్పబడుచున్న దానిని, క్షితి తలం = భూతల వాసులనుద్దేశించి, అవాతీతరత్ = అవతరింప జేసెను.

తల్లీ! జగజ్జననీ! పశుపతి అయిన శివుడు, జీవులను తృప్తి పరచుటకై వివిధ విధాన ప్రక్రియలతో రకరకముల ఫలితముల నిచ్చు అఱువదినాలుగు రకముల తంత్రములను ఈ లోకమునకు ఇచ్చి, జీవులను మోహ వ్యామోహములలో చిక్కు కొనునట్లు చేయగా - ఆ విధముగా మోహము నందు పడకుండుటకు బిడ్డలైన జీవుల యందు వాత్సల్యముతో - నీవు నీ భర్త అయిన శివుని ప్రేమతో నిర్బంధ పెట్టగా - పరమ పురుషార్థ ప్రదమైన నీదైన శ్రీ విద్యాతంత్రమును ఈ భూలోకవాసులకు ప్రసాదింప జేసెను.

భోళాశంకరుడు అనేక ప్రయోజనాలను సమకూర్చే 64 తంత్రాలను జీవులకు ప్రసాదించాడు. తాత్కాలిక ప్రయోజనాలను చేకూర్చే ఈ తంత్రాలతో బాటు శాశ్వతమైన,

మోక్షప్రదమైన, దేవీ తంత్రమైన శ్రీ తంత్ర విధానమును కూడా ఈశ్వరుడు, నీ కోరికపై ప్రకటించాడు.

తల్లీ! పశుపతి అయిన నీ భర్త ఆ పరమేశ్వరుడు, ఐహిక సంబంధమైన అగ్ని స్తంభన, వాయు స్తంభన, ఆకాశ గమనము, పరకాయ ప్రవేశము వంటి విద్యలను లోకానికి అందజేశాడు. ఈ విద్యలను ఆధారం చేసుకుని లోకంలోని పండితులు కూడా మహామోహములో పడిపోయి మోక్షాన్ని మరచిపోతున్నారు. అది గమనించిన నీవు మోక్షసాధనమైన ఒక తంత్రాన్ని చెప్పమని అడగగా పరమేశ్వరుడు శ్రీవిద్యా తంత్రాన్ని ఉపదేశించాడు.

32. శివ శ్శక్తిః కామః క్షితి రథ రవి శ్శీతకిరణః
స్మరో హంసశ్శక్ర స్తదనుచ పరా మార హరయః।
అమీ హృల్లేఖాభా స్తిసృభి రవసానేషు ఘటితాః
భజంతే వర్ణాస్తే తవ, జనని నామావయవతామ్॥

టీక:- జననీ! = ఓ మాతా! శివః = శివుడు ('క' కారము), శక్తిః = శక్తి ('ఏ' కారము), కామః = మన్మథుడు ('ఈ' కారము), క్షితిః = భూమి ('ఏ' కారము), అథః = తర్వాత, రవిః = సూర్యుడు ('హ' కారము) శీతకిరణం = చంద్రుడు ('స' కారము), స్మరః = మన్మథుడు ('క' కారము); హంసః = సూర్యుడు ('హ' కారము), శక్రః = ఇంద్రుడు ('ల' కారము); తత్ + అనుచ = వానికి తర్వాత, పరా = పరాశక్తి ('స' కారము), మారః = మన్మథుడు ('క' కారము) హరిః = విష్ణువు ('ల' కారము), అమీ = (ఈ మూడు వర్గములుగానున్న) ఈ వర్ణములు, త్రిసృభిః = మూడైన, హృల్లేఖాభిః = 'హ్రీం' కారముల చేత, అవసానేషు = వర్గాంతములందు, ఘటితాః = సంకలితమై, అనగా = కూడినదై, హేజనని = ఓ మాతా!, తే = ఆ, వర్ణాః = అక్షరములు, తవ = నీ యొక్క, నామ + అవయవతాం = అవయవములగుటను, అనగా - మంత్ర స్వరూపమగుటను, భజంతే = పొందుచున్నవి.

శివుడు, శక్తి, మన్మథుడు, భూమి - ఈ నలుగురూ వరుసగా సూచించు 'క, ఎ, ఈ, ల' - అను అక్షర కూటము; సూర్యుడు, చంద్రుడు, మన్మథుడు, సూర్యుడు, ఇంద్రుడు - ఈ ఐదుగురు వరుసగా సూచించు 'హ, స, క, హ, ల' - అను అక్షర కూటము; పరాశక్తి, మన్మథుడు, హరి - ఈ ముగ్గురు వరుసగా సూచించు 'స, క, ల' - అను అక్షర కూటములు - వాటి అంతము నందలి విరామ స్థానములందు - 'హ్రీం' కారముల చేత సమకూర్చ బడినపుడు ఏర్పడు ఆ మూడు కూటములలోని మొత్తము పదునైదు అక్షరములు (జగజ్జననీ!) నీ పంచదశాక్షరీ మంత్ర స్వరూపమునకు అవయవములుగా భాసించు చున్నవి.

పంచదశాక్షరీ మంత్రము - (1) లక్ష్మీధర పండితుల పద్ధతి - "క, ఏ, ఈ, ల, హ్రీం"; "హ, స, క, హ, ల, హ్రీం"; "స, క, ల, హ్రీం" (2) కైవల్యాశ్రమి పండితుల పద్ధతి - "హ, స, క, ల, హ్రీం"; "హ, స, క, హ, ల, హ్రీం"; "స, క, ల, హ్రీం" - (మూడు కూటములు) "శ్రీమద్వాగ్భవకూటైకస్వరూపముఖపంకజా" (ముఖము); కంఠాధఃకటిపర్యంతమధ్యకూట

Kiron Type Institute
Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

స్వరూపిణీ" (కంఠము నుండి కటి(నడుము) వరకు; "శక్తికూటైకతాపన్నకట్యథోభాగధారిణీ" (కటి నుండి క్రింద వరకు)

ఈశ్వరుడు, శక్తి, కాముడు, భూమి వీరిని క ఏ ఈ ల అని; సూర్యుడు, చంద్రుడు, స్మరుడు, పర, మారహరి అనే వారిని హ స క హ ల అని; ఇతర దేవీ శక్తులను స క ల అనే బీజాక్షరాలు సంకేతిస్తే, వీటికి హ్రీం కారమును కలిపితే పంచ దశాక్షరి అవుతుంది. ఈ పంచదశాక్షరి చివరి చంద్రకళ అక్షరముతో కలిపితే షోడశాక్షరి అవుతుంది. దీనిని పరిపక్వముగా తెలుసుకున్నవారు తప్ప ఇతరులు సాధన చేయలేరు.

ఓ తల్లీ! క కారము శివుడు, ఏ కారము శక్తి, ఈ కారము కాముడు, అ కారము భూమి. ఇవి మొదటి ఖండము. హ కారము రవి, స కారము చంద్రుడు, క కారము స్మరుడు (మన్మథుడు) హ కారము హంస, ల కారము ఇంద్రుడు, ఇవి రెండవ ఖండము. స కారము పరాశక్తి, క కారము మన్మథుడు, ల కారము హరి. ఇవి మూడవ ఖండము. ఈ మూడు ఖండముల చివర మూడు హ్రీంకారములు. వెరసి పదిహేను అక్షరములతో పంచదశీ మహామంత్రము ఒప్పారుతున్నది.

(ఓం పరమేశ్వర బీజం, ఈం లక్ష్మీ బీజం, ఐం వాగ్బీజము, క్లీం మన్మథబీజము, హ్రీం శక్తి బీజము, గం గణపతి బీజము, లం పృథివీ బీజము, హం ఆకాశబీజము, యం వాయు బీజము, రం అగ్ని బీజము. వం అమృతబీజము) (పంచభూతాల లక్షణాలు = ఆకాశము - శబ్దము; వాయువు - శబ్దము, స్పర్శ; అగ్ని - శబ్దము, స్పర్శ, రూపము; జలము - శబ్దము, స్పర్శ, రూపము, రసము; భూమి - శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము = ఇదే పంచీకరణ)

33. స్మరం యోనిం లక్ష్మీం త్రితయ మిద మాదౌ తవ మనోః
నిధాయైకే నిత్యే నిరవధి మహాభోగరసికాః।
భజన్తి త్వాం చింతామణి గుణ నిబద్ధాక్షవలయాః
శివాగ్నౌ జుహ్వన్త స్సురభి ఘృతధారాహుతి శతైః॥

టీక:- నిత్యే = ఓ నిత్యాస్వరూపురాలా!, తవ = నీ యొక్క, మనోః = మంత్రమునకు, ఆదౌ = మొదటను, స్మరం = మన్మథుని బీజమును (క్లీం), యోనిం = భువనేశ్వరీ బీజమును (హ్రీం), లక్ష్మీం = శ్రీ బీజమును (శ్రీం), ఇదం = ఈ మూడింటిని, నిధాయ = ఉంచి, లేదా - చేర్చి, ఏకే = కొందఱు మాత్రము, నిరవధిక = హద్దులులేని, మహాభోగ = దొడ్డదైన ఆనందానుభవము యొక్క, రసికాః = రసజ్ఞులు, చింతామణి = చింతామణుల యొక్క, గుణ = సమూహము చేత, నిబద్ధ = కూర్చబడిన, అక్షవలయాః = అక్షమాలలు గలవారై, శివా + అగ్నే = శివాగ్ని యందు (అనగా స్వాధిష్ఠాగ్నియందుంచి), త్వాం = నిన్ను, సహస్రారము నుండి హృదయ కమల మందు నిల్పి, సురభి = కామధేనువు యొక్క, శతైః = పలు మారులు, జుహ్వంతః = హోమము చేయుచు, చక్కని తృప్తిని పొందుచు, భజంతి = సేవించు చున్నారు.

ఓ నిత్యస్వరూపిణీ! రసజ్ఞులు, సమయాచారపరులు అగు కొంతమంది పరమ యోగీంద్రులు - నీ మంత్ర ప్రథమ కూటము నందలి (32వ శ్లోకములో తెలిపిన పంచదశాక్షరీ మంత్ర ప్రథమ కూటము నందలి) క, ఎ, ఈ బీజాక్షరములకు ముందు వరుసగా కామరాజ బీజాక్షరమైన 'క్లీం' భువనేశ్వర బీజాక్షరమైన 'హ్రీం', లక్ష్మీబీజాక్షరమైన 'శ్రీం' లను చేర్చి అష్టదశాక్షరిగా జపించుచూ, చింతామణులు అను రత్నములచే కూర్చబడిన అక్షమాలికలను హస్తములందు ధరించి, 'శివాగ్ని' అని పేరు పొంది స్వాధిష్ఠానాగ్ని యందు కామధేనువు యొక్క నేతి ధారలు అను ఆహుతులను - నిత్యాస్వరూపురాలైన నిన్ను తమ హృదయ కమలములందు నిల్పి - హోమము చేయుచు నిన్ను సంతృప్తి పరచుచూ తాము - నిరుపమాన, శాశ్వత మహాభోగ రూపమైన సుఖానుభవమును పొందుచున్నారు.

అమ్మా! నీ సాధకులు కామ్యము తో కాక, కేవలము నీ అనుగ్రహమును కోరి, నిరంతరం, నీ మంత్రమును ఐం హ్రీం శ్రీం బీజాక్షరములతో కలిపి, వేల సంఖ్యలో జపములను, పాల ధారలతో అభిషేకమును, ఆహుతులను సమర్పిస్తూ, మూడు కోణములు కల అగ్నిలో హోమాలు చేస్తున్నారు. ఓహో ఇప్పుడు అర్ధమయిందిలే! నీ అనుగ్రహము కన్నా పొందడానికి అధికమేదీ ఈ లోకంలో ఉండదు.

నిత్యాస్వరూపమై, ఆద్యంతరహితమైన ఓ దేవీ! నీ మంత్రానికి ముందు కామరాజ, భువనేశ్వరీ, లక్ష్మీ బీజములను చేర్చి (క్లీం హ్రీం శ్రీం) అపరిచ్ఛిన్నము, అఖండము, మహాభోగరూపము అయిన నిత్య సుఖమును పొందిన సమయా చారులైన యోగీశ్వరులు చింతామణులతో చేయబడిన అక్షమాలలను చేతుల యందు ధరించి, త్రికోణరూపమైన బైందవస్థానమందు సంస్కరింపబడిన 'శివాగ్ని' అనబడే స్వాధిష్ఠానాగ్నియందు కామధేనువు యొక్క నేతిధారలను వేల సంఖ్యలో హోమము చేయుచు నిన్ను సేవిస్తున్నారు.

34. శరీరం త్వం శంభో శ్శశిమిహిర వక్షోరుహయుగం
తవాత్మానం మన్యే భగవతి నవాత్మాన మనఘమ్।
అతశ్శేషశ్శేషీ త్యయ ముభయ సాధారణ తయా
స్థితః సంబంధో వాం సమరస పరానంద పరయోః॥

టీక:- (హే) భగవతి = (ఓ) భగవతీ! శంభోః = శంభునకు, త్వం = నీవు, శశిమిహిర = చంద్రుడు, సూర్యుడు, వక్షోరుహయుగం = స్తనముల జంటగా గలిగిన, శరీరం = దేహముగల దానివి, తవ = నీయొక్క, ఆత్మానం = దేహమును, అనఘమ్ = దోషములేని, నవాత్మానం = నవ వ్యూహాత్మకుడగు శివానంద భైరవునిగా, మన్యే = తలంచు చున్నాను. అతః = ఈ కారణమువలన, శేషః = గుణముగా నుండునది, అనగా - ఆధేయమై వుండు అప్రధానము, శేషీ = ఆధారమై వుండు ప్రధానము, ఇతి = అను, అయం = ఈ, సంబంధః = సంబంధము, సమరస = సామ్య సామరస్యములతో గూడిన, పరానంద = ఆనందరూపుడైన ఆనంద భైరవుడు, పరయోః = ఆనంద రూపమైన భైరవీరూపులుగా, వాం = మీ, ఉభయ = ఇరువురకు, సాధారణ తయా = సామ్యము సామాన్యమై, స్థితః = ఉండుట అన్నది ధ్రువమై చెల్లుతున్నది.

ఓ భగవతీ! ఆనంద భైరవునకు - చంద్రుడు, సూర్యుడు స్తనములుగా గల దేహముగా నీవు అగుచున్నావు. దోషరహితుడైన ఆ ఆనంద భైరవుని నీ యొక్క దేహముగా తలంచు చున్నాను. ఒకరి కొకరు దేహములై చెల్లు మీ ఇరువురి సమన్వయ స్వరూపములకు శేష శేషీ సంబంధ సామరస్యము, అనగా - 'ఆ ధేయ - ఆధార' లేదా 'అప్రధాన - ప్రధాన' సంబంధ సామరస్యము చెల్లుచు, ఆనంద భైరవీ ఆనంద భైరవులుగా ధ్రువీకరింప బడుచున్నారు.

(స్తనములు పోషక ధర్మమునకు చిహ్నములు. పగలు సూర్యరశ్మి వలన, రాత్రి చంద్రుని వెన్నెల వలన సమస్త జీవులకు ఆహారము వృక్షముల ద్వారా, ఓషధుల ద్వారా అందివ్వబడుచున్నది. అందువలన సృష్టి స్వరూపిణి అయిన అమ్మవారి స్తనములను సూర్య, చంద్రులతో పోల్చుదురు. అలాగే జరిగినది జరిగినట్లుగా వినుటకు, చూచుటకు కూడా సూర్య చంద్రులను చెవులుగా, కన్నులుగా కూడా చెప్పుదురు. ఇడా, పింగళా నాడీ సూచితములని గూఢార్థము.) కాల (కాలము), కుల (వర్ణము(రంగు), నామ (చరాచర జీవుల నామధేయములు), జ్ఞాన (మనస్సు,బుద్ధి మొ॥ వాని ద్వారా పొందు జ్ఞానము), చిత్త (మనస్సు, మహత్తు, బుద్ధి, చిత్తము, అహంకారములకు సంబంధించినది), నాద (నాదము, పరా, పశ్యంతీ, మధ్యమా, వైఖరీ స్థితులలోని వాక్కుకు సంబంధించినది), బిందు (ఆధార, స్వాధిష్ఠానాది చక్రములకు సంబంధించినది), కలా (పంజాశత్(50) అక్షరములకు సంబంధించినది), జీవ (జీవాత్మ సముదాయమునకు సంబంధించిది) వ్యూహములను నవ వ్యూహములు అందురు.

ఓ జగన్మాతా! నీకు సూర్య చంద్రులు స్తనయుగముగా ఉన్నారు. సాక్షాత్ నీవు ఈశ్వరుని అర్ధ శరీరిణిగా వెలసి ఉన్నావు. ఈ విధముగా మీ ఇద్దరికీ భేదమే లేదు. అందువలననే, మీరిరువురూ శేష శేషీ న్యాయముతో సమ నామములతో సంబోధింపబడుతున్నారు.

ఉత్పత్తి మొదలైన ఆరు విషయాలను తెలిసినదానవైన ఓ దేవీ! ఆనంద భైరవుడికి నీవు సూర్యచంద్రులు స్థనాలుగా గల శరీరము అవుతున్నావు. అందుకే నవవ్యూహాత్మకుడైన ఆనందభైరవుని నీ శరీరముగా భావిస్తున్నాను. దీనివల్ల మీ ఇద్దరికీ ఐక్యము సంభవించి నీవు శేషము అతడు శేషి, అతడు శేషము, నీవు శేషి - అనే ఈ శేషి, శేష సంబంధమైన సామరస్యముతో కూడి ఆనంద భైరవ, ఆనందభైరవి రూపులైన మీ ఉభయులకు సమానత్వమున్నదని భావిస్తున్నాను.

35. మనస్త్వం వ్యోమత్వం మరుదసి మరుత్సా రథి రసి
త్వ మాప స్త్వం భూమి స్త్వయి పరిణతాయాం నహి పరం।
త్వమేవ స్వాత్మానం పరిణమయితుం విశ్వవపుషా
చిదానందాకారం శివయువతి భావేన బిభృషే॥

టీక:- (హే) శివయువతీ! = ఓ శివుని ప్రియురాలా, మనః = ఆజ్ఞాచక్రము నందలి మనస్తత్వమును, త్వం + ఏవ + అసి = నీవే అగుచున్నావు, వ్యోమ = విశుద్ధి చక్రమునందలి

ఆకాశ తత్త్వమును, మరుత్ = అనాహత చక్రమందలి వాయుతత్త్వమును, మరుత్సారథిః = స్వాధిష్ఠాన చక్రము నందలి వాయు సఖుడైన అగ్ని తత్త్వమును, ఆపః = మణిపూర చక్రమందలి జలతత్త్వమును, భూమిః = మూలాధార చక్రము నందలి భూతత్త్వమును, త్వం ఏవ అసి = గూడా నీవే అగుచున్నావు. త్వం = నీవు, పరిణతాయాం = ఈ రూపములలో పరిణమించిన, అనగా – పూర్తిగా తదాత్మ్యమును పొందిన దానవు కాగా, నహిపరం = నీ కంటె ఇతరమగు నది కొంచెము కూడా లేదు. త్వం ఏవ = నీవే, స్వ + ఆత్మానం = స్వస్వరూపమును, విశ్వవపుషా = ప్రపంచ రూపముతో, పరిణమయితుం = పరిణమింపచేయుటకు, చిత్ + ఆనంద + ఆకారం = చిచ్ఛక్తియుతుడైన ఆ ఆనంద భైరవుని, లేదా – శివతత్త్వమును, శివయువతి భావేన = శివయువతి భావము చేత, బిభృషే = ధరించు చున్నావు.

ఓ శివుని ప్రియురాలైన జగజ్జననీ! ఆజ్ఞా చక్రమందలి మనస్తత్త్వము, విశుద్ధియందలి ఆకాశతత్త్వము, అనాహత మందలి వాయుతత్త్వము, స్వాధిష్ఠాన మందలి అగ్నితత్త్వము, మణిపూరమందలి జలతత్త్వము, మూలాధార మందలి భూతత్త్వము గూడా నీవే అయి వున్నావు. ఈ విధముగా పంచభూతములు నీవే అయినపుడు ఇంక ఈ విశ్వమందు నీ కంటే ఇతరమైన పదార్థము ఏదియు కొంచెము కూడా వుండదు. ఉండలేదు. నీవే నీ స్వరూపమును జగదాకారముగ పరిణమింప చేయుటకు చిచ్ఛక్తి యుతుడైన ఆనంద భైరవుని స్వరూపమును లేదా శివ తత్త్వమును నీ చిత్తముతో ధరించు చున్నావు.

అమ్మా, నీవు షట్చక్ర ఉపరిసంస్థితవు. మూల ధారములో పృథ్వీ రూపములోను, స్వాధిష్టానములో అగ్ని రూపములోను, మణిపూరములో జలరూపములోను, అనాహతములో వాయు రూపములోను, విశుద్ధములో ఆకాశరూపములోను, ఆజ్ఞాచక్రములో మనసు రూపము లోను ఉండి, సాధకుడు వీటిని దాటిన తరువాత, సహస్రారములో చిదానంద రూపములో భైరవునితో కలసి దర్శనమిస్తావు.

శివునిపట్టపురాణి అయిన ఓ పరమేశ్వరీ! అజ్ఞాచక్రమందున్న మనస్తత్త్వము నీవే. విశుద్ధిచక్రంలో ఉన్న ఆకాశతత్త్వము నీవే. అనాహతంలోని వాయుతత్త్వము నీవే. స్వాధిష్ఠానములోని అగ్నితత్త్వము, మణిపూరంలోని జలతత్త్వము ఆధారచక్రంలోని పృథివీతత్త్వము కూడా నీవే. నీకన్న వేరైనది ఏదీలేదు. నీ స్వరూపాన్ని ఈ జగత్తుగా పరిణమింప చెయ్యటానికి నీవే శివతత్త్వమైన బ్రహ్మస్వరూపమగు ఆనందభైరవునిగా రూపుధరించావు.

36. తవాజ్ఞా చక్రస్థం తపన శశికోటి ద్యుతిధరం
పరం శంభుం వందే పరిమిళిత పార్శ్వం పరచితా।
యమారాధ్య న్భక్త్యా రవిశశి శుచీనా మవిషయే
నిరాలోకేఽ లోకే నివసతిహి భాలోకభువనే॥

టీక:- (ఓ జగజ్జననీ!) తవ = నీ సంబంధమైన, ఆజ్ఞా చక్రస్థ = ఆజ్ఞాచక్రము నందున్న వాడును, తపన శశకోటి ద్యుతిధరం = కోటి సూర్య చంద్రుల కాంతి ధరించినవాడును, పరచితా = 'పర' మగు చిచ్ఛక్తి చేత; పరిమిళిత పార్శ్వం = కలసిన (ఎడమ) ఇరు పార్శ్వములు

కలవాడును, పరం = 'పరు' డను పేరుగల, శంభుం = శంభుని గూర్చి, వందే = నమస్కరించుచున్నాను. యం = అట్టి ఏ పరమశివుని, భక్త్యా = భజించుట యందు ప్రీతితో, ఆరాధ్యన్ = పూజించుచు ప్రసన్నునిగా చేసుకొను సాధకుడు, రవిశశి శుచీనాం = రవిచంద్రాగ్నులకు, అవిషయే = అగోచరమై, అనగా - వెలిగింప వీలుకానటువంటిదియు, నిరాలోకే = బాహ్యదృష్టికి అందరానివంటిదియు, అలోకే = జనము లేని ఏకాంత మైనటువంటిదియునైన, భూలోకభువనే = వెలుగుల, లోకమునందు (సంపూర్ణముగా వెన్నెల వెలుగులతో నిండిన లోకమందు, అనగా - సహస్రార కమలము నందు) నివసతిహి = వసించుననుట ప్రసిద్ధమైన విషయము, అనగా - నీ సాయుజ్యమును పొందును అని అర్థము.

ఓ జగజ్జననీ! నీకు సంబంధించినదైన ఆజ్ఞాచక్రము నందు - కొన్ని కోట్ల సూర్య, చంద్రుల కాంతిని ధరించిన వాడును, 'పర' యను పేరు పొందిన చిచ్ఛక్తి చేత కలిసిన ఇరు పార్శ్వములు కలవాడును అగు పరమశివుని గూర్చి నమస్కరించు చున్నాను. ఏ సాధకుడు భజన తత్పరుడై ఇట్టి పరమ శివుని ప్రసన్నునిగా చేసుకొనునో అతడు రవిచంద్రాగ్నులకు సైతము వెలిగింప వీలుకానటు వంటిదియు, బాహ్యదృష్టికి అనగా - చర్మచక్షువులకు గోచరింపనిదియు, ఏకాంత ప్రదేశమైన జ్యోత్స్నామయ లోకమందు (నిండు వెన్నెలలోకమందు, అనగా - సహస్రార కమలమందు) నివసించును. అనగా - నీ సాయుజ్యమును పొందును.

అమ్మా! నీవు ఆజ్ఞాచక్రాంతరాళస్తవు. కనుబొమల మధ్య ద్విదళ పద్మములో, ఆజ్ఞా చక్రములో నీవు కోటి సూర్యుల యొక్క ప్రకాశముతో జ్వలిస్తావు. సాధకులు ఆ ప్రకాశమును దర్శించిన తరువాత మాత్రమే, సహస్రార చక్రములో నీ పాద సన్నిధికి చేరగలరు.

ఓ భగవతీ! నీ యొక్క భ్రూమధ్యమున ప్రకాశిస్తున్న ఆజ్ఞాచక్రమందు కోట్లకొలది సూర్యచంద్రుల కాంతి ధరించినవాడు, 'సరయు' అనే పేరుగల చిచ్ఛక్తిని తన ఉభయపార్శ్వములందు గలవాడు ఆయిన పరమశివునికి నమస్కరిస్తున్నాను. సాధకుడు నీ ఆజ్ఞాచక్రంలో గల శివుని ప్రసన్నునిగా చేసుకుని బాహ్యదృష్టికి గోచరముగాని చంద్రలోకమందు నివశిస్తున్నాడు.

37. విశుద్ధౌ తే శుద్ధ స్ఫటిక విశదం వ్యోమజనకం
శివం సేవే దేవీమపి శివసమాన వ్యవసితామ్।
యయోః కాంత్యా యాంత్యా శ్శశికిరణ సారూప్య సరణేః
విధూతాంతర్ధ్వాంతా విలసతి చకోరీవ జగతీ॥

టీక:- (ఓ జగజ్జననీ) తే = నీ యొక్క, విశుద్ధౌ = విశుద్ధి చక్రము నందు, శుద్ధస్ఫటిక విశదం = దోషము లేని స్ఫటిక స్వచ్ఛతతో మిక్కిలి నిర్మలమైన వాడును, వ్యోమజనకం = ఆకాశతత్త్వమును ఉత్పాదించు వాడును, శివం = శివునిని, శివసమానవ్యవసితాం = శివునితో సమానమైన సామర్థ్యము గల, దేవీం అపి = భగవతి ఐన నిన్నుగూడ, సేవే = ఉపాసించెదను.

యయోః = ఏ శివాశివుల నుండి, యాంత్యా = వచ్చుచున్నదైన, శశికిరణ సారూప్య సరణిః = చంద్రకిరణ మార్గ సదృశమైన, కాంత్యాః = కాంతివలన, జగతీ = ముజ్జగములు, విధూత + అంతః + ధ్వాంతా = వదలగొట్ట బడిన అంతర అజ్ఞానము గలదై, చకోరీ + ఇవ = ఆడ చకోర పక్షివలె, విలసతి = ప్రకాశించుచున్నదో – అనగా – అట్టి శివాశివులను సేవించెదను అని భావము.)

ఓ జగజ్జననీ! నీ విశుద్ధి చక్రము నందు దోషరహితమైన స్ఫటిక స్వచ్ఛతతో మిక్కిలి నిర్మలమై వుండు వాడును, ఆకాశోత్పత్తికి హేతువైన వాడును అగు శివునిని, అట్టి శివునితో సమానమైన దేవివైన నిన్ను గూడా ఉపాసించు చున్నాను. చంద్రకాంతులతో సాటి వచ్చు మీ ఇరువురి కాంతులు క్రమ్ముకొనుటచే ఈ సాధక లోకము అజ్ఞానము నుండి తొలగి, ఆడ చకోర పక్షివలె ఆనందించును.

అమ్మా! విశుద్ధి చక్రములో నీవు "విశుద్ధ చక్రనిలయా రక్తవర్ణా త్రిలోచనా" రూపములతో వెలసి ఉంటావు. స్ఫటికములుగా నిర్మలమయిన ఆకాశరూపముగా వ్యోమ ఈశ్వరుడు, వ్యోమ ఈశ్వరిగా వెలసి ఉన్న మీ ఇద్దరినీ దర్శించ గలిగిన వారు చంద్రుని నుండి వచ్చే అమృత ధారలను సేవించిన చకోర పక్షి లాగ ఎంతో ఆత్మ సంతృప్తిని పొందుతారు.

ఓ తల్లీ! విశుద్ధిచక్రంలో ధోషరహితుడు స్ఫటికమువలె నిర్మలుడు అయిన శివుని, అతనితో సమానమైన నిన్ను ధ్యానిస్తున్నాను. శివాశివులైన మీ నుండి వచ్చే కాంతులవల్ల సాధకుని యొక్క అజ్ఞానము నశించిపోతుంది. చంద్రకిరణ ములవల్ల చకోరపక్షులు సంతుష్టిచెందినట్లుగా, తన అజ్ఞానము తొలగిపోగా సాధకుడు సంతృప్తి చెందుతాడు.

38. సమున్మీల త్సంవి త్కమల మకరందైకరసికమ్
భజే హంసద్వంద్వం కిమపి మహతాం మానసచరమ్।
యదాలాపా దష్టా దశ గుణిత విద్యాపరిణతిః
యదాదత్తే దోషా ద్గుణ మఖిల మద్భ్యః పయఇవ॥

టీక:- (ఓ జగజ్జననీ!) సమున్మీలత్ = వికసించుచున్న, సంవిత్కమల = జ్ఞానము అను పద్మము నందలి, మకరంద = తేనెయందు మాత్రమే, ఏకరసికం = ముఖ్యముగా ఇష్టపడునదియు, మహతాం = యోగీశ్వరుల యొక్క, మానసచరం = మనస్సులలో చరించునది, లేదా – మానస సరోవరము నందు, కిమపి = ఇట్టిదని చెప్పుటకు వీలులేని, హంసద్వంద్వం = రాజహంసల జంటను, భజే = సేవించెదను, యత్ + ఆలాపాత్ = ఏ హంస మిధునము యొక్క, (పరస్పర మధుర సంభాషణాదుల వలన), అష్టాదశగుణిత = పదునెనిమిది సంఖ్యగా చెప్పబడిన, విద్యా పరిణతిః = విద్యలయొక్క పరిణామము, యత్ = ఏ హంసల జంట, దోషాత్ = అవలక్షణముల నుండి, అఖిలం = సమస్తమైన, సద్గుణ సముదాయమును, అద్భ్యః = నీళ్ళనుండి, పయః ఇవ = పాలను వలె, ఆదత్తే = గ్రహించుచున్నదో.

Kiron Type Institute

ఓ జగజ్జననీ! (అనాహత) జ్ఞాన కమలము నందలి తేనెను మాత్రమే గ్రోలుట యందు ఆసక్తి కలిగినదియు, యోగీశ్వరుల మానస సరోవరములందు విహరించు నదియు – నీరమును విడిచి పాలను మాత్రమే గ్రహించు సామర్ధ్యము గలదియు, దేనిని భజించినచో అష్టాదశ విద్యలు కరతలామలక మగునో అట్టి అనిర్వచనీయమైన శివశక్తులనెడి రాజహంసల జంటను ధ్యానించి భజించు చున్నాను.

(అష్టాదశ విద్యలు – (నాలుగు వేదములు – ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అధర్వణవేద, ఆఱు వేదాంగములు – శిక్షా, వ్యాకరణ, ఛంద, నిరుక్తి, జ్యోతిష, కల్ప, – మీమాంస, న్యాయ, దర్శన, ధర్మశాస్త్ర, ఆయుర్వేద, గాంధర్వవేద, ధనుర్వేద, అర్ధశాస్త్రములు)

పాలను, నీటిని వేరుచేయగల శక్తి కేవలం హంసకే ఉంది. ఎంతో పవిత్రమైన మానస సరోవరము హంసకు నివాసము. పార్వతీ పరమేశ్వరులు హంసేశ్వరి, హంసేశ్వరుని రూపంలో, యోగుల మానసమనే సరోవరంలో విహరిస్తుంటారు. వారు తమ భక్తుల యొక్క దోషములను వదలివేసి, గుణములను మాత్రమే స్వీకరించి భక్తులను అనుగ్రహిస్తారు.

ఓ తల్లీ! వికసిస్తున్న జ్ఞానము అనే అనాహతపద్మమందలి మధువును ఆస్వాదించుటయందు ఆసక్తి గలది, యోగీశ్వరుల మనస్సు అనబడే మానస సరోవరమందు సంచరించేది, ఇటువంటిది అని చెప్పటానికి వీలుకానిది, ఇరవై ఆరవ తత్త్వమైనది అయిన రాజహంస మిధునమును ధ్యానిస్తున్నాను. ఏ హంసలయొక్క పలుకులవలన వేదాలు నాలుగు, వేదాంగాలు ఆరు, మొదలైన పద్దెనిమిది విద్యలు జన్మిస్తున్నాయో, ఏ హంసద్వంద్వము నీటినుండి పాలను వేరు చేసినట్లుగా, ద్వేషము నుండి సద్గుణ సముదాయము గ్రహిస్తున్నదో, ఆ హంస మిధునాన్ని ధ్యానిస్తున్నాను.

39. తవ స్వాధిష్ఠానే హుతవహ మధిష్ఠాయ నిరతం
తమీడే సంవర్తం జనని మహతీం తాంచ సమయామ్।
యదాలోకే లోకాన్ దహతి మహతి క్రోధకలితే
దయార్ద్రా యా దృష్టి శ్శిశిరముపచారం రచయతి॥

టీక:- (ఓ జగజ్జననీ!) తవ = నీ యొక్క, స్వాధిష్ఠానే = స్వాధిష్ఠాన చక్రమందలి, హుతవహం = అగ్నితత్త్వమును, అధిష్ఠాయ = అధిష్ఠించి, నిరతం = ఎల్లప్పుడు, (వెలుగొందు), తం = ఆ, సంవర్తమ్ = 'సంవర్తము' అను అగ్ని రూపములో ప్రకాశించు పరశివుని, ఈడే = స్తుతించెదను, సమయాం = సమయము అను పేరుగలదైన, మహతీం = మహిమాన్వితమైన – గొప్పదైన, తాంచ = సంవర్తాగ్ని రూపమైన నిన్ను గూడ, ఈడే = స్తుతించెదను. మహతి = మిక్కిలి గొప్పదై, క్రోధకలితే = క్రోధముతో కూడినదైన, యత్ + ఆలోకే = యదాలోకే = సంవర్తాగ్ని రూపుడైన ఏ పరమేశ్వరుని యొక్క వీక్షణము, లోకాన్ = భూలోకాది లోకములను, దహతి = దహించునది అగుచుండగా, యా = ఏ, దయార్ద్రా = కృపకలిగిన, దృష్టిః = చూపు, శిశిరం = శీతలమును, ఉపచారం = ఉపశమనమును కలిగించు సత్కారమును, రచయితి = కావించు చున్నదో.

ఓ జగజ్జననీ! నీ స్వాధిష్ఠాన చక్రమందున్న అగ్ని తత్త్వమును అధిష్ఠించి నిరంతరము వెలుగొందుచు, ప్రసిద్ధుడైన 'సంవర్తాగ్ని' అను రూపముతో జ్వలించు ఆ పరమేశ్వరుని స్తుతించు చున్నాను. అట్లే మహిమాన్వితమైన, మహనీయురాలైన, 'సమయ' అను పేరు గలదియు, ఆ సంవర్తాగ్ని రూపిణియైన శక్తిని (నిన్ను) స్తుతించెదును. మహత్తరము, మహాద్భుతమునైన పరమేశ్వరుని 'సంవర్తము', అను క్రోధాగ్ని దృష్టి భూలోకాదులను దహించగా, నీవు దయార్ద్ర దృష్టితో ఆ లోకము లన్నిటినీ శీతలోపచారములతో ఉపశమనము కలుగ జేసి సంరక్షించు చున్నావు.

కల్పాంత ప్రళయ కాలములో ఈశ్వరుడు ఈ జగత్తును లయము చేస్తుండగా, నీవు నీ అమృత దృక్కులతో సృష్టిని తిరిగి ప్రారంభిస్తావు. జలరూపములో స్వాధిష్టాన చక్రములో సమయాంబగా, చల్లని తల్లిగా ప్రణయరూపుడైన సంవర్తేశ్వరునితో కూడి దర్శనమిస్తావు.

తల్లీ! స్వాధిష్ఠానచక్రమందున్న అగ్నితత్త్వాన్ని అధిష్టించి నిరంతరము ప్రకాశిస్తూ ఉండే సంవర్తాగ్నిరూపంలో ఉన్న ఆ పరమేశ్వరుని స్తుతి చేస్తున్నాను. అలాగే సంవర్తాగ్ని రూపిణి అయిన శక్తిని ఆరాధిస్తున్నాను. అగ్నిరూపుడైన శివుని తీక్షణ దృక్కులచేత లోకాలు దగ్ధమవుతుండగా, పరమేశ్వరి యొక్క దయార్ద్ర ద్రుక్కులచే ఆ లోకాలకు శీతలోపచారములు కలుగుతున్నాయి.

40. తటిత్త్వంతం శక్త్యా తిమిర పరిపంథిస్ఫురణయా
స్ఫురన్నానా రత్నా భరణ పరిణ ద్ధేంద్ర ధనుషమ్।
తవశ్యామం మేఘం కమపి మణిపూరైక శరణమ్
నిషే వే వర్షంతం హరమిహిర తప్తం త్రిభువనమ్॥

టీక:- (ఓ జగజ్జననీ!) తవ = నీ యొక్క, మణిపూర = మణిపుర చక్రమే, ఏకశరణం = ముఖ్యమైన నివాసముగా గలదియు, తిమిర = (ఆ మణిపూర చక్రమున పొందిన) చీకటికి, పరిపంథి = శత్రువై; స్ఫురణయా = ప్రకాశించునట్టి, శక్త్యా = శక్తి చేత, తటిత్త్వంతం = విద్యుల్లత, అనగా – మెఱుపు గలదియు, స్ఫురత్ = ప్రకాశించుచున్న, నానారత్న = వివిధములైన రత్నములచేత నిర్మింపబడిన, ఆభరణ = నగలచేత, పరిణద్ధ = కూర్చబడిన, ఇంద్రధనుషం = ఇంద్రధనుస్సు గలదియు, శ్యామం = నీలి వన్నెలు గలదియు, హర మిహిర తప్తం = శివుడను సూర్యునిచే దగ్ధమైన, త్రిభువన = మూడు లోకముల గూర్చి, వర్షంతం = వర్షించునదైన, కంఅపి = ఇట్టిది అని చెప్పడానికి వీలుకాని, మేఘం = మేఘస్వరూపమున నున్న శివుని, నిషేవే = చక్కగా సేవించెదను.

నీ మణిపూర చక్రమే నివాసముగా గలిగి, ఆ మణిపూర చక్రమును ఆక్రమించి యుండు చీకటికి శత్రువై ప్రకాశించు నట్టి మెఱుపు శక్తిని గలిగి, వివిధ రత్నములచేత తయారు చేయబడిన నగల చేత కూర్చబడిన ఇంద్ర ధనుస్సును గలిగి, నీలి వన్నెలు గలిగిన హరుడను సూర్యునిచే (సంవర్తాగ్నిచే) దగ్ధమైన మూడు లోకములకు తాపోపశమనముగా వర్షించునదియు,

ఇంతటిది అని చెప్పనలవి కానిదియు అయిన - మేఘమును, మేఘ స్వరూపములో నున్న శివుని సేవించు చున్నాను.

తల్లీ! నీవు మణిపూరాబ్జనిలయవు. మణిపూర చక్రములో, నీల మేఘములాగ ప్రకాశిస్తున్న ఈశ్వరునితో కలసి, మెరుపువలే ప్రకాశిస్తూ, మీరిరువురూ, మేఘేశ్వర, సౌదామినులనే పేర్లతో మీ భక్తులకు దర్శనమిస్తారు. మీ కరుణారస దృష్టిని వర్షమును కురిపించే మేఘములాగ కురిపిస్తారు.

భగవతి! మణిపూరచక్రములో అలముకున్న అంధకారంలో మెరుపులాగా ప్రకాశించే ఓ దేవీ! స్వాధిష్ఠానచక్రంలో శివుడు సంవర్తాగ్నిచేత దగ్ధంచేసిన లోకాలను ఆదేవి తనవర్షధారలచే తడుపుతున్నది. నవరత్నాభరణములు ధరించి ఇంద్రధనుస్సు లాగా ప్రకాశిస్తున్నది. నల్లని వర్ణము గలది అయిన మేఘమును మేఘరూపంలో ఉన్న పశుపతిని ధ్యానిస్తున్నాను.

41. తవాధారే మూలే సహ సమయయా లాస్యపరయా
నవాత్మానం మన్యే నవరసమహాతాండవనటమ్।
ఉభాభ్యామేతాభ్యా ముదయవిధి ముద్దిశ్య దయయా
సనాథాభ్యాం జజ్ఞే జనక జననీమ జ్జగ దిదమ్॥

టీక:- (ఓ జగజ్జననీ!) తవ = నీ యొక్క, మూలాధారే = మూలాధార చక్రమునందు, లాస్యపరయా = నృత్యాసక్తిగల, సమయయాసహా = 'సమయ' అను పేరుగల శక్తి గూడ, నవ = తొమ్మిది, రస = శృంగారాదిరసముల చేత, మహత్ = అద్భుతమైన, తాండవ = నాట్యమునందు, నట = అభినయించువాడైన, నవ + ఆత్మానం = తొమ్మిది రూపులుగల ఆనందభైరవుని, మన్యే = తలచెదను. ఉదయవిధిం = జగదుత్పత్తి కార్యమును, ఉద్దిశ్య = ఉద్దేశించి, ఏతాభ్యాం = ఈ, ఉభాభ్యాం = ఇరువురిచేత (అనగా - ఆనందభైరవ మహాభైరవుల చేత), దయయా = (ప్రళయాగ్నికి దగ్ధమైన లోకములను మరల నుత్పత్తిచేయుట యందు) కరుణతో, సనాథాభ్యాం = ఇరువురి కలయిక చేత, ఇదంజగత్ = ఈ జగత్తు, జనక జననీమత్ = తండ్రియు తల్లియు గలది (అగుచున్నదని) జజ్ఞే = తెలుసుకొనుచున్నాను.

తల్లీ! జగజ్జననీ! నీ యొక్క మూలాధార చక్రము నందు - లాస్యము నందు ఆసక్తురాలైన 'సమయ' అను పేరుగల మహాభైరవితో గూడి, శృంగారాది నవరసములతో నొప్పారు 'తాండవ' మును అభినయించు వానిని - నవాత్మునిగా, లేదా - తొమ్మిది రూపులు గల ఆనందభైరవునిగా తలంచు చున్నాను. ప్రళయాగ్నికి దగ్ధమైన లోకములను మరల నుత్పత్తి చేయు కారణము వలన, ఈ ఇరువురి కలయికతో జగత్తు తల్లితండ్రులు కలిగినదగుచున్నదని తెలుసుకొను చున్నాను.

జగన్మాతా! నీవు మూలాధారామ్బుజారూఢవు. లాస్యమును ఎంతో అభిమానించే నటరాజ స్వరూపుడైన ఈశ్వరునితో కలిసి మూలాధారములో నీవు శృంగారాధి దేవతగా ఉన్నావు. జగన్మాతా పితరులైన మీరిరువురు, మూలాధారములో నటేశ్వరి, నటేశ్వరుగా భక్తులను అనుగ్రహిస్తారు.

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్
Kiron Type Institute

ఓ తల్లీ! ఆధారచక్రంలో శృంగారపరమైన నృత్యమునందు ఆసక్తురాలవై సమయ అనే పేరుగల శక్తివైన నీతో కలిసి నవరసమహాతాండవం చేస్తున్న పరమశివుడు ఆనంద భైరవుడు. నీవు ఆనందభైరవివి. భైరవి భైరవులు అనే పేర్లుగల శివశక్తులు జగత్తును ఉత్పత్తిచేసే కార్యక్రమంలో ఆధారచక్రంలో నిమగ్నమై ఉంటారు.

42. గతైర్మాణి క్యత్వం గగనమణిభి స్సాంద్రఘటితం
కిరీటం తే హైమం హిమగిరి సుతే కీర్తయతి యః।
స నీడేయచ్ఛాయా చ్ఛురణ శబలం చంద్రశకలం
ధనుశ్శౌనాసీరం కిమితి న నిబధ్నాతి ధిషణామ్॥

టీక:- హిమగిరిసుతే! = ఓ మంచుకొండ కూతురైన పార్వతీ!, మాణిక్యత్వం = మాణిక్యాదులచే, గతైః = పొందబడినట్టి, గగనమణిభిః = ఆకాశములో మణులవలె ప్రకాశించు ద్వాదశ ఆదిత్యుల చేత, సాంద్రఘటితం = దగ్గఱ దగ్గఱగా కూర్చబడినది అగు, హైమం = బంగారముతో నిర్మింపబడిన, తే = నీ యొక్క, కిరీటం = కిరీటమును, యః = ఏ సాధకుడు (లేదా - కవి), కీర్తయతి = కీర్తించునో (లేదా వర్ణించునో), సః = అతడు కిరీటము నందలి ఆ రత్నముల యొక్క, ఛాయా = కాంతిచేత, చురణ = వ్యాపించుట యందు, శబలం = పీతారుణ నీలవర్ణాది చిత్ర చిత్ర వర్ణములు గలిగినదైన, చంద్రశకలం = చంద్రరేఖను చూచినపుడు, శౌనాసీరం = ఇంద్ర సంబంధమైన, దనుః ఇతి = ధనుస్సు ఇది అని, ధిషణాం = (అతని) బుద్ధిని, ననిబధ్నాతి = (ఎట్లు) బంధింప కుండును? (అనగా - తలచకుండా ఎట్లు ఉండును? - అని భావము).

హిమగిరి సుతా! ఓ పార్వతీ! మాణిక్యముల రూపుతో ఆకాశమునకు మణుల వలె నుండు ద్వాదశ ఆదిత్యులచేత చక్కగా, దట్టముగా, కూర్చబడి చెక్కబడినదైన - నీ బంగారు కిరీటమును ఎవడు వర్ణించి కీర్తించునో అతడు - గోళాకారముగా నుండు ఆ నీ కిరీటము నందు పొదగబడిన ఆదిత్యమణి కాంతి వ్యాపించుటచేత పసుపు, ఎఱుపు, నీలము, ఆకుపచ్చ మొదలగు వింత వింత వన్నెలను పొందినదై నీ నుదురుపైన అలంకారముగా నున్న చంద్రరేఖను గాంచి - దానిని తప్పనిసరిగా ఆ ఇంద్రధనుస్సే అయి వుండునని తన చిత్తములో భావించి ధ్యానించును.

(ద్వాదశాదిత్యులు - ఇంద్రుడు, ధాత, పర్జన్యుడు, త్వష్ట, పూషుడు, అర్యముడు, భగుడు, వివస్వంతుడు, విష్ణువు, అంశుమంతుడు, వరుణుడు, మిత్రుడు.)

(అమావాస్యనాడు సూర్యుడు, చంద్రుడు ఒకే రాశిలో, ఒకే డిగ్రీవద్ద వుందురు, సూర్యుడు రాశి చక్రములో 1 రోజుకు 1 డిగ్రీ ముందుకు పోవును. చంద్రుడు సుమారు 13^0 ముందుకు పోవును. అనగా - సూర్యునితో పోల్చినపుడు చంద్రుని సాపేక్షవేగము 1 రోజుకు $13^0 - 1^0 = 12^0$ అగును. ఒకొక్క రోజుకు చంద్రుడు ఈ 12^0 సాపేక్షవేగముతో సూర్యుని కంటె ముందు వుండును. మాసములోని మొత్తము 15+15 = 30 తిథులలో చంద్రుడు 30×12 = 360 డిగ్రీలు పూర్తి చేసి మాసాంతమునకు మరల సూర్యుని వద్దకు చేరును. - అందుచేతనే అమావాస్య నాడు పూర్తి చీకటి - పౌర్ణమి కి 180^0 లలో ఉండుటవలన పూర్తి వెలుతురు)

ఓ పర్వతరాజ పుత్రీ! నీవు "కురువిందమణిశ్రేణికనత్కోటీరమండితా" అని కీర్తింపబడ్డావు. నీ కిరీట కాంతులు ద్వాదశాదిత్యుల కాంతులను మించి ఉన్నవి. ఆ కిరీటము మీద నెలకొనిఉన్న చంద్రవంక సూర్యకాంత మాణిక్యముల ప్రకాశముతో ధగధగా వెలుగుచున్నది.

ఓ దేవీ! హిమవంతుని కుమార్తె అయిన హైమవతీ! ద్వాదశాదిత్యులనే మణులచే చక్కగా పొదగబడిన నీ బంగారుకిరీటమును కీర్తించినవాడు, ఆ కిరీటంలో ద్వాదశాదిత్యులు అనే మణులయొక్క కాంతులతో కలిసి చిత్రవిచిత్రమైన కాంతులను ప్రసరింపచేస్తున్న చంద్రరేఖను గాంచి అది ఇంద్రధనుస్సు అని భ్రమిస్తాడు.

43. ధునోతు ధ్వాంతం న స్తులిత దళితేం దీవరవనం
ఘనస్నిగ్ధశ్లక్ష్ణం చికుర నికురుంబం తవ శివే।
యదీయం సౌరభ్యం సహజ ముపలబ్ధుం సుమనసో
వసన్త్యస్మి న్మన్యే వలమథన వాటీ విటపినామ్॥

టీక:- (హే) శివే! = (ఓ) పార్వతీ, దళిత = వికసించిన, ఇందీవరవనం = నల్లకలువలతో దట్టముగా నిండి యున్న తోటవలె ఒప్పారుచు, ఘన = నల్లని మేఘము వలె, లేదా - చక్కనైన, స్నిగ్ధ = సుగంధ తైలవాసనలు గుభాళించుచు, లేదా - నునుపుగా నుండునదియు, శ్లక్ష్ణం = మెత్తగా నుండునదియు, అయిన - తవ = నీయొక్క, చికుర నికురుంబం = శిరోజముల సమూహము, లేదా - కేశపాశము, నః = మా యొక్క, ధ్వాంతం = అంతస్తిమిరమును, అనగా - హృదయగత అజ్ఞానాంధకారమును, ధునోతు = తొలగించుగాక, యదీయం = ఏ కేశపాశ సంబంధమైన, సహజం = స్వభావసిద్ధమైన, సౌరభ్యం = పరిమళమును, ఉపలబ్ధుం = పొందుటకు, అస్మిన్ = ఈ కేశపాశమందు, వలమథన = ఇంద్రుని, వాటీ = నందనోద్యానమందలి, విటపినాం = కల్పవృక్షముల యొక్క, సుమనసః = పుష్పములు, వసంతి = నివసించు చున్నవని, లేదా - తురమబడుటను కోరుచున్నవని, మన్యే = తలంచెదను.

ఓ తల్లీ! పార్వతీ! వికసించుచున్న నల్లకలువలు ఒత్తుగా నున్న తోటవలె ఒప్పారుచు - నల్లదనము, చిక్కదనము, నునుపుదనము, మెత్తదనము గలిగిన నీ కేశ పాశమునందు తురమబడుటకు, లేదా = వసించుటకు స్వర్గలోకమందలి కల్పవృక్ష పుష్పములు ఆసక్తిగా ఎదురు చూచుచుండును. అట్టి నీ కేశపాశ దర్శనము మా హృదయగత అజ్ఞానాంధ కారమును తొలగించి, మమ్ము ప్రజ్ఞానవంతులుగా చేయుగాక!

కేశములకు సహజ సువాసన ఉండదు. సువాసన ఉన్న పుష్పములు ధరించుటవలన కురులకు సుగంధం అబ్బుతుంది. కానీ, అమ్మా! నీ కేశములు నల్ల కలువల లాగ, నల్లటి మేఘముల లాగ నిగనిగ మెరిసిపోతున్నాయి. నీ కేశపాశము సుగంధ భరితము. అందుకనే కల్పవృక్షముల పుష్పములు నీ శిరోజములను అలంకరింపబడాలని కోరుకుంటాయి.

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

ఓ తల్లీ! అప్పుడే వికసించిఉన్న నల్లకలువల సమూహములాగా, కారుమబ్బుల లాగా దట్టమై, చిక్కనై సుగంధతైలములతో కూడుకొన్న దానిలాగా, మెత్తగా ఉన్న నీ కురులు మాయొక్క అజ్ఞానమును తొలగించుగాక. నీ కురులయొక్క సువాసనలు తమకు కూడా తెచ్చుకోవటానికి అన్నట్లు ఇంద్రుని నందనోద్యాన వనంలోని కల్పవృక్షపూలు నీ కురులయందు చేరినాయి.

44. తనోతు క్షేమం న స్తవ వదన సౌందర్యలహరీ
పరీవాహ స్రోత స్సరణిరివ సీమంత సరణిః।
వహన్తీ సిందూరం ప్రబల కబరీ భార తిమిర
ద్విషాం బృందైర్బందీకృత మివ నవీనార్క కిరణమ్॥

టీక:- (ఓ జగజ్జననీ!) తవ = నీ యొక్క, వదన సౌందర్య = ముఖ సౌందర్యపు, లహరీ = అలల వెల్లువల యొక్క, పరీవాహ = కాలువయందు, స్రోతః = నీటి ప్రవాహమువలె పారుచున్న, సరణిః ఇవ = దారివలె కనబడు, సీమంతసరణిః = నీ పాపట దారి, – ప్రబల = బలముగాను, దట్టముగాను ఉన్న, కబరీభార = (నీ) కురుల మొత్తమును, తిమిర = కటిక చీకటి రూపముగా గలిగి యున్న, ద్విషాం = శత్రువుల, బృందైః = సమూహముచేత, బందీకృతం = బందీగా చేయబడిన, నవీన + అర్క = ప్రాతః కాలపు సూర్యుని, కిరణం = కిరణమువలె, సిందూర = సిందూరమును, వహంతీ = వహించుచున్నదై, నః = మాకు; క్షేమం = శుభమును, క్షేమమును, తనోతు = విస్తరింప చేయుగాక!

తల్లీ! జగజ్జననీ! నీ ముఖ సౌందర్య ప్రకాశ ప్రవాహము ప్రవహించుటకు వీలుగా నుండు కాలువవలె – నీ పాపట దారి కనబడుచున్నది. ఆ పాపటకు ఇరువైపులా దట్టముగా నున్న నీ కురుల సమూహములు – కటిక చీకటి రూపముతో ఇరువైపులా బృందములుగా తీరి యున్న శత్రువులవలె కనబడు చుండగా – వాటి మధ్య బందీగా చిక్కుబడిన ప్రాతః కాల సూర్య కిరణము వలె – నీ పాపట యందలి సింధూరపు రేఖ భాసించుచున్నది. అట్టి సిందూర రేఖతో నుండు నీ పాపట మాకు నిత్యము శుభ సౌభాగ్య యోగ క్షేమములను విస్తరింపజేయుగాక.

అమ్మా! నిగనిగలాడుతున్న నీ నల్లని కురులు, ఆ కురుల మధ్య భాగములో ఎర్రటి సింధూరము. వీటిని చూస్తుంటే నాకేమనిపిస్తోందో తెలుసా తల్లీ. చీకటిని చీల్చుకు వస్తున్న బాలభానుని ఎర్రటి కిరణములు కనిపిస్తున్నాయి. నీ వదనమనే సౌందర్యలహరిలో, నీ కురుల పాపిట ఉన్న కుంకుమరేఖ నీ భక్తులకు ప్రవాహము యొక్క జాలు లాగ దారి చూపుతోంది.

ఓ తల్లీ! నీయొక్క వదన సౌందర్యము పొంగిప్రవహించే ప్రవాహములాగా ఉన్నది. ఆ ప్రవాహము నుండి చీలి ప్రవహించే నీటిపాయలాగా నీపాపిట ఉన్నది. దానికి రెండువైపులా ఉన్న దట్టమైన నీకురులు, కారుచీకటిలాగా నల్లగా ఉండి, ఆ పాపిటకు రెండువైపులా ఉన్న శత్రుసమూహమువలె ఉండగా ఆ మధ్యఉన్న ఆ సింధూరము సమూహానికి బందీగా చిక్కిన బాలసూర్యునిలా కనిపిస్తూ, మాకు జ్ఞానజ్యోతులు ప్రసాదిస్తున్నది.

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute

45. ఆరాళై స్వాభావ్యా దళికలభస శ్రీ భిరలకైః
పరీతం తే వక్త్రం పరిహసతి పంకేరుహరుచిమ్।
దరస్మేరే యస్మిన్ దశనరుచికింజల్క రుచిరే
సుగంధౌ మాద్యంతి స్మరదహన చక్షుర్మధులిహః॥

టీక:- (హే జగజ్జననీ!) స్వాభావ్యాత్ = సహజముగనే, ఆరాళైః = వంకరగా నుండు, అళికలభసశ్రీభిః = గండు తుమ్మెదల కాంతి వంటి కాంతులు గలవియైన; అలకైః = ముంగురులచేత, పరీతం = అందముగా తీర్చిదిద్దబడిన, తే = నీ యొక్క, వక్త్రం = వదనము, పంకేరుహరుచిం = కమలముల యొక్క వికాస సౌందర్యమును, పరిహసతి = తనతో సాటి రాదని ఎగతాళి చేయుచున్నది. (కారణమేమనగా) దరస్మేరే = వికాస స్వభావముగల లేనగువు గలదై, దశన = దంతముల యొక్క, రుచి = కాంతులనెడి, కింజల్క = కేసరములచే, రుచిరే = సుందర బంధురమై, సుగంధౌ = సహజ సుగంధముతో, ఒప్పారుచునుండు, యస్మిన్ = ఏ ముఖ (పద్మము) నందు, స్మరదహన = మన్మథుని (తన మూడవ కంటితో) దహించిన శివుని యొక్క, చక్షుఃమధులిహః = కన్నులు అను తుమ్మెదలు, మాద్యంతి = మత్తు గొని అనందించుచున్నవి కావున.

తల్లీ జగజ్జననీ! చిఱునగవుతో వెలువడు వికాసము గలిగి, దంత కాంతులనెడి కేసరములచే సుందర బంధురమై, సహజ సుగంధములతో ఒప్పారుచు నుండి, సహజముగానే వంకరగా నుండి, గండు తుమ్మెదల కాంతి వంటి కాంతి గలవి యైన ముంగురుల చేత అందముగా తీర్చిదిద్దబడిన - నీ ముఖము అనెడి పద్మమును చూచుచు శివుని కన్నులు అను తుమ్మెదలు ముదముతో నిరంతరము మత్తు గొని ఆనందించుచున్న కారణమున నీ వదనార విందము - కమలముల యొక్క వికాస సౌందర్యము తనతో సాటి రాదని వాటిని ఎగతాళి చేయుచున్నది.

జగన్మాతా! తుమ్మెదల వంటి నీ నల్లని ముంగురులు కొద్ది కొద్దిగా ముందుకు వంగి నీ ఫాలభాగముపై నిలచి శోభనిస్తుంటే, పద్మమువంటి నీ ముఖములో దంతములు కేసరములవలే ప్రకాశిస్తుంటే, ఈశ్వరుడు నీ ముఖముపై నుండి దృష్టిని మరల్చలేకపోతున్నాడు తల్లీ!

ఓ తల్లీ! నీ ముఖాన వ్రేలాడే ముంగురులు వంకరలు తిరిగి నీ ముఖపద్మము కన్న అందంగా ఉన్నది. నువ్వు చిరునవ్వు నవ్వినప్పుడు నీ పలువరుస కిజిల్కముల (కేసరములు) వలె ప్రకాశిస్తూ, మన్మథుని భస్మంచేసిన శివుని చూపులు అనే తుమ్మెదలను నీ ముఖపద్మము ఆకర్షిస్తున్నది.

46. లలాటం లావణ్యద్యుతి విమల మాభాతి తవ యత్
ద్వితీయం తన్మన్యే మకుట ఘటితం చంద్రశకలమ్।

విపర్యా సన్యాసా దుభయ మపి సంభూయ చ మిథః
సుధాలేపస్యూతిః పరిణమతి రాకాహిమకరః॥

టీక:- (ఓ జగజ్జననీ!) తవ = నీ యొక్క, యత్ = ఏ, లలాటం = నుదురు భాగము, లావణ్యద్యుతి = సౌందర్యాతిశయకాంతితో, విమలం = స్వచ్ఛము, పవిత్రవంతమును అగుచు, ఆభాతి = అంతటా ప్రకాశించు చున్నదో, తత్ = దానిని, మకుట ఘటితం = కిరీటము నందు కూర్చబడినదైన, ద్వితీయం = రెండవ దైన, చంద్రశకలం = చంద్రుని అర్ధఖండముగా, మన్యే = ఊహించుచున్నాను. యత్ = ఏ కారణము వలన, ఉభయం అపి = నీ లలాట భాగము, ఆ చంద్ర ఖండము – ఈ రెండును, విపర్యాసన్యాసాత్ = వ్యత్యస్తముగా కలుపుట వలన, మిథః = పరస్పరము, సంభూయచ = కలసికొని, సుధాలేపస్యూతిః = అమృతస్రావ లేపనము వలన, రాకాహిమకరః = పూర్ణిమాచంద్రునిగా, పరిణమతి = (తదాకారమును పొందబడినదిగా) అగుచున్నది.

తల్లీ! జగజ్జననీ! నీ లలాట భాగము, అనగా – నుదురు భాగము – పవిత్రమైన సౌందర్యాతిశయముతో ప్రకాశించు చున్నది. అట్టి ఈ లలాట భాగము – నీ కిరీటము నందు కనబడకుండా నున్న చంద్రుని రెండవ అర్ధభాగముగా ఉన్నట్లు ఊహించు చున్నాను. (నా ఈ ఊహ నిజమే అయి వుండవచ్చును). కారణమేమనగా – నీ లలాట భాగమును ఆ అర్ధ చంద్ర భాగమును వ్యత్యాస్తముగా వాటి వాటి కొమ్ములు కలియునట్లు కలిపినచో అమృతమును స్రవించు పూర్ణ చంద్రుని ఆకారమును పొందుచున్నది. ఆ స్రవింపబడు అమృతముతోనే ఆ రెండును అతకబడినట్లుగూడా కనబడని విధముగా కలసిపోయి పూర్ణచంద్రుని వలె భాసించు చున్నవి గదా!

అమ్మా! నీ పాలభాగము సగము చంద్రునిగాను, కిరీటముపైనున్న చంద్రరేఖ రెండవ సగముగాను, రెండూ కలసి పూర్ణ చంద్ర బింబముగాను ద్యోతకమౌతున్నాయి. పూర్ణచంద్రుడు అమృత ధారలను వర్షించినట్లు నీ ముఖము భక్తులపై దయాసుధారసమును జాలువార్చు చున్నది. నీవు "అష్టమీచంద్రవిభ్రాజదళికస్థలశోభితవు" కదా అమ్మా!

తల్లీ! చంద్రకాంతులవంటి కాంతులు ప్రసరించుచున్న నీవదనాన్ని నేను రెండవ చంద్రఖండము అనుకుంటున్నాను. ఎందుకంటే మొదటిఖండము నీ కిరీటము నందు పొదగబడి ఉన్నది. ఈ రెండింటినీకలిపితే పూర్ణచంద్రబింబము ఏర్పడుతున్నది.

47. భ్రువౌ భుగ్నే కించిద్భువన భయభంగవ్యసనిని
త్వదీయే నేత్రాభ్యాం మధుకర రుచిభ్యాం ధృతగుణమ్
ధను ర్మన్యే సవ్యేతరకర గృహీతం రతిపతేః
ప్రకోష్ఠే ముష్టౌచ స్థగయతి నిగూఢాంతర ముమే॥

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్
Kiron Type Institute

టీక:- (హే) ఉమే! = ఓ పార్వతీ! భువన = లోకముల యొక్క, భయ = ఉపద్రవములను, భంగ = నాశము చేయుట యందే, వ్యసనిని = ఆసక్తిగల దేవీ!, త్వదీయే = నీ యొక్క, కించిత్ భుగ్నే = కొద్దిగా వంగినవి అయిన, భ్రువే = కనుబొమలను, మధుకర రుచిభ్యాం = తుమ్మెదలవంటి శోభకలిగినటువంటి, లేదా – తుమ్మెదల వరుసగా అగుపించు, నేత్రాభ్యాం = కనుదోయిచేతను, ధృతగుణం = పొందిన అల్లెత్రాడు గలదై, రతిపతేః = మన్మథుని యొక్క, సవ్యేతర = ఎడమది అయిన, కర = హస్తముచేత, గృహీతం = పట్టుకొనబడినదియు, ప్రకోష్ఠే = మణికట్టును, ముష్టౌచ = పిడికిలియు, స్థగయతిసతి = కప్పుచున్నది కాగా, నిగూఢాంతరం = కప్పబడి చూడబడని వింటినారి, వింటి నడిమి భాగము గలదైన, ధనుః = విల్లునుగా, మన్యే = తలంచుచున్నాను, లేదా – ఊహించు చున్నాను.

ఎల్లలోకములకు గలుగు ఆపదలనుండి వాటిని రక్షించుట యందే పట్టుదలతో గూడిన ఆసక్తి గల ఓ తల్లీ! ఉమా! కొద్దిగా వంపుగా వంగినట్లున్న నీ కనుబొమల తీరు – తుమ్మెదల వంటి శోభను గలిగి, అడ్డముగా వరుసలో నున్న నల్లని కనుదోయిని వింటినారిగా గలిగి – మన్మథుని వామహస్తము యొక్క పిడికిలి చేత నడిమి భాగములో పట్టుబడుటచే కనబడకుండా నున్న కొంత నారి భాగమును, దండభాగమును కలిగిన – విల్లుగా అనిపించు చున్నది.

తల్లీ నీ కనుబొమలు మన్మథుని యొక్క చెరకు విల్లువలె కనబడుతున్నాయి. తుమ్మెదల గుంపువలె దట్టముగా నల్లగా ఉన్న నీ కనుబొమలు మన్మథుడు సారించి వదలటానికి సిద్ధంగా ఉన్న వింటిలాగ ఉన్నాయి. “వదనస్మరమాంగళ్యగృహతోరణచిల్లిక” గా వర్ణింపబడినది మాత!

ఓ తల్లీ! కొంచెము వంగిఉండి, తుమ్మెదల వరుసలాగా నీలిరంగుకలిగి, అందమైన కనుగవ చేత కట్టబడిన అల్లెత్రాడుతో కూడిన నీ కనుబొమల జంట మన్మథుడు తన ఎడమచేతి పిడికిలితో పట్టుకున్నప్పుడు కనుపించకుండా ఉన్న ధనుస్సు యొక్క మధ్యభాగము అని తలుస్తాను.

48. అహస్సూతే సవ్యం తవ నయన మర్కాత్మక తయా
త్రియామాం వామం తే సృజతి రజనీనాయకతయా।
తృతీయా తే దృష్టి ర్దర దళిత హేమాంబుజరుచి
స్సమాధత్తే సంధ్యా దివసనిశయో రంతరచరీమ్॥

టీక:- (హే భగవతీ!) తవ = నీ యొక్క, సవ్యం = కుడివైపున దైన, నయనం = కన్ను, అర్కాత్మకతయా = సూర్య సంబంధమైన దగుటచేత, అహః = పగటిని, సూతే = పుట్టించు చున్నది, వామం = ఎడమవైపునదైన, తే = నీ యొక్క, నయనం = కన్ను, రజనీనాయకతయా = చంద్ర సంబంధమైన దగుట చేత, త్రియామాం = రాత్రిని, సృజతి = కలిగించు చున్నది. దర = కొంచెముగా, దళిత = వికసించినదైన, హేమాంబుజ = ఎఱ్ఱతామర పూవు యొక్క, రుచిం = ప్రకాశము వంటి రంగుగల, తే = నీ యొక్క, తృతీయాదృష్టిః = లలాటమున నున్న

మూడవ కన్ను, దివస నిశయోః = పగలు రాత్రి అను వాని యొక్క, అంతరచరీ = నడుమ వర్తించు చున్నదైన, సంధ్యాం = సాయం, ప్రాతః కాలముల సంబంధమైన సంధ్యల జంటను, సమాధత్తే = చక్కగా ధరించు చున్నది.

అమ్మా! జగజ్జననీ! నీ కుడికన్ను సూర్య సంబంధమైన దగుటచే పగటిని జనింపజేయుచున్నది. నీ యొక్క ఎడమ కన్ను చంద్ర సంబంధమైన దగుటచే రాత్రిని పుట్టించు చున్నది. ఎఱ్ఱ తామర పూవు రంగు గల నీలలాట నేత్రము అహోరాత్రముల నడుమ వర్తించుచు సాయం ప్రాతః కాల సంబంధమైన ఉభయ సంధ్యలను (అగ్నిని సూచించు ఎఱుపు దనము తన వర్ణ లక్షణముగా గలదని సూచించుట వలన ఈ తృతీయ నేత్రము అగ్ని సంబంధమైనదని గ్రహించవలెను) గాంచుచున్నది.

మాతా! సూర్య చంద్రులు నీ రెండు నయనములు. ఒక నయనము పగటిని లేదా వెలుతురును సంకేతించగా, రెండవ నయనము రాత్రిని లేదా తిమిరమును సంకేతిస్తుంది. ఇక నీ మూడవ నేత్రము సంధ్యా సమయమును సంకేతిస్తున్నది తల్లీ!

ఓ తల్లీ! నీ కుడికన్ను సూర్యుడు. దీనివల్ల పగలు కలుగుతున్నది. ఎడమకన్ను చంద్రుడు. దానివల్ల రాత్రి కలుగుతున్నది. నీ మూడవ నేత్రము ఉభయ సంధ్యలకు ప్రతీకగా ఉన్నది.

49. విశాలా కళ్యాణీ స్ఫుటరుచి రయోధ్యా కువలయైః
కృపాధారాఽఽధారా కిమపి మధురా భోగవతికా।
అవంతీ సృష్టి స్తే బహునగర విస్తార విజయా
ధ్రువం తత్తన్నామ వ్యవహరణ యోగ్యా విజయతే॥

టీక:- (హే భగవతీ!) తే = నీ యొక్క, దృష్టిః = చూపు, అనగా – నేత్రము, విశాలా = విపులము, కళ్యాణీ = మంగళ స్వరూపము, స్ఫుటరుచిః = స్పష్టకాంతివంతము, కువలయైః = నల్లకలువల చేత, అయోధ్యా = జయించుటకు వీలుకానిది, కృపాధారా + ఆధారా = కరుణాప్రవాహ మునకు ఆధారము, కిమపి = ఇట్టిదని చెప్పుటకు వీలుకానిది, మధురా = మధుర మనోజ్ఞము, ఆభోగవతికా = విశాల దృక్పథము గలది, అవంతీ = రక్షణ లక్షణము గలది, బహునగర = పెక్కు పట్టణముల, విస్తార = విస్తరిల్లినది, విజయా = విజయము గలదియు (అగుచు), తత్‌తత్ = ఆయా నామ నగరముల పేర్ల చేత, అనగా విశాలా, కళ్యాణీ, అయోధ్యా, ధారా, మధురా, భోగవతీ, అవంతీ, విజయా – అను ఎనిమిది నగరుల పేర్లచేత, వ్యవహరణ = వ్యవహరించుటయందు, యోగ్యా = తగినదై, విజయతే = విజయవంతమై వర్ధిల్లుచున్నది, ధ్రువం = (ఇది) నిశ్చయము.

తల్లీ! జగజ్జననీ! నీ చూపు విశాలమై – విశాల (బదరీనాథ్) యను నగర నామమున వ్యవహరించుటకు తగినదియై; కళ్యాణవంతమై = కళ్యాణీ (బొంబాయి – నాసిక్‌ల మధ్య నున్న ఒక ప్రాంతము) అను నగర నామ వ్యవహారమునకు యోగ్యమై; స్పష్టమైన కాంతి గలిగి – నల్ల కలువలు జయించలేని సౌందర్యము కలది అగుచు; అయోధ్య (ఉత్తర ప్రదేశ్‌లోని

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

అయోధ్య) అను నగరము పేర పిలుచుటకు తగినదై; కృపారస ప్రవాహమునకు ఆధారమగుచు – ధారా (నేటి ధార్ ప్రాంతం) నగర నామముతో వ్యవహరించుటకు తగినదై; వ్యక్తము చేయ వీలులేని మధుర మనోజ్ఞ మగుచు – మధురా (నేటి మధురయే) నగర నామముతో పిలుచుటకు అర్హమై; విశాలము, పరిపూర్ణ దృక్పథమును గలుగుచు – భోగవతీ (నేటి అమరావతి) నగర నామముతో వ్యవహరించుటకు తగినదై; రక్షణ లక్షణము కలిగి – అవంతీ (నేటి ఉజ్జయిని) నగర నామముతో పిలుచుటకు తగినదై; విజయ లక్షణముతో – విజయనగర (నేటి విజయనగరం) నామముతో వ్యవహరింప తగినదై – ఈ విధమైన ఎనిమిది లక్షణములతో ఎనిమిది నగరముల పేర వ్యవహరించుటకు తగినదై – సర్వోత్కర్షత చేత స్వాతిశయముతో వర్తించు చున్నది.

జగన్మాతా! నీవు సర్వ వ్యాప్తమైననూ, ముఖ్యముగా, విశాల, కళ్యాణి, అయోధ్య, ధార, మధుర, భోగవతి, అవంతి, విజయనగరము అనే పట్టణాలలో వసిస్తూ, భక్తులను కరుణిస్తుంటావు. అమ్మా! బాగా గమనించి నట్లయితే నీ చూపులకు, ఆ నగరములకు సామ్యం కనిపిస్తోంది. విశాలమైనది, శుభదాయిని, ప్రకాశించునది, కలువపూల సౌందర్యము కలది, దయారసాన్ని వర్షించేది, విజయప్రదాయిని ఇదే ఆ సామ్యం తల్లీ!

దేవీ! నీ నేత్రములు విశాలమై 1. విశాల అనే పేరుగల నగరాన్ని, కల్యాణ వంతమై 2. కళ్యాణీనగరాన్ని, స్పష్టమైన కాంతి కలిగి నీలోత్పలములచే ఎదుర్కొనుటకు సాధ్యము కానిదై 3. అయోధ్యానగరాన్ని, కృపారమృత దారలకు ఆధారమై 4. ధారానగరాన్ని, అవ్యక్త మధురమై, ఇలాంటిది అని చెప్పటానికి వీలు కాని 5 మధురానగరాన్ని, పరిపూర్ణత గలదై లోపల వైశాల్యము కలదై (అభోగము గలదై) 6. అభోగవతీనగరాన్ని, భక్తజనావనమై, ఆశ్రితరక్షకమై 7. అవంతీనగరాన్ని, విజయ సంకేతమై 8. విజయనగరాన్ని ఈ రకంగా ఎనిమిది నగరాల పేర్లను వ్యవహరించటానికి వీలవుతున్నది.

50. కవీనాం సందర్భస్తబక మకరందైక రసికం
కటాక్ష వ్యాక్షేప భ్రమర కలభౌ కర్ణయుగళమ్।
అముంచన్తౌ దృష్ట్వా తవ నవరసాస్వాదతరళౌ
వసూయా సంసర్గా దళికనయనం కించి దరుణమ్॥

టీక:- (హే భగవతీ!) కవీనాం = కవుల యొక్క, సందర్భ = రసవత్తర రచనలు అనెడి, స్తబక = పుష్ప గుచ్ఛము నందలి, మకరంద = తేనె యందు (మాత్రమే), ఏకరసికం = ముఖ్యముగా ఇష్టపడు, తవ = నీ యొక్క, కర్ణయుగళం = రెండు చెవులను, కటాక్ష = కడగంటి చూపులను, వ్యాక్షేప = నెపముగా పెట్టుకొని (వర్తిం నీ కనుదోయి అను) భ్రమర కలభౌ = గండు తుమ్మెదలు రెండు – నవరస = శృంగారాది తొమ్మిది రసముల యొక్క, ఆస్వాద = ఆస్వాదమునందు, లేదా – అనుభవించుట యందు, తరళౌ = అత్యంతాసక్తి కలిగినవై – అముంచంతే = ఆ రసాస్వాదన లాంపట్యము చేత, (రసాస్వాదన చేయు) నీ వీనుల జంటను విడువలేక యుండుటను, దృష్ట్వా = చూచి, అళికనయనం = మూడవదైన

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

నీ లలాట నేత్రము, అసూయా సంసర్గాత్ = ఈర్ష్య చెందుట వలన, కించిత్ + అరుణము = కొంచెము ఎఱుపు వన్నెగలదైనది, లేదా - ఎఱ్ఱబడినది.

సుకవీశ్వరుల రసవత్తర రచనలనెడి పుష్పగుచ్ఛముల నుండి జాలువారు తేనెయందు మాత్రమే అత్యంతాసక్తిని చూపు నీ యొక్క చెవుల జతను - కడగంటి చూపులు అను నెపముతో నీ రెండు కన్నులు అను గండు తుమ్మెదలు - శృంగారాది నవరసాస్వాదానానుభూతిని పొందుట యందు అత్యంతాసక్తిని కలిగినవై - ఆ రసాస్వాదన లాంపట్యము చేత నీ వీనుల జంటను విడువలేక యుండగా - పైన ఉన్న లలాట నేత్రము చూచి - మిక్కిలిగా అసూయ చెంది, ఎఱుపు వన్నెకలదైనది (అనగా - 'కోపముతో ఎఱ్ఱబడినది' అని భావము).

అమ్మా! కవి వరేణ్యులందరు, ఎంతో భక్తితో నీ గుణములను కీర్తిస్తుంటే, వాటిని వింటూ, నీ కర్ణములు, తిలకిస్తూ నీ నేత్రములు, మా మీద దయారస వర్షం కురిపిస్తుంటే, ఆ నేత్రాలను దర్శించిన మేమెంత ధన్యులమో కదా! ఎరుపు రంగు కలిగిన నీ ముఖమునకు, నీ నేత్రములు ఎంతో శోభను కలిగిస్తున్నాయి.

అమ్మా! కవీశ్వరుల రసవత్తరమైనరచనలు అనే పుష్పగుచ్ఛాలనుండి జాలువారిన తేనెయందు మాత్రమే ఆసక్తిని చూపే నీ చెవులను, కడగంటి చూపులు అనే నెపంతో నీ రెండు కనులు అనే గండు తుమ్మెదలు, శృంగారానుభూతి పొందుట యందు ఆసక్తిగలవై, నీ వీనులజంటను విడువలేక ఉండగా, పై భాగాన ఉన్న లలాట నేత్రము ఇది చూసి మిక్కిలి అసూయ చెంది ఎర్రబడింది.

51. శివే శృంగారార్ద్రా తదితరజనే కుత్సనపరా,
సరోషా గంగాయాం, గిరిశ చరితే (నయనే) విస్మయవతీ।
హరాహిభ్యో భీతా, సరసిరుహ సౌభాగ్యజయినీ,
సఖీషు స్మేరా, తే మయి జనని దృష్టి స్స కరుణా॥

టీక:- (హే) జనని = ఓ జగజ్జననీ! తే = నీ యొక్క, దృష్టిః = చూపు, శివే = సదాశివుని యందు, శృంగార +ఆర్ద్రా = శృగార రసముచేత తడుపబడినదియు, తత్ + ఇతరజనే = ఆ సదాశివుని కంటె ఇతరులైన జనుల విషయమై, కుత్సనపరా = అయిష్టము వలన జుగుప్సతో బీభత్సరసావేశము గలదియు, గంగాయాం = గంగయందు, సరోషా = రౌద్రరసముతో గూడినదియు, గిరిశచరితే = శివుని చరిత్రను వినుటలో (లేదా - గిరిశనయనే = శివుని ఫాలనేత్ర వైశిష్ట్యమును తిలకించినపుడు). విస్మయవతీ = అద్భుతరసము గలదియు, హర + అహిభ్యః = హరాహిభ్యో = శివుడు ధరించిన సర్పముల వలన, భీతా = భయానక రసావేశము గలదియు, సరసిరుహ = ఎఱ్ఱతామర పద్మముల యొక్క, సౌభాగ్య = వర్ణ వికాస ప్రకాశములను, జయినీ = జయించిన వీరరసముతో గూడినదియు, సఖీషు = ఇష్టసఖురాండ్ర యందు, స్మేరా = చిరుదర హాసముతో హాస్య రసము గలదియు, మయి = నాయందు, కరుణా = అనుగ్రహము వలన కరుణ రసము గలిగినదై ఉండును.

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

తల్లీ! జగజ్జననీ! నీ యొక్క చూపు - నీ పతి యొక్క శివుని యందు శృంగార రసమును, శివేతర జనులయందు అయిష్ట పరాఙ్ముఖత్వములతో బీభత్సరసమును, గంగ యెడల రోషముతో రౌద్రరసమును, శివుని చరిత్రను వినుచున్నపుడు గాని, శివుని మూడవ నేత్ర వైశిష్ట్యమును చూచునపుడు గాని అద్భుతరసమును, శివుడు ధరించెడి సర్పముల యెడ భయానక రసమును, ఎఱ్ఱ తామర పద్మముల వర్ణవికాస ప్రకాశముల యెడ జయించిన భావము పొడ సూపు వీర రసమును, నీ సఖురాండ్ర యెడల హాస్యరసమును, నా యెడల కరుణ రసమును (మామూలుగా నున్నప్పుడు శాంత రసమును) పొందుచు నవరసాత్మకముగా నుండును.

జగన్మాతా! నీ చూపులు పరమశివుని శృంగార రసముతో, ఇతర పురుషులను ఏవగింపుతో, గంగను అసూయతో, శివుడు ప్రదర్శించే లీలలను ఆశ్చర్యంతో, శివునికి సమీపములో ఉన్నపుడు ఆయన ధరించిన నాగుల పట్ల భయరసముతో, స్నేహితురాళ్ళ యందు చిరునవ్వుతో, ఈ విధంగా భిన్నంగా ఉంటాయి. కాని నీ భక్తుడనైన నాయందు నీ చూపు దయారసముతో నిండి ఉండేటట్లు అనుగ్రహించు మాతా!

ఓ తల్లీ! నీ కన్నులయొక్క దృష్టి శృంగార రసముతో శివుని మోహింప చేయు చున్నది. ప్రాకృత జనానికి బీభత్సము కలిగిస్తున్నది. సపత్ని అయిన గంగ యందురోషముతో రౌద్రరసము కలిగి ఉన్నది. శివునియొక్క విజయ గాథలు విని ఆశ్చర్యముతో అద్భుతరసము కలిగి ఉన్నది. శివుని మెడలోని సర్పహారములను చూచి, సర్పములయందు భయం కలిగి, భయానక రసము కలిగి ఉన్నది. ఎఱ్ఱకలువల కాంతి సౌందర్యమును ఉత్పాదించునదై వీరరసము కూడినట్లున్నది. సఖులకు లేత నగవుతోకూడిన హాస్యరసము కలిగి ఉన్నది. నిన్ను స్తుతించు భక్తుడనైన నాయందు కరుణారసము కలిగి ఉన్నది.

52. గతే కర్ణాభ్యర్ణం గరుత ఇవ పక్ష్మాణి దధతీ
పురాం భేత్తు శ్చిత్త ప్రశమరస విద్రావణఫలే।
ఇమే నేత్రే గోత్రాధరపతి కులోత్తంసకలికే
తవా కర్ణాకృష్ట స్మరశరవిలాసం కలయతః॥

టీక:- హే గోత్రాధరపతి కులోత్తంస కలికే! = భూమిని ధరించు పర్వతరాజ వంశమునకు 'సిగను ధరించు' 'పువ్వు మొగ్గ' అయిన ఓ పార్వతీ!, తవ = నీ యొక్క, నేత్రే = కన్నులు, కర్ణ + అభ్యర్ణం = చెవుల సమీపమును, గతే = పొందినవై, పక్ష్మాణి = కనురెప్ప వెంట్రుకలను, గరుతః ఇవ = ఈకలవలె, దధతీ = ధరించుచున్నవై, పురాం = త్రిపురముల యొక్క, భేత్తుః = భేధించిన వాడైన శివుని యొక్క, చిత్తే = మనస్సునందు, ప్రశమరస = శాంతముగా నుండు నిస్పృహను, విద్రాపణ = పారద్రోలుట అను, ఫలే = ప్రయోజనముగా గలవియై, ఆ కర్ణ = చెవుల వరకు, ఆకృష్ట = ఆకర్షింపబడిన, లేదా - లాగబడిన, స్మరశర = మన్మథుని బాణముల యొక్క, విలాసం = సౌభాగ్యమును, లేదా - సౌందర్యమును, కలయితః = చేయుచున్నవి. అనగా - చేయుచున్నట్లు కన్పించు చున్నవి అని, ఇయే = ఈ నా హృదయ కమల మందు భాసించు చున్నది.

భూమిని ధరించు పర్వత రాజైన హిమవంతుని వంశమునకు సిగను ధరించు పుష్ప మొగ్గ అయిన ఓ పార్వతీ! చెవుల వఱకు సాగు నీ కనుఱెప్పల తీరు చూచుచున్నపుడు నా మనస్సునకు ఈ విధముగా కన్పట్టు చున్నది. బాణముల కిరుప్రక్కల కట్టు గ్రద్ద ఈకలవలె నుండు ఱెప్ప వెంట్రుకలతో చెవుల వఱకు సాగు నీ నేత్రములలో – త్రిపుర హరుని మనస్సునకు ప్రాప్తించిన శాంతమైన నిస్పృహను పోగొట్టి, మోహమును కలిగించుటయే ప్రయోజనముగా గలవియై, ఆకర్ణాంతము లాగబడిన – మన్మథుని బాణముల సౌందర్యము గోచరించు చున్నది.

హిమగిరిరాజ తనయా! ఆకర్ణ దీర్ఘములైన నీ నేత్రములు, ఆ నేత్రములకు గల కనుబొమలు, మన్మథుని వింటిని బోలి ఉన్నాయి. ఈశ్వరుని యొక్క హృదయమును చలింప జేయడానికి మన్మథుడు, నీ నేత్రములను, కనుబొమలను ఈ విధంగా ప్రయోగించలేదు కదా!

పర్వతరాజు కులానికి శిగపూవైన ఓ దేవీ! నేను ధ్యానంలో ఉన్నప్పుడు, నిన్ను నా హృదయకమలము నందు చూస్తాను. ఆ సమయంలో నీ కనులు చెవుల వరకు వ్యాపించి, కనురెప్పల వెంట్రుకలు బాణానికి రెండువైపులా కట్టే గ్రద్ద ఈకలులాగా ఉండి, పరమశివుని మనస్సులో నిస్పృహను పోగొట్టి, శృంగార రసాన్ని పెంపొందించటంలో సఫలీకృతము అవుతున్నాయి. ఆ కనులు ఆ కర్ణాంతము లాగబడిన మన్మథుని బాణములలాగా ఉన్నాయి.

53. విభక్త త్రై వర్ణ్యం వ్యతికరితలీలాంజనతయా
విభాతి త్వన్నేత్ర త్రితయ మిద మీశానదయితే।
పున స్స్రష్టుం దేవాన్ ద్రుహిణహరి రుద్రానుపరతాన్
రజ స్సత్వం బిభ్రత్తమ ఇతి గుణానాం త్రయ మివ॥

టీక:- హే! ఈశానదయితే = ఓ మహాదేవుని ప్రియురాలా! ఇదం = ఈ కనబడు, త్వత్‌నేత్రత్రితయం = నీ యొక్క మూడు కన్నులు, వ్యతికరిత = అర్ధవలయా కారముగా తీర్చినదై, లీలా = లీలార్థమై ధరించిన, అంజనతయా = కాటుక గలిగినదగుట చేత, విభక్త = ఒక దానితో ఒకటి కలసికొనకుండ వేఱుపరచిన, త్రైవర్ణ్యం = తెలుపు, నలుపు, ఎఱుపు అను మూడు వన్నెలు గలదై, ఉపరతాన్ = లీనమైనవారగు, ద్రుహిణహరి రుద్రాన్ = బ్రహ్మ, విష్ణు, రుద్రుల ముగ్గురుని, దేవాన్ = త్రిమూర్తిత్రయమును, పునః = మరల, స్రష్టుం = జగత్ సృష్టి కొఱకు, రజః = రజోగుణమును, సత్త్వం = సత్త్వ గుణమును, తమః = తమో గుణమును, ఇతి = అను, గుణానాం = సత్త్వ రజ స్తమస్సులను పేరుగల గుణముల యొక్క, త్రయం ఇవ = మూడింటి వలె, బిభ్రత్ = ధరించు చున్నట్లు ప్రకాశించు చున్నది.

ఓ సదాశివుని ప్రియురాలా! నీ మూడు కన్నులు అర్థ వలయా కారముగా తీర్చినదై; లీలా విలాసార్థము ధరించిన కాటుక కలిగినదగుట చేత ఒక దానితో ఒకటి కలసికొనని తెలుపు, నలుపు, ఎఱుపు, అను మూడు రంగులు కలదై; గత ప్రళయము నందు తన యందు లీనమైన బ్రహ్మ, విష్ణు, రుద్రులు అను త్రిమూర్తులను మరల మరల విశ్వ సృష్టికొఱకు

Kiron Type Institute
Kiron Type Institute

– సత్త్వము, రజస్సు, తమస్సు అను మూడు గుణములను ధరించు దాని వలె ప్రకాశించుచున్నది.

అమ్మా! నీ కనులకు పెట్టుకున్న కాటుక వలన నీ నయనములు నలుపు, తెలుపు, ఎరుపు రంగులతో కనిపిస్తున్నాయి. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, రుద్రాదులను నీవు సృష్టించినపుడు, నీవు వారికి ఆపాదించిన – సత్వ, రజ, తమో – గుణములు, త్రిగుణములుగా నీ కళ్ళలో ప్రతిబింబిస్తున్నాయేమో!

ఓ దేవీ! నీ ముఖమునందు ఉన్న మూడు కనులు తెలుపు, నలుపు, ఎరుపు రంగులు కలిగి, గతంలో ప్రళయం సంభవించినప్పుడు నీయందు లీనమైన బ్రహ్మ విష్ణు రుద్రులను, మళ్ళీ ఈ జగత్తును సృష్టించటానికి గాను సత్త్వరజస్తమో గుణాలను ధరించినట్లు ప్రకాశిస్తున్నది.

54. పవిత్రీ కర్తుం నః పశుపతి పరాధీన హృదయే
దయా మిత్రై ర్నేత్రై రరుణ ధవళ శ్యామరుచిభిః।
నద శ్శోణో గంగా తపన తనయేతి ధ్రువ మయం
త్రయాణాం తీర్థానా ముపనయసి సంభేద మనఘమ్॥

టీక:- (హే) పశుపతి పరాధీన హృదయే! = శివునికి అధీనమైన చిత్తము గల ఓ దేవీ! దయామిత్రైః = దయకు స్నేహితమైన, లేదా – దయచేత తడిసి మృదులమైన, అరుణ ధవళ శ్యామరుచిభిః = ఎఱుపు, తెలుపు, నలుపు అను కాంతి గలవియై, నేత్రైః = నేత్రముల చేత, శోణః నదః = శోణయను పేరు గల నదము, గంగా = గంగానది, తపనతనయా = సూర్యుని కూతురైన యమున, లేదా – కాళిందీనది, ఇతి = అను, త్రయాణాం = మూడుగా నున్న, తీర్థానాం = పుణ్య తీర్థముల యొక్క, అనఘం = పాపములను పోగొట్టు జలము కలదైన, అయం = ఈ, సంభేదం = నదీ సంగమ స్థానమును, నః = మమ్ములను, పవిత్రీకర్తుం = పవిత్రవంతముగా చేయుటకు, ఉపనయసి = దగ్గరకు చేర్చుచున్నావు.

శివాధీనమైన చిత్తము గల ఓ పార్వతీ! కరుణరసార్ద్రత వలన మృదుత్వమును, ఎఱుపు, తెలుపు, నలుపు అను మూడు వన్నెల వికాసమునుగల నీ నేత్ర త్రయము చేత ఎఱుపు రంగు నీటితో ప్రవహించు శోణయను నదము (శోణ పశ్చిమ దిశగా పయనించును గాబట్టి దీనిని 'నదము' అనవలెను). తెల్లని నీటితో ప్రవహించు గంగానది, నల్లని నీటితో ప్రవహించు సూర్య పుత్రిక అయిన యమునా నది – ఈ మూడు పుణ్య తీర్థములతో పాపములను పోగొట్టి అపవిత్రులను పావనలుగా చేయుటకు – వాటిని త్రివేణీ సంగమ స్థానముగా ఒక చోటకు చేర్చు చున్నావు.

మాతా! గంగా, యమునా, శోణా నదుల యొక్క నీరు తెలుపు, నలుపు, ఎరుపు రంగులు కలిగి ఉంటాయి. ఆ నదులలో స్నానము సకల పాపాలను హరిస్తుంది. ఆ మూడు వర్ణములు కలిగిన నీ నేత్రముల దయారస ధార మాపై ప్రసరింపచేసి, త్రివేణీ సంగమ స్నాన ఫలితాన్ని మాకు ప్రసాదించు తల్లీ.

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

అజ్ఞానులైన ప్రాణులను కాపాడే పశుపతి యందు మనసు లగ్నంచేసిన ఓ దేవీ దయారసముచే తడుపబడినవై, ఎర్రని, తెల్లని, నల్లని కాంతులుగల నీ మూడు కనులచేత హిరణ్యవర్ణము గల (ఎరుపు) శోణభద్రానదీజలాలు, తెల్లని జల ప్రవాహం గల గంగానది, నీలిరంగు జలప్రవాహం గల యమునా నదులకు సంగమ స్థానమై, పాపులమైన మమ్ములను పవిత్రులుగా జేస్తున్నాయి.

55. నిమేషోన్మేషాభ్యాం ప్రళయ ముదయం యాతి జగతీ
తవే త్యాహు స్సన్తో ధరణి ధరరాజన్య తనయే।
తదున్మేషా జ్ఞాతం జగదిద మశేషం ప్రళయతః
పరిత్రాతుం శంకే పరిహృతనిమేషా స్తవ దృశః॥

టీక:- ధరణి ధర రాజన్యతనయే! = ఓ పర్వతరాజపుత్రీ! ఓ పార్వతీ! తవ = నీ యొక్క, నిమేష + ఉన్మేషాభ్యాం = కనుఱెప్పలు మూసుకొనుట చేతను, తెఱచుకొనుట చేతను, జగతీ = జగత్తు, ప్రళయం = ప్రళయమును, ఉదయం = ఉద్భవమును, యాతి = పొందును, అని ఈ ప్రకారము, సంతః = సత్పురుషులు, ఆహుః = చెప్పుదురు, అతః = ఇందువలన, త్వత్ = ఆ, ఉన్మేషాత్ = నీ కంటి ఱెప్పలు తెరుచుట వలన, జాతం = ఉద్భవించిన, అశేషం = సమస్తమైన, ఇదంజగత్ = ఈ జగత్తును, ప్రళయతః = ప్రళయము నుండి, పరిత్రాతుం = రక్షించుట కొఱకు, తవ = నీ యొక్క, దృశః = కన్నులు, పరిహృతనిమేషాః = తిరస్కరించిన ఱెప్పపాటులు గలవి, ఇతి = అని, శంకే = శంకింతును, లేదా - తలంచుదును.

పర్వతరాజపుత్రికా, ఓ పార్వతీ! నీ కనుఱెప్పలు మూసుకొనుట చేత జగత్తుకు ప్రళయమును, ఱెప్పలు తెఱచుకొనుట చేత జగత్తుకు సృష్టియు ఉద్భవించునని (వ్యాస మహర్షి వంటి) సత్పురుషులు చెప్పుదురు. అందువలన నీ కనుఱెప్పలు తెఱచుట వలన ఉద్భవించిన యావజ్జగత్తును ప్రళయము నుండి రక్షించుట కొఱకు - నీ కన్నులు ఈ ఱెప్ప పాటులను తిరస్కరించుట వలన - నీ కన్నులు ఱెప్పపాటు లేక ఎప్పుడునూ తెఱచుకుని ఉన్న స్థితిలోనే వున్నవని తలంచు చున్నాను.

అమ్మా! నీవు "ఉన్మేషనిమిషోత్పన్నవిపన్నభువనావళి" గా కీర్తింపబడ్డావు. నీవు కనులు మూస్తే ఈ ప్రపంచము లయమవుతుంది. నీవు కనులు తెరిస్తే సృష్టి ప్రారంభమవుతుంది. అందువలననే నీవు కనురెప్ప వెయ్యటానికి జంకి రెప్పలు వేయకుండా ఉండిపోయావు.

ఓ తల్లీ! నువ్వు కళ్ళుమూస్తే ప్రళయము, కళ్ళుతెరిస్తే సృష్టి. ఈ రకంగా జగదుత్పత్తి, వినాశనము జరుగుతుంటాయి అని వ్యాసాది మహర్షులు చెబుతున్నారు. కాబట్టి నీవు కనురెప్పలు మూయకుండా ఈ జగత్తుకు ప్రళయం సంభవించకుండా కాపాడుతున్నావని భావిస్తున్నాను.

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

56. తవాపర్ణే కర్ణే జపనయన పైశున్య చకితాః
నిలీయంతే తోయే నియత మనిమేషా శ్శఫరికాః।
ఇయంచ శ్రీ ర్బద్ధచ్ఛదపుట కవాటం కువలయం
జహాతి ప్రత్యూషే నిశిచ విఘటయ్య ప్రవిశతి॥

టీక:- (హే) అపర్ణే = ఓ పార్వతీ! తవ = నీ యొక్క, కర్ణేజప = చెవుల సామీప్యమును నిరంతరము పొందుచున్న, నయన = కన్నులచేత అయిన, పైశున్య = రహస్యమును వెల్లడి చేయుటవలన, చకితాః = భయపడినదై, శఫరికాః = ఆడుచేపలు, అనిమేషా = ఱెప్పపాటు లేనివియై, తోయే = నీటియందు, నిలీయంతే = దాగుకొనుచున్నవి. నియతం = ఇది నిశ్చయము, మరియును - ఇయం = ఈ, శ్రీః చ = నీ నేత్రములను పొందిన లక్ష్మియు, బద్ధ = మూయబడిన, ఛదపుట = రేకు దొప్పలను, కవాటం = తలుపుగలదైన, కువలయం = కలువను, ప్రత్యూషే = ఉషః కాలమందు, జహాతి = త్యజించుచున్నది, నిశిచ = రాత్రియందు, తత్ విఘటయ్య = ఆ కలువను తెఱచుకొని, ప్రవిశతి = లోపల ప్రవేశించుచున్నది.

ఓ తల్లీ అపర్ణాదేవీ! తాము చూసిన ఏదో రహస్యమును చెప్పుటకై ఎప్పుడును నీ చెవుల వద్దనే వసించు అందమైన నీ రెండు కన్నుల తీరును చూచి భయపడిన ఆడు చేపలు కంటికి ఱెప్పపాటు లేక నీటిలో దాగుకొనుచున్నవి. మరియు, నీ నేత్ర సౌభాగ్య సౌందర్య లక్ష్మిని చూచిన నల్ల కలువలు పగలు బిడియముతో తమ అందమును రేకులలో ముకుళింప చేసుకుని దాచుచు, నీవు నిద్రపోవు రాత్రివరకు అట్లే వేచియుండి, అటుపైన మాత్రమే తన రేకుల తలుపులను తెఱచి తన అందమును బయట పెట్టుటకు సాహసించుచున్నవి.

జననీ! చేపల కన్నులకు రెప్పలు ఉండవు, నీవు కనురెప్పలు ఉన్నా, రెప్పలు మూయని దానివి. కలువ పూలు పగలు ముడుచుకుని రాత్రి వికసిస్తాయి. నయనముల యొక్క శోభ అనేది పగటి సమయములో దేవి నేత్రములలోనూ, రాత్రిపూట కలువ పూలయందు శోభిస్తున్నదేమో అనిపిస్తోంది.

ఓ అపర్ణా! నీ చెవులవద్దకు పోయిన నీ కనులు, ఆ చెవులకు తమ రహస్యం చెబుతాయేమోనని భయపడినవై, ఆడబేడిస చేపలు, రెప్పపాటు లేకుండా నీటియందు దాగి ఉన్నాయి. నీ నేత్రాలను పొందిన సౌభాగ్యలక్ష్మి రాత్రి సమయంలో కలువల యందు దాగి, ఉదయాన ఆ కలువలను దళాలతో మూసివచ్చి పగలంతా నీ నేత్రాలలో ఉండి, మళ్ళీ రాత్రికి కలువలయందు చేరుతున్నది.

57. దృశా ద్రాఘీ యస్యా దరదళితనీలోత్పల రుచా
దవీయాంసం దీనం స్నపయ కృపయా మా మపి శివే!
అనే నాయం ధన్యో భవతి నచతే హాని రియతా
వనేవా హర్మ్యేవా సమకరనిపాతో హిమకరః॥

Kiron Type Institute
Kiron Type Institute

టీక:- (హే) శివే! = ఓ పార్వతీ! ద్రాఘీయస్యా = మిక్కిలి పొడవుగాను, విశాలముగాను ఉన్నదియు, దరదళిత = కొంచెముగా వికసించిన, నీలోత్పలరుచా = నల్లకలువల వంటి కాంతి కలదియునగు, దృశా = కడగంటి చూపుచే, దవీయాంసం = చాలా దూరముననున్న, దీనం = దీనావస్థలో నున్న, మాం = నన్ను, అపి = సైతము, కృపయా = దయతో, స్నపయ = తడుపుము, అనేన = ఈ మాత్రము సహాయము చేత, అయం = ఈ జడుడు (అనగా – నేను), ధన్యః = కృతార్థుడను, భవతి = అగుచున్నాడు. ఇయత = ఇంత మాత్రము చేత, తే = నీకు, హానిః = వచ్చిన నష్టము, ద్రవ్య నాశము, నచ = లేనే లేదు, (తథాహి = అదియుక్తము), హిమకరః = చంద్రుడు, వనేవా = అరణ్యము నందైనను, హర్మ్యేవా = సౌధములందైనను, సమకర నిపాతః హిమకరః = సమానమగునట్టి కిరణములను ప్రసరించుచున్నాడు గదా!

తల్లీ! పార్వతీ! బాగుగా పొడవుగా సాగినట్లును, విశాలముగాను, కొంచెముగా వికసించిన నల్లకలువ కాంతివంటి కాంతికలదియు అయిన నీ కడగంటి చూపుచే – చాలా దూరములో, దీనావస్థలో నున్నప్పటి నన్ను సైతము తడుపుము. ఈ మాత్రము సహాయముచేత ఈ దీనుడు ధన్యుడగును. నీకును వచ్చిన నష్టము గాని, ద్రవ్యనాశము గాని లేదు. ఇది (ఇట్లు నేను నిన్ను కొరుట – నీవు ఆ విధముగా చేయుట) విపరీతమేమీ కాదు, యుక్తమే! ఎందువలన అనగా (నీ ఎడమ కన్నైన) చంద్రుడు అరణ్యములలోను, సౌధముల పైనను గూడా సమానముగానే తన కిరణములను ప్రసరింప చేయుచున్నాడు గదా!

అమ్మా, నల్ల కలువలు ఎంతో శీతలత్వాన్ని కలిగి ఉంటాయి. దీనుడనని నన్ను భావించకుండా, నల్ల కలువలవంటి శీతలత్వము కలిగిన నీ నేత్రములతో నన్ను చల్లగా చూడు తల్లీ. చంద్రకాంతి అరణ్యాలలోను, రాజప్రాసాదముల యందు, ఒకే విధముగా ప్రసరిస్తుంది కదా. అదేవిధంగా, భక్తిలో మునిగి నేను ఎంత దూరంలో ఉన్నా, నీ చూపులకు ఆ దూరం అడ్డం కాదు కదా తల్లీ!

పర్వతరాజకుమార్తె అయిన ఓ పార్వతీ! అతిపొడవై, నీలోత్పలముల యొక్క కాంతి కలిగి, నీకడగంటి చూపులోని కృపారసము దరిద్రుడనైన నామీద ఒకసారి ప్రసరింపచెయ్యితల్లీ! అంతమాత్రంచేతనే నేను ధన్యుడ నవుతాను. ఈ రకంగా నన్ను కనికరించటంవల్ల నీకు ఏ విధమైన ధనహాని ఉండదమ్మా! చల్లదనాన్నిచ్చే చంద్రుడు రాజభవనంమీదగాని, నట్టడవిలోగాని ఒకేరకంగా తనకిరణాలను ప్రసరింపచేస్తాడు.

58. అరాళం తే పాళీయుగళ మగరాజన్యతన యే
నకేషా మాధత్తే కుసుమశర కోదండ కుతుకమ్।
తిరశ్చీనో యత్ర శ్రవణపథ ముల్లంఘ్య విలసన్
అపాంగ వ్యాసంగో దిశతి శరసంధాన ధిషణామ్॥

టీక:- అగరాజన్యతనయే! = ఓ పర్వతరాజపుత్రీ! పార్వతీ! అరాళ = వంకరగానున్న, తే = నీయొక్క, పాళీయుగళం = కణతల జంట (కళ్ళకు చెవులకు మధ్య నుండు ప్రదేశము),

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute

కుసుమశరకోదండకుతుకమ్ = పువ్వులను బాణములుగా గల మన్మథుని వింటి యొక్క సౌభాగ్యముగా, కేషాం = ఎవరికి, నఆధత్తే = (సందేహము) కలిగించదు? యత్ = ఏ కారణము వలన, యత్ర = ఏ కణతల జంట యందు, తిరశ్చీనః = అడ్డముగా ప్రసరించుచు, విలసన్ = ప్రకాశించు చున్నదై, అపాంగ వ్యాసంగః = కడగంటి యొక్క వ్యాపన విలాసము, శ్రవణపథం = చెవి సామీప్యమును, ఉల్లంఘ్య = దాటుచు, శరసంధానధిషణాం = 'అమ్ము' ను గూర్చు బుద్ధిని, అనగా - భ్రాంతిని, దిశతి = ఇచ్చుచున్నదో.

ఓ పర్వతరాజపుత్రీ! పార్వతీ! అందమైన వంపులతో సొంపుగానున్న నీ కణతల జంట ప్రదేశమును చూచుట తోడనే అది - పుష్పబాణమును ఎక్కు పెట్టిన మన్మథుని వింటి సొగసు అయి ఉండునేమో అని" - అనిపించకుండా నుండునా! (అనగా - అనిపించునని భావము) కారణమేమనగా - వంగినవిల్లు వలె నుండి, వంపుసొంపుల కణతల గుండా నీ కృపా వీక్షణ విలాస ప్రకాశము, బాణము వలె నీ చెవులను చేరుటయే గాక, వాటిని దాటుచూ గూడ నున్నది గదా!

పర్వత రాజపుత్రీ, నీ నేత్రములకు, కర్ణములకు మధ్యగల కనుబొమలు, మన్మథుని వింటిని బోలి ఉన్నాయి. నీ క్రీగంటి చూపులు మన్మథుని వింటినుండి వదిలిన బాణముల వలె నీ కనుల నుండి వచ్చినాయా అన్న భావం కలుగుతోంది.

ఓ పార్వతీ! వంకరగాఉన్న నీ కణతలజంట చూచినవారికి మన్మథ తాపాన్ని కలిగిస్తుంది. మన్మథుడి కోదండ సౌభాగ్యముగా ఉంటుంది. ఎందుకనగా అది పూలబాణము ఎక్కుపెట్టిన మన్మథుని వింటిసొగసేమో అనిపిస్తుంది. దీనికి కారణ మేమనగా వంగిన విల్లులాగా ఉండి, వంపుసొంపుల కణతలగుండా నీ కృపావీక్షణ విలాస ప్రకాశము బాణమువలె నీ చెవులను చేరుటయేగాక వాటిని దాటుతున్నది.

59. స్ఫుర ద్గండాభోగ ప్రతిఫలిత తాటంకయుగళం
చతుశ్చక్రం మన్యే తవ ముఖమిదం మన్మథరథమ్।
య మారుహ్య ద్రుహ్య త్యవనిరథ మర్కేందు చరణం
మహావీరో మారః ప్రమథపతయే సజ్జితవతే॥

టీక:- (హే భగవతీ) తవ = నీ యొక్క, ఇదం = ఈ, ముఖం = (నాకు ఊహాలో గోచరించు) నీ ముఖము, స్ఫురత్ = స్వచ్ఛమైన ప్రకాశ లక్షణముతో అద్దమువలె మెఱయుచున్న, గండ = చెక్కిళ్ళ యొక్క, ఆ భోగ = విశదమైన తలము నందు, ప్రతిఫలిత = ప్రతిబింబించిన, తాటంక యుగళం = చెవి కమ్మల జతగలదై, చతుశ్చక్రం = నాలుగు చక్రములు గల, మన్మథ రథం = మన్మథుని రథముగా, మన్యే = ఊహించు చున్నాను. యం = ఏ నీ ముఖము అను అట్టి రథమును, ఆరుహ్య = ఎక్కి, మహావీరం = గొప్పవీరుడైన, మారః = మన్మథుడు, అర్కేందు చరణం = సూర్య చంద్రులను చక్రములుగా గలిగిన, అవని రథం = భూమి అను రథమును, సజ్జితవతే = యుద్ధమునకై సిద్ధపరచబడిన ఆ రథమును ఎక్కియున్న,

ప్రమథపతయే = ప్రమథ గణములకు ప్రభువైన, త్రిపురహరుడైన శివుని కొఱకు, ద్రుహ్యతి = ద్రోహము చేయుచున్నాడు - అనగా ఎదుర్కొను చున్నాడు.

తల్లీ! జగజ్జననీ! స్వచ్ఛమైన ప్రకాశ లక్షణముతో అద్దమువలె మెఱయుచున్న నీ చెక్కిళ్ళు, లేదా - కపోలముల తలములపై నీ చెవుల తాటంకముల జత యొక్క ప్రతిఫలించిన చక్రబింబములు కలిగి నీ ముఖము - నాలుగు చక్రముల రథము వలె తోచుచున్నది. ఇట్టి నీ ముఖరథమును ఎక్కి మన్మథుడు మహావీరుని వలె - భూమిని రథముగాను, సూర్యచంద్రులను దాని చక్రములు గాను - ఏర్పాటు చేసుకుని యుద్ధ సన్నద్ధుడై దాని నెక్కి వచ్చిన ప్రమథగణ ప్రభువు, త్రిపురహరుడు అయిన - శివుని - ఎదుర్కొన గలుగుచున్నాడు.

అమ్మా, అటూ ఇటూ ఊగుతున్న నీ కర్ణాభరణముల ప్రకాశము నీ చెక్కిళ్లపై పడి అద్దములోని ప్రతిబింబము వలె ప్రతిఫలిస్తోంది. దీనినే రథముగా చేసుకుని మన్మధుడు ఈశ్వరుని మోహింపచేసి ఆయనపై యుద్ధాన్ని ప్రకటించాడు. అయితే భూమినే రథముగా చేసుకున్న ఈశ్వరుడు ఈ మాయకు లొంగుతాడా!

తల్లీ! అద్దాలలాగా మిలమిలామెరుస్తున్న నీ చెక్కిళ్ళయందు ప్రతిబింబిస్తున్న నీ చెవులకమ్మల జంట గలిగిన నీ ముఖము మన్మథుడధిరోహించిన నాలుగు చక్రాలుగల రథంలాగా కనిపిస్తున్నది. ఈ రథాన్ని అధిరోహించి మన్మథుడు, భూమిని రథంగా, రవిచంద్రులను చక్రాలుగా చేసుకుని త్రిపురాసురులతో యుద్ధం చేసిన త్రిపురాంతకునితో యుద్ధానికి సిద్ధమవుతున్నాడు.

60. సరస్వత్యాః సూక్తీ రమృతలహరీ కౌశలహరీః
పిబంత్యా శ్శర్వాణీ శ్రవణచులుకాభ్యా మవిరళమ్।
చమత్కార శ్లాఘా చలితశిరసః కుండలగణో
ఝణత్కారై స్తారైః ప్రతివచన మాచష్ట ఇవ తే॥

టీక:- (హే) శర్వాణీ! ఓ ఈశ్వరపత్నీ, పార్వతీ!, సరస్వత్యాః = సరస్వతీ దేవి యొక్క, సూక్తీరమృతలహరీ = మధురగానామృత ప్రవాహపు పొంగు యొక్క, కౌశలహరీః = సౌభాగ్యమును, అవిరళమ్ = ఎడతెగని విధముగా, శ్రవణచులుకాభ్యాం = చెవులు అను పురిసిళ్ళ చేత, లేదా - దోసిళ్ళచేత, పిబంత్యాః = గ్రోలుచుండుట యొక్క, చమత్కారశ్లాఘా = ఆశ్చర్యమును, ఆనందమును శ్లాఘించుటలో యందు, చలితశిరసః = కంపించు (ఆడించు) శిరస్సుగల, తే = నీ యొక్క, కుండలగణః = కర్ణాభరణములు అన్నియు, తారైః = ఎక్కువైన, ఝణత్కారైః = ఝణఝణ ధ్వనులచేత, ప్రతివచన = ఆమోదపు బదులు మాటను, ఆచష్టఇవ = వచించునదివలె నున్నది.

తల్లీ శర్వాణీ! సరస్వతీ దేవి చేయు మధురగానామృత ప్రవాహపు పొంగును ఎడతెగని విధముగా - చెవులు అను పురిసిళ్ళ (దోసిళ్ళ) చేత గ్రోలుటలో పొందు ఆశ్చర్య ఆనందములను శ్లాఘించుటకు శిరస్సును చలింపచేయగా, నీ కర్ణాభరణములన్నియు ఒక్కసారిగా ఎక్కువ

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

స్థాయిలో ఝుణ ఝుణత్కార ధ్వనుల చేత ఆమోదపు మాటలను, అనగా – 'బాగున్నది బాగున్నది' అనిచెప్పెడు బదులు మాటలను వచించు చున్నట్లున్నది.

జగన్మాతా! సకల జీవులు, తమ భక్తి, అమృతము నిండిన కీర్తనలతో నిన్ను కీర్తిస్తుంటే, నీవు ఎంతో ఆనందముతో తలను ఊపుతుంటే, నీ చెవి కమ్మలు కదులుతున్నాయి. అలా కదిలేటపుడు అవి చేసే కింకిణీ శబ్దములు భక్తులకు అభయమిస్తున్నాయి. సరస్వతీ దేవి సూక్తులకు కూడా ఆ శబ్దాలే సమాధాన మిస్తున్నాయి.

ఓ శర్వాణీ! అమృత ప్రవాహపు పొంగులాగా, మృదుమధురంగా తేనెలొలుకు పలుకులతో సరస్వతీదేవిచేసే స్తోత్రాలను నువ్వు వింటున్నావు. ఆ స్తోత్రములు బాగున్నాయని శ్లాఘించటంకోసం నీ శిరస్సును కదపగా, నీ కర్ణాభరణాలు ఒక్కసారిగి ఝుణఝుణత్కారాలు చేశాయి. ఆ శబ్దము నువ్వుచెప్పబోయే మాటలను బలపరుస్తున్నట్లుగా ఉన్నది.

61. అసౌ నాసావంశ స్తుహినగిరివంశధ్వజపటి(టే)
త్వదీయో నేదీయః ఫలతు ఫలమస్మాక ముచితమ్।
వహత్యం తర్ముక్తా శ్శిశిరకర నిశ్వాస గళితం
సమృద్ధ్యా యు త్తాసాం బహిరపి స ముక్తామణిధరః॥

టీక:- (హే) తుహినగిరివంశ ధ్వజ పటి = మంచుకొండ వంశము అను ధ్వజమునకు పతాకమైన ఓ హైమవతీ!, త్వదాయః = నీ సంబంధమైన, అసౌ = ఈ, నాసావంశ = నాసిక అను వంశదండము, లేదా – వెదురు కఱ్ఱ, అస్మాకం = మాకు, ఉచితం = తగిన విధముగా, నేదీయః = బాగుగా, ఫలం = కోరినదానిని, ఫలతు = ప్రాప్తింప చేయు గాక! సః = ఆ, నాసావంశ దండము, లేదా – ముక్కు దూలము, అంతః = లోపల, ముక్తాః = ముత్యములను (ముక్తి ఫలమును) వహంతి = ధరించుచున్నది. యత్ = ఏకారణము వలన, తాసాం = ఆ ముత్యముల యొక్క, సమృద్ధ్య = నిండుదనము చేత, లేదా – పెరుగుదల చేత, శిశిరకర = చంద్ర సంబంధమైన, నిశ్వాస = వామనాడి యగు ఇడానాడీ మార్గవాయువుచే అనగా – ఎడమ ముక్కు నుండి వచ్చు నిశ్వాసముచే, గళితం = వెడలిన దానిని, బహిఃఅపిచ = నాసికకు బయట గూడా, ముక్తామణిధరః = ముత్యమును ధరించునది అయ్యెను (తుహినగిరి వంశధ్వజపటే – అని కూడా ఈ శ్లోక ప్రథమ పాదమునకు పాఠాంతరము గలదు).

హిమగిరి వంశధ్వజమునకు పతాకము వంటి ఓ హైమవతీ! నీ నాసిక అను వెదురు దండము మాకు తగిన విధముగా కోరిన వాటిని ప్రాప్తింప చేయుగాక! ఆ నీ నాసావంశదండము లోపల ముత్యములను ధరించు చున్నదని చెప్పవచ్చును. కారణమేమనగా – నీ నాసాదండము ముత్యములతో సమృద్ధిగా నిండి వుండగా చంద్ర సంబంధమైన వామ నిశ్వాస మార్గము ద్వారా ముత్యము బయటకు వెడలి నీ నాసికకు క్రింద కొన యందు ముత్యముతో కూడిన ఆభరణమగుచున్నది గదా!

అమ్మయొక్క నాసికాదండము అప్పుడే వికసించిన చంపక పుష్పంలాగా ఉంటుంది. ఇడా మార్గమైన ఎడమ ముక్కులో ఏర్పడిన వాయువు వలన జాలువారిన అమృత బిందువుల వలన ఏర్పడిన మంచి ముత్యాలతో, నక్షత్ర కాంతిని తిరస్కరించే నాసాభరణముతో శోభించే హిమగిరి తనయ, మా వంశమందు ముక్తపురుషులు జన్మించునట్లు అనుగ్రహించుగాక.

ఓ పార్వతీ! నీనాసాదండము మాకు, మాకుసంబంధించినవారికీ కోరిన కోరికలు తీర్చునుగాక. నాసాదండములోపల ముత్యాలుగల ఆభరణాలను ధరించింది. ఆ కారణంగా ఎడమ ముక్కు నుండి బయటకు వచ్చే గాలివల్ల, బయటి ప్రదేశంకూడా ముత్యాలను ధరించినట్లయింది.

62. ప్రకృత్యాஉஉరక్తయా స్తవ సుదతి దంతచ్ఛదరుచేః
ప్రవక్ష్యే సాదృశ్యం జనయతు ఫలం విద్రుమలతా।
న బింబం త్వద్బింబ ప్రతిఫలనరాగా దరుణితం
తులా మధ్యారోఢుం కథమివ న లజ్జేత కలయా॥

టీక:- (హే) సుదతి = మంచి పలువరసగల దేవీ!, ప్రకృత్యా = స్వభావ సిద్ధముగనే, ఆరక్తాయాః = అంతట కెంపువన్నెగలదైన, తవ = నీ యొక్క, దంతచ్ఛదరుచేః = రెండు పెదవుల యొక్క సౌందర్య సౌభాగ్యమునకు, సాదృశ్యం = సరియైన పోలికను, ప్రవక్ష్యే = చక్కగా చెప్పుచున్నాను, విద్రుమలతా = పగడపు తీగ, ఫలం = పండిన పండును, జనయతు = పుట్టించినదైనచో (అది పోలికకు సరిపోవును), బింబం = దొండ పండుతో పోల్చవలసి వచ్చినచో, తత్‌బింబ = ఆ నీ రెండు పెదవుల యొక్క బింబములను తనపై ప్రతి ఫలించుట చేత అయిన, రాగాత్ = ఎఱుపురంగువలన, అరుణితం = ఎఱుపు వన్నె పొందినదై, కలయా - అపి = ఒక పదునాఱవ పాలుచే, లేదా - లేశ మాత్రము చేతను గూడా, తులాం = సామ్యమును, అధ్యారోఢుం = అధిష్ఠించుటకు, లేదా - పొందుటకు, కథం ఇవ = ఏల, నలజ్జేత = సిగ్గుపడకుండును?

సుందరమైన దంత పంక్తిగల దేవీ! సహజముగనే పూర్తిగా కెంపురంగులో నుండు నీ రెండు పెదవులకు చక్కని సామ్యమును, లేదా - పోలికను చెప్పెదను. పగడపు తీగ - పండును పండించగలిగినచో - అది నీ పెదవులను పోల్చుటకు సరిపోవచ్చును. దొండపండువలె నున్నవని చెప్పవచ్చును. గాని, అవి నీ సాన్నిధ్యములో నీ పెదవుల ఎఱుపురంగు వాటిపై ప్రతిఫలించగా అవి ఎఱుపు దనమును పొందినవని వాటి 'బింబము' అన్న పేరే చెప్పుచున్నది. మరి, నీ ఎఱ్ఱని పెదవులతో - కనీసము పదునాఱవ వంతు సామ్యమును కలిగినవని చెప్పుకొనుటకైనను అవి సిగ్గుపడకుందునా?

జగన్మాతా! కవులు స్త్రీలయొక్క పెదవులను ఎర్రటి పగడముతో లే దొండపండుతో పోలుస్తారు. కానీ ఈ రెండు పోలికలు నీ పట్ల నిజం కాదు. స్వస్వభావముచే పగడములు ఎర్రనైనవి కావు. అదే విధముగా, దొండ కాయ మొదట ఆకుపచ్చగా ఉండి తరువాత

పండుగా ఎర్రగా మారుతుంది. కానీ నీ పెదవులు స్వభావరీత్యా ఎర్రటి ఎరుపు రంగు కలవి. వాటికి నీ పెదవులకు సామ్య మెక్కడిదమ్మా.

చక్కని పలువరుసగల ఓ తల్లీ! కెంపులవలె ఎర్రగాఉన్న నీపెదవులకు పోలిక చెప్పటానికి సాటియైనది ఈ జగత్తులో ఏదీలేదు. నీ క్రిందిపెదవిని ప్రవాళఫలము (పగడపుపండు)తో పోల్చవచ్చును కాని పగడపుపండ్లు ఎక్కడా లేవు. దొండపండుతో పోల్చుదామంటే దానికి నీ పెదవులకాంతి సరికాదు. బింబము అంటే దొండపండు నీ అధరాలకు ప్రతిబింబము. కాబట్టి నీ పెదవులను పోల్చటానికి ఉపమానములేదు. వాటికి అవే సాటి.

63. స్మితజ్యోత్స్నా జాలం తవ వదనచంద్రస్య పిబతాం
చకోరాణామాసీ దతిరసతయా చంచుజడిమా।
అతస్తే శీతాంశో రమృతలహరీ మామ్లరుచయః
పిబంతి స్వచ్ఛందం నిశి నిశి భృశం కాంచిక ధియా॥

టీక:- (హే పార్వతీ!) తవ = నీ యొక్క, వదనచంద్రస్య = ముఖము అను చంద్రుని యొక్క, స్మితజ్యోత్స్నాజాలం = చిరునవ్వు అను వెన్నెల నంతను, పిబతాం = త్రాగుచున్న, చకోరాణాం = చకోరపక్షులకు, అతిరసతయా = మిక్కిలి తీపి దనము చేత, చంచుజడియా = నాలుకలకు రుచి తప్పి మొద్దుబాఱుట, ఆసీత్ = కలిగెను. అతః = ఇందువలన, తే = ఆ చకోర పక్షులు, అమ్లరుచయః = పుల్లగా నుండు వాటి యందు ఆసక్తి కలిగినవై, శీతాంశోః = చంద్రుని యొక్క, అమృతలహరీః = సుధాప్రవాహములను, లేదా - వెన్నెల అను అమృతమును, కాంచికధియా = అన్నపు గంజి, లేదా - బియ్యపు కడుగు నీరు అను భ్రాంతితో, స్వచ్ఛందం = ఇష్టము వచ్చినట్లుగా, నిశినిశి = ప్రతి రాత్రి యందు, భృశం = మిక్కిలి, పిబంతి = త్రాగుచున్నవి.

తల్లీ జగజ్జననీ! నీ ముఖము అను చంద్రుని యొక్క చిరునవ్వు అను వెన్నెల నంతను అమితముగా గ్రోలిన చకోర పక్షులకు, ఆ వెన్నెల వెఱ్ఱి తీపిగా నుండుట చేత వాని నాలుకలు ఆ తీపితో చచ్చుబారి - రుచి గూడా పట్టనివయ్యెను. అందువలన ఆ చకోర పక్షులు ఏదైనా పుల్లగా నుండు వాటిని త్రాగి, తీపితో నాలుక మొద్దబారిన తనమును పోగొట్టుకొనదలచి - చంద్రుని వెన్నెల అను అమృతమును బియ్యపు కడుగునీరు, లేదా - అన్నపు గంజియను భ్రాంతితో ప్రతి రాత్రి మిక్కిలిగా త్రాగుచున్నవి.

అమ్మా! చకోర పక్షులు చంద్రకిరణములలో నుండి వెలువడే అమృతధారలను స్వీకరించి జీవిస్తాయి. అవి నీ ముఖమును చూసి చంద్రకాంతిగా భావించి, అందునుండి వెలువడే కిరణములను ఆఘ్రాణించి, చంద్రకిరణముల ధారకంటే, నీ ముఖ కిరణముల ధారయే ఎంతో రుచిగా ఉందని తృప్తిగా ఆస్వాదించాయి.

ఓ తల్లీ! చంద్రబింబము వంటి నీ ముఖమునుండి చిరునగవు అనే వెన్నెల త్రాగుతున్న చకోరపక్షులు, ఆ వెన్నెలను త్రాగిత్రాగి రుచితెలుసుకొనేశక్తిని కోల్పోయినాయి. అందుచేత ఆ పక్షులు పులుపునందు కోరికగలవై చంద్రుని వెన్నెలను త్రాగుతున్నాయి.

64. అవి శ్రాంతం పత్యు ర్గుణగణకథా మ్రేడనజపా
జపాపుష్పచ్ఛాయా తవ జనని జిహ్వా జయతి సా।
యదగ్రాసీనాయాః స్ఫటికదృషదచ్ఛచ్ఛవిమయీ
సరస్వత్యా మూర్తిః పరిణమతి మాణిక్యవపుషా॥

టీక:- (హే) జననీ! = ఓ జగన్మాతా!, తవ = నీ యొక్క, సా = ఆ, జిహ్వా = నాలుక, అవిశ్రాంతం = నిరంతరము, పత్యుః = పతియైన – సదాశివుని యొక్క, గుణ = గుణముల, గణ = సమూహ సంపద యొక్క, కథా = వృత్తాంతముల యొక్క, ఆమ్రేడన = మరల మరల వచించుటకు, జపా = జపము గలదై, జపాపుష్పచ్ఛాయా = మందార పువ్వు యొక్క రంగు వంటి ఎఱ్ఱని కాంతి గలదై, జయతి = ప్రకాశించు చున్నది. యత్ + అగ్రాసీనాయాః = ఏ జిహ్వాగ్రము నందు ఆసీనురాలైన, సరస్వత్యాః = సరస్వతీ దేవి యొక్క, స్ఫటికదృషత్ = స్ఫటికమణివలె, అచ్ఛ = తెల్లనై, ఛవిమయీ = అధికమైన, మూర్తిః = స్వరూపము, మాణిక్యవపుషా = పద్మరాగము యొక్క స్వరూపరక్తిమతో, పరిణమతి = పరిణామము చెందు చున్నది.

తల్లీ! జగజ్జననీ! నీ నాలుక నిరంతరము నీ పతియైన సదాశివుని విజయ గుణగణముల చరిత్రలను ఎడతెరిపి లేకుండా చెప్పుచుండుట వలన మందార పుష్పము యొక్క ఎఱ్ఱని కాంతుల గలదై ప్రకాశించు చుండుటయే గాక, తన నాలుక యందే ఎప్పుడునూ ఆసీనురాలై, పూర్తిగా స్ఫటికము వలె తెల్లగా నుండెడు సరస్వతీ దేవిని సైతము పద్మరాగమణి కాంతులతో ఎఱ్ఱని రూపముగల దానిగా మార్చు చున్నది.

తల్లీ, నీవు నీ పతి నామస్మరణలో నిత్యం మునిగి ఉంటావు. ఆయన చేసిన త్రిపురాసుర సంహారం వంటి లీలలను నీవు అను నిత్యం కీర్తిస్తుంటే, నీ నాలుక యొక్క ఎరుపు వర్ణం పరిసరాలన్నిటినీ ఎర్రగా మార్చేస్తోంది. అదే సమయంలో నీ జిహ్వాగ్రంపై ఆసీనురాలైన తెల్లటి వర్ణం కల వాగ్దేవి కూడా, ఎరుపు వర్ణంలోకి మారిపోయింది. ఎంత చిత్రమో కదా.

అమ్మా! నీ జిహ్వ నిరంతరము నీ భర్త అయిన సదాశివుని గుణగణాలను స్తుతించి దాసానిపువ్వులాగా ఎర్రగా అయింది. అటువంటి నీ జిహ్వాగ్రాన ఆసీనయైన సరస్వతీదేవి శుద్ధ స్ఫటికములాగా తెల్లగా ఉన్నప్పటికీ, ఆమె ఎర్రగా కనిపిస్తోంది.

65. రణే జిత్వా దైత్యా నపహృతశిరస్త్రైః కవచిభి
ర్నివృత్తై శ్చండాంశ త్రిపురహర నిర్మాల్యవిముఖైః।
విశాఖేంద్రో పేంద్రై శ్శశివిశదకర్పూరశకలాః
విలీయంతే మాత స్తవ వదన తాంబూల కబళాః॥

టీక:- (హే) మాతః! = ఓ జగజ్జననీ! రణే = యుద్ధము నందు, దైత్యాన్ = రాక్షసులను, జిత్వా = జయించి, అపహృత శిరస్త్రైః = తీసివేయబడిన శిరస్త్రాణములు, అనగా – తలపాగలు,

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute

కిరీటముల వంటి వాటిని గల వారును, కవచిభిః = కవచములు గల వారును, నివృత్తైః = యుద్ధరంగము నుండి మరలి వచ్చిన వారును, చండాంశ = చండుడను ప్రమథుని భాగము అగు, త్రిపురహర = త్రిపురాసురులను సంహరించిన, శివుని యొక్క, నిర్మాల్య = నిర్మాల్యమునందు, విముఖైః = గ్రహింపని వారును ఐన – విశాఖ = కుమారస్వామి, ఇంద్ర = ఇంద్రుడు, ఉపేంద్ర = విష్ణువు, అను ముగ్గురి చేత, శశివిశద = చంద్రుని వలె స్వచ్ఛముగా నున్న, కర్పూర శకలాః = పచ్చకర్పూరపు తునకలుకలవైన, తవ = నీ యొక్క, వదన = ముఖము (నోరు) నుండి వెలువడి వచ్చిన, తాంబూల కబళాః = తాంబూలపు ముద్దలు, విలీయంతే = నమిలి మ్రింగబడి, జీర్ణమై, లీనమై పోవుచున్నది.

తల్లీ! జగజ్జననీ! యుద్ధము నందు రాక్షసులను జయించి తమ శిరస్త్రాణములను (తలపాగలను) తీసివైచి, కవచములు మాత్రము ధరించిన వారై, యుద్ధరంగము నుండి మరలి వచ్చుచు, ప్రమథగణములలో ఒకడైన చండునికి చెందు – త్రిపురహరుని నిర్మాల్యమును, అనగా – శివుడు స్వీకరించి విడిచిన గంధ తాంబూలాదికములను (చండునికే) వదలి, జగదంబ నివాసమునకు వచ్చిన కుమారస్వామి, ఇంద్రుడు, విష్ణువులు – తల్లీ! నీ నోటినుండి వెలువడి వచ్చిన తాంబూలపు ముద్దలను గ్రహించగా – అందలి, అనగా – ఆ తాంబూలపు ముద్దలలో చంద్రుని వలె స్వచ్ఛముగాను, నిర్మలముగాను ఉండు పచ్చ కర్పూరపు తునకలు గూడా పూర్తిగా నమలబడి, మ్రింగబడి ఆ తాంబూలకబళములు పూర్తిగా జీర్ణమై లీనమై పోవుచున్నవి.

అన్ని యుద్ధాలలోనూ విజేతగా నిలిచే దేవసైన్యాధ్యక్షుడు కుమారస్వామి, వజ్రాయుధుడైన దేవేంద్రుడు, సుదర్శన చక్రధారి యైన మహా విష్ణువు కూడా, యుద్ధములో రాక్షసులను జయించి వచ్చి త్రిపురాంతకుని నిర్మాల్యము వైపు కూడా చూడకుండా, అన్ని లోకాలను గుభాళింపచేసే నీ తాంబూల శకలాన్ని స్వీకరించడానికే ఆసక్తి చూపుతారు మాతా!

ఓ తల్లీ! యుద్ధంలో రాక్షసులను జయించి, శిరస్త్రాణాలను తీసి, కవచము ఇంకా ధరించిఉండి, చండుడు అనే ప్రమథుడు శివునియొక్క నిర్మాల్యాన్ని అనుభవిస్తున్నాడు. కుమారస్వామి, ఇంద్రుడు ఉపేంద్రుడు మొదలైనవారు చంద్రునిలాగా స్వచ్ఛము, నిర్మలము అయి, కప్పురపు తునకలు గల నీ తాంబూలకబళమును తీసుకుంటున్నారు.

66. విపంచ్యా గాయన్తీ వివిధమపదానం పశుపతే
స్త్వయారబ్ధే వక్తుం చలితశిరసా సాధువచనే
తదీయై ర్మాధుర్యై రపలపిత తంత్రీకలరవాం
నిజాం వీణాం వాణీం నిచుళయతి చోళేన నిభృతమ్॥

టీక:- (హే జగజ్జనని!) పశుపతేః = ఈశ్వరుని యొక్క, వివిధం = అనేక విధములైన, అపదానం = సాహస కృత్యములు మొదలగు వాటిని, విపంచ్యా = వీణచేత, గాయంత్యా = గానము చేయుచున్న, వాణీ = సరస్వతి, వక్తుం = వచించుటకు, చలితశిరసా = మనస్సు

నందు కలిగిన సంతోష వశమున స్వయముగా గలిగిన శిరః కంపము చేత, తవయా = నీచేత, సాధువచనే = మధుర వచనము, ఆరచ్ఛేతి = ప్రారంభించినదగుచుండగా, తదీయై = ఆవచన సంబంధులైన, మాధుర్యైః = మాధుర్య గుణముల చేత, అపలపిత = అపహసింపబడిన, తంత్రీకలరవాం = తంత్రుల యొక్క అవ్యక్త మధురములైన ధ్వనులు గలదైన, నిజాం = తన యొక్క, వీణాం = వీణను, చోలేన = వీణను ఉంచు పై ముసుగుచేత, నిభృతం = కనబడకుండా నుండునట్లు, నిచులయతి = బాగుగా కప్పుచున్నది.

తల్లీ! జగజ్జననీ! ఈశ్వరుని యొక్క వివిధ సాహస కృత్యములు, చరిత్రలు మొదలగు వాటిని సరస్వతీ దేవి తన వీణతో గానము చేయుచుండగా - నీవు ఆనందముతో శిరః కంపము చేయుచు ప్రశంసా వాక్యములు పలుకు నంతలో - ఆ ప్రశంసావచనములు తన వీణానాదము కన్న మధురముగా నున్నవని తలచి సరస్వతీ దేవి తన వీణాగానము నాపి, తన వీణను పై ముసుగు చేత కనబడకుండా బాగుగా కప్పుచున్నది.

మాతా, ఈశ్వర సభలో, సరస్వతీ దేవి తన కచ్ఛపీ వీణపై ఈశ్వరుని లీలలను పలికిస్తున్నది. ఆ లీలలకు పరవశించిన నీవు ఆహా అని మెచ్చుకోగానే, నీ మాటల మాధుర్యమునకు సిగ్గుపడి వీణా తంత్రులు మూగవోయాయి. సరస్వతీ దేవి తన వీణావాదనను నిలిపి వేసింది.

అమ్మా! సరస్వతీదేవి నీ దగ్గర కూర్చుని శివునియొక్క వీరగాధలను వీణమీద వాయిస్తున్నది. ఆ సమయంలో సరస్వతీదేవి యొక్క వీణానాదం మృధుమధురంగా ఉన్నది అని చెప్పటానికి నువ్వు నోరు తెరచినప్పుడు, నీ నోటి నుంచి వచ్చిన మాటలు, ఆ వీణానాదం కన్న గొప్పగా ఉన్నాయి. ఆ వాక్కుముందు సరస్వతీ దేవి యొక్క వీణానాదం వెలవెల పోయింది. అప్పుడు ఆ సరస్వతీదేవి తన వీణను గవిసెన గుడ్డతో కప్పివేసింది. అంటే పరమేశ్వరియొక్క కంఠధ్వనిముందు వీణానాదం కూడా నిలువలేదు.

67. కరాగ్రేణ స్పృష్టం తుహినగిరిణా వత్సలతయా
గిరీశే నోదస్తం ముహు రధర పానాకులతయా।
కరగ్రాహ్యం శంభో ర్ముఖముకురవృంతం గిరిసుతే
కథంకారం బ్రూమ స్తవ చుబుక మౌపమ్యరహితమ్॥

టీక:- (హే) గిరిసుతే = గిరిరాజపుత్రీ! తుహినగిరిణా = పర్వత రాజైన నీ తండ్రి చేత, వత్సలతయా = వాత్సల్యము చేత, కరాగ్రేణ స్పృష్టం = మునివ్రేళ్ళతో పుడుక బడునదియు, గిరీశేన = శివునిచేత, అధరపాన + ఆకులతయా = అధర పానము నందలి తొట్రుపాటుచేత, ముహుః = మాటిమాటికి, ఉదస్తం = పైకెత్తబడినదియు, శంభోః = శివుని యొక్క, కరగ్రాహ్యం = చేతిని గైకొనదగినదియు, ముఖ ముకురవృంతం = ముఖము అను అద్దమునకు పిడి అయినదియు, ఔపమ్యరహితం = సరిపోల్చదగిన వస్తువు లేనిదియునగు (అనగా - సాటి లేనిదగు), - తవ = నీ యొక్క, చుబుకం = (క్రింది పెదవి కింద నుండు) గడ్డమునకు,

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

కథంకారం = ఏ విధముగా (ఉపమానము చెప్పి), బ్రూమః = వర్ణించగలను?

ఓ గిరి రాజకుమారీ! తండ్రి అయిన హిమవంతుని చేత అమితమైన వాత్సల్యముతో మునివ్రేళ్ళతో పుడుక బడినదియు, అధరామృతపానము నందలి ఆతృత, తొట్రుపాటులతో శివునిచే మాటి మాటికీ పెకెత్తబడినదియు, శంభుని హస్తమును చేకొనతగినదియు, సరిపోల్చతగినది ఏమియు లేనిదియు అయిన – నీ ముఖము అను అద్దమును పుచ్చుకొనుటకు అందమైన పిడివలె నున్న నీ ముద్దులొలుకు చుబుకము (గడ్డము) ను – ఏ విధముగా వర్ణించగలను?

ఎంతో మంది కవులు అమ్మవారిని అనేక విధాలుగా వర్ణించారు. కానీ ఆ తల్లి చుబుకమును వర్ణించలేక పోయారు. అమ్మా నీ తండ్రి హిమవంతుడు నిన్ను ఎంతో ప్రేమగా నీ చుబుకమును పైకెత్తి నీ ముఖమును దర్శించాడు. ఈశ్వరుడు కూడా నీ అధరా మృతమును గ్రోలుటకు నీ చుబుకమును పైకెత్తినాడు. నీ ముఖము అద్దమువలే ఉండగా, ఆ అద్దమునకు పిడి వలె ఉన్నది నీ చుబుకము అన్నారు శంకరులు.

హిమవంతుని కుమార్తె అయిన హైమవతీ! నీ తండ్రియైన హిమవంతునిచే అమిత వాత్సల్యముతో, మునివ్రేళ్ళతో పైకి పుణకబడినది, నీ భర్త అయిన శివునిచేత మాటిమాటికీ పైకెత్తబడునది, అయిన సాటిలేని నీ ముఖమనే అద్దానికి పిటివంటిది అయిన నీ చుబుకాన్ని పూజిస్తాను.

68. భుజాశ్లేషా న్నిత్యం పురదమయితుః కంటకవతీ
తవ గ్రీవాధత్తే ముఖకమలనాళశ్రియ మియమ్।
స్వత శ్శ్వేతా కాలాగురు బహుళజంబాలి మలినా
మృణాళీలాలిత్యం వహతి యదధో హారలతికా॥

టీక:- (హే జగజ్జననీ!) తవ = నీ యొక్క, ఇయంగ్రీవా = ఈ కంఠనాళము, పురదమయితుః = పురహరుడైన శివుని యొక్క, భుజ + ఆశ్లేషాత్ = బాహువులచే నైన కౌగిలింతల వలన, నిత్యం = ఎల్లప్పుడు, కంటకవతీ = (గగుర్పాటువలన) రోమాంచముగలదైన, ముఖ కమల = ముఖమనెడు తామరపూవు యొక్క, నాళశ్రియ = కాడ అందమును, ధత్తే = ధరించుచున్నది. యత్ = ఏ కారణము వలన, అధః = (ఆ కంఠమునకు) క్రిందుగా నున్న ప్రదేశము నందు, స్వతః = స్వయముగనే, శ్వేతా = స్వచ్ఛమైనదై, కాల + అగురు = నల్లనైన అగురు, గంధపు చెక్క యొక్క, బహుళ = విస్తారముగా నున్న, జలజల = పంకముచేత, మలినా = నలుపు వన్నె చేత, హారలతికా = ముత్యాల హారము, మృణాళీలాలిత్యం = తామరతూడు సౌందర్యమును, వహతి = ధరించుచున్నదో.

తల్లీ! జగజ్జననీ! పురహరుని బాహువులతో అయిన, కౌగిలింతలచే నిత్యము గగుర్పాటుతో రోమాంచము గలదై, క్రింద భాగము సహజముగనే స్వచ్ఛముగా నుండి, నల్లగాను విస్తారముగా నున్న అగురు గంధపు పంకముతో, తామరతూడు అందమును చూపట్టు ముత్యాల హారముతోను

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

ఉండుటవలన - నీ కంఠనాళము, - అనగా - మెడ - నీ ముఖమనెడు పద్మమునకు తూడు నాళము, అనగా - కాడవలెనున్నది.

అమ్మా! గరళమును స్వీకరించి నీలకంఠుడైన ఈశ్వరుడు నిన్ను ఆలింగనము చేసుకున్నపుడు, ఆయన కంఠములోని నీలిరంగు, నీ మెడలోని తెల్లని ముత్యాలపై పడి అవి నీలిరంగులోకి మారాయి. అపుడు నీవు కూడా గరళకంఠివైనావు. శివుని శరీరంలో అర్ధశరీరధారిణివైన నీవు గరళకంఠవు కావడములో ఆశ్చర్యమేముంది. అది సహజమైన విషయమే.

ఓ తల్లీ! త్రిపురాంతకుడైన శివుడు నిన్ను కౌగిలించుకున్నప్పుడు గగుర్పాటు పొంది నీకంఠము ముఖపద్మానికి నాళము అవుతున్నది. కంఠము క్రిందిభాగాన ఉన్న తెల్లని ముత్యాలపేరు, అక్కడ పూయబడిన కృష్ణాగరుయొక్కనల్లదనంవల్ల తామరతూడులాగా నీలిరంగులో మెరుస్తున్నది.

69. గళే రేఖా స్తిస్రో గతిగమక గీతైకనిపుణే
వివాహవ్యానద్ధప్రగుణ గుణ సంఖ్యా ప్రతిభువః।
విరాజంతే నానావిధ మధుర రాగాకరభువాం
త్రయాణాం గ్రామాణాం స్థితినియమ సీమాన ఇవతే॥

టీక:- (హే జగజ్జననీ!) గతి = సంగీత మార్గముల యందును, గమకం = స్వరకంపన విశేషములందును, గీత = గానము నందును, ఏక = ముఖ్యమైన, నిపుణే = నేర్పరితనము గలదానా!, తే = నీ యొక్క, గళే = కంఠ ప్రదేశమునందు, తిస్రః రేఖాః = మూడు భాగ్య రేఖలు, లేదా - మూడు ముడుతల రేఖలు, వివాహ = పెళ్ళి సమయమందు, వ్యానద్ధ = (కంఠము చుట్టును వచ్చునట్లు) కట్టబడిన, ప్రగుణగుణ = పెక్కు నూలు పోగులచే కూర్చబడిన దారముల యొక్క, సంఖ్యా = (మూడు) సంఖ్యకు, ప్రతిభువః = ప్రతినిధులైనవియు, అనగా - ప్రతీకలైనవియు, నానావిధ = అనేక విధములైన, మధుర మనోహరములైన, రాగ = కళ్యాణి మొదలగు రాగములకు, ఆకరభువాం = (స్వరస్థానములను) ఆశ్రమ స్థానములైనవియు, త్రయాణాం = మూడైన, గ్రామాణాం = షడ్జ, మధ్యమ, గాంధార గ్రామములకు, స్థితి = ఉనికి యొక్క, నియమ = నియమము కొఱకు ఏర్పరచిన, సీమానః ఇవ = సరిహద్దులవలె, విరాజంతే = మిక్కిలి శోభాయ మానముగా ప్రకాశించు చున్నవి.

సంగీత మార్గ స్వర గాన నిపుణీ, జగజ్జననీ! నీ కంఠము నందు కనబడు మూడు భాగ్యరేఖలు - వివాహ సమయమునందు పెక్కు నూలు పోగులతో ముప్పేటలుగా కూర్చబడి కట్టిన సూత్రమును గుర్తు తెచ్చుచు, నానా విధములైన మధుర రాగములకు ఆశ్రయ స్థానములైన (షడ్జ, మధ్యమ, గాంధార) గ్రామము(గమకము)ల ఉనికి యొక్క నియమము కొఱకు ఏర్పరచిన సరిహద్దులవలె నున్నట్లు శోభాయమానముగా ప్రకాశించుచున్నవి.

జగన్మాత కంఠాన్ని శంకరులు ఎంత నిశితంగా పరిశీలించారో చూడండి. అమ్మా! నీ కంఠంపై కనబడుతున్న మూడు గీతలు ఈశ్వరుడు నీ మెడలో వేసిన మూడు ముడులకు చిహ్నములా! లేక సంగీతమును ఇష్టపడే నీ మెడలో మూడు రాగముల గుర్తులా! ఏది ఏమైనా నీవు "కామేశబద్ధమాంగల్యసూత్రశోభితకంథర"వు.

ఓ సంగీత సామ్రాజ్ఞీ! నీ కంఠసీమలోని మూడు భాగ్యరేఖలూ వివాహ సమయాన శంభుడు కట్టిన అనేక దారములతో తయారుచేసిన మాంగల్యాన్ని గుర్తుకు తెస్తూ, నానావిధాలైన మధురమైన రాగాలకులయమైన షడ్జగ్రామ, మధ్యగ్రామ, గాంధార గ్రామాలకు ఉనికిగా ప్రకాశిస్తున్నది.

70. మృణాలీ మృద్వీనాం తవ భుజలతానాం చతసృణాం
చతుర్భి స్సౌందర్యం సరసిజభవస్స్తౌతి వదనైః।
నఖేభ్య స్సంత్రస్యన్ ప్రథమ మథనాదంధకరిపో
శ్చతుర్ణాం శీర్షాణాం సమ మభయ హస్తార్పణధియా॥

టీక:- (హే జగజ్జననీ!) మృణాలీమృద్వీనాం = తామరతూడు వలె మెత్తదనము గలవియు, చతసృణాం = నాలుగుగా వున్నవియు, తవ = నీ యొక్క, భుజలతానాం = తీగల వంటి భుజముల యొక్క, సౌందర్యం = అందమును, సరసిజభవః = తామరపద్మము నందు జన్మించిన బ్రహ్మదేవుడు, చతుర్భిః = నాలుగుగా నున్న, ముఖైః = తన ముఖములచేత, ప్రథమమథనాత్ = మొట్టమొదటి తన శిరస్సును గిల్లి ఖండించుట గలవాడైన, అనగా - ఖండించిన వాడైన, అంధకరిపోః = అంధకుడను అసురుని సంహరించిన సదాశివుని యొక్క, నఖేభ్యః = గోళ్ళవలన, సంత్రస్యన్ = మిగుల భయపడుచున్నవాడై, చతుర్ణాం = నాలుగుగా నున్న, శీర్షాణాం = తన శిరస్సులకు, సమం = సమానముగా, అభయహస్త + అర్పణధియా = అభయదానము చేయగలిగిన నీ హస్తముల యొక్క అభయమును గోరి, స్తౌతి = నిన్ను స్తుతించు చున్నాడు.

తల్లీ! జగజ్జననీ! తామర తూడువలె మృదువుగా తీగలవలె నుండు నీ బాహువుల చక్కదనమును చూచి, బ్రహ్మ తన నాలుగు ముఖములతో - పూర్వము తన ఐదవ శిరస్సును గోటితో గిల్లివేసిన శివుని గోళ్ళకు భయపడుచూ, ఒక్కసారిగా తన మిగిలిన నాలుగు శిరస్సులకు నీ నాలుగు హస్తముల నుండి అభయ దానము కోరుచూ, నిన్ను స్తుతించుచున్నాడు.

(శివుడు బ్రహ్మ ఐదవ తలను తృంచివేయడం లో ఒక సృష్టి రహస్యము -- సృష్టిక్రమము - "ఆకాశా ద్వాయుః, వాయోరగ్నిః, అగ్నేరాపః, అద్భ్య పృథివీ॥ ఇది సృష్టి క్రమము (లయ దీనికి వ్యతిరేకము) - సృష్టి కర్త బ్రహ్మ - బ్రహ్మకు నాలుగు వైపులా నుండు ముఖములు - వాయు, అగ్ని, జల, పృథివీ తత్త్వములు - వాటి మధ్య ఊర్ధ్వముగా నుండు తల ఆకాశము. - ప్రళయ కాలమునందు శివుడు ముందుగా ఊర్ధ్వముగా నుండు తల 'ఆకాశ తత్త్వమును' తనలోనికి లీనము చేసుకొనును)

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

జగన్మాతా! ఒకప్పుడు బ్రహ్మకు అయిదు ముఖాలుండేవి. తనకూ, శివునకూ కూడా అయిదు ముఖాలున్నాయని అహంకరించిన బ్రహ్మ, శివునిపట్ల తిరస్కార భావం ప్రదర్శించాడు. అందుకు ఆగ్రహించిన శివుడు, తన గోటితో, బ్రహ్మయొక్క ఒక తలను త్రుంచి వేశాడు. బ్రహ్మ చతుర్ముఖుడయ్యాడు. అవి కూడా ఎక్కడ త్రుంచివేస్తాడో అనే భయంతో, బ్రహ్మ నీ చతుర్భుజాలను స్తుతిస్తూ అభయం కోరుతున్నాడు.

ఓ తల్లీ! పూర్వకాలంలో ఈశ్వరుడు బ్రహ్మయొక్క ఐదవ శిరస్సును తన గోరుతో గిల్లివేయగా, అతడు మిగిలిన నాలుగు శిరస్సులను కూడా ఖండిస్తాడేమోననే భయంతో, అభయం ఇమ్మని నీ నాలుగు బాహువులను తన నాలుగు శిరస్సులతోను ఒక్కసారిగా ప్రార్థిస్తున్నాడు.

71. నఖానా ముద్యోతై ర్నవనళినరాగం విహసతాం
కరాణాం తే కాంతిం కథయ కథయామః కథ ముమే।
కయా చిద్వా సామ్యం భజతు కలయా హంత కమలం
యది క్రీడ ల్లక్ష్మీచరణ తలలాక్షారసచణమ్॥

టీక:- ఉమే! = ఓ పార్వతీ, నఖానాం = గోళ్ళయొక్క, ఉద్యోతైః = ఉత్పన్నమగు కాంతుల చేత, నవనళినరాగం = అప్పుడే వికసించెడు తామరపూవు యొక్క ఎఱ్ఱని కాంతిని, విహసతాం = అపహసించుచున్న, తే = నీ యొక్క, కరాణాం = హస్తముల యొక్క, కాంతిం = శోభను, కథం = ఏ విధముగా, కథయామః = అలంకారయుతముగా వర్ణించగలమో, కథయ = చెప్పుము. హంత = మరి, కమల = పద్మము, కలయాఅపి = పదునాఱవ పాలుచేతనైనను, సామ్యం = పోలికను, కయాచిత్వా = ఏ దేని ఒక విధము చేతనైనను, భజంతు = పొందును గాక! ఆ విధము ఏదియన - క్రీడత్ = క్రీడించుచున్న, లక్ష్మీ = లక్ష్మీదేవియొక్క, చరణతల = పాదము యొక్క, లాక్షారసచణం = లత్తుకరసముతో గూడి సమర్థమైనది అయిన ఎడల పొందవచ్చునేమో!

తల్లీ! ఉమాదేవి! అప్పుడే వికసించు తామరపూవు యొక్క ఎఱ్ఱని కాంతులను సైతము పరిహసించు గోళ్ల కాంతులతో శోభిల్లు - నీ యొక్క హస్త ప్రభావైభవమును ఏ విధముగా వర్ణించగలము? క్రీడించు లక్ష్మీదేవి పాద లాక్షారుణరసముతో కూడి సమర్థవంతమైనచో అప్పుడు నీ హస్తప్రభల పదునాఱవ పాలుతో పోల్చుటకు ఏమైనా అవి సరిపోవునేమో!

అమ్మా! అరుణ వర్ణముతో అప్పుడే వికసించిన పద్మములను పోలిన నీ చేతులకు, నీ ఎర్రనైన గోళ్ళు ఎంతో అందాన్ని చేకూరుస్తున్నాయి. ఎర్ర కలువలు, ఎర్రని పద్మములు వీటి కన్నా, నీయొక్క గోళ్ళ ఎరుపు వర్ణం అత్యంత ప్రకాశవంతముగా ఉన్నది.

తల్లీ! అప్పుడే సూర్యోదయకాలంలో వికసించిన తామరపూవు యొక్క కాంతిని పరిహసిస్తున్న కాంతిగల గోళ్ళతో విలసిల్లుతున్న నీ హస్తములశోభ వర్ణింప వీలుకానిది. కమలము ఒకప్పుడు క్రీడిస్తున్న లక్ష్మీదేవిచరణాల లత్తుక రసము అంటినదైతే, అప్పుడు నీకరముల కాంతిలేశానికి కొంతవరకు పోలిక పొందగలుగుతుంది.

Kiron Type Institute
Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

72. సమం దేవి స్కంద ద్విపవదన పీతం స్తనయుగం
త వేదం నః ఖేదం హరతు సతతం ప్రస్నుతముఖమ్।
య దాలోక్యా శంకాకులిత హృదయో హాసజనకః
స్వకుంభే హేరంభః పరిమృశతి హస్తేన ఝుటితి॥

టీక:- హే దేవి = ఓ భగవతీ! సమం = ఒకే సమయములో, స్కంద = కుమారస్వామి చేతను, ద్విపవదన = ఏనుగు ముఖము కల వినాయకుని చేతను, పీతం = పాలుత్రాగబడినదియు, ప్రస్నుత ముఖం = పాలను స్రవింప జేయు కుచాగ్రములు గలదియునగు, తవ = నీ యొక్క, స్తనయుగం = వక్షోజముల జంట, నః = మా యొక్క, ఖేదం = దుఃఖమును, హరతు = తొలగించు గాక! యత్ = ఏ స్తనయుగమును, ఆలోక్య = చూచి, ఆశంకా = (నా యొక్క తలపై నుండు కుంభములు దొంగిలింపబడినవను) సంశయము చేత, ఆకులిత = అర్థముకాక ఆలోచనలో పడిన, హృదయః = మనస్సుగలవాడై, హేరంభః = వినాయకుడు, హాసజనకః = (పార్వతీ, కుమారులకు) నవ్వు పుట్టించు చున్నవాడై (వీడు అమాయకుడు అనుకొను విధముగా), స్వముఖే = తన శిరస్సుపై గల కుంభములు రెంటిని, హస్తేన = తొండము చేత, ఝుటితి = ఆ క్షణము లోనే, పరామృశతి = తడవుకొనుచున్నాడు.

ఓ త్రిపుర సుందరీ దేవీ! ఒకే సమయములో కుమారస్వామి చేతను, వినాయకుని చేతను గూడా పాలు త్రాగబడినవియు, పాలు స్రవింపజేయు అగ్రభాగములు కలవియు, పాలు త్రాగునపుడు ఏ జంటను చూచి వినాయకుడు 'తన తలపై నుండు కుంభములు దొంగిలింపబడి ఇక్కడ చాటుగా నున్నవా?' అన్న శంకతో వెంటనే తన కుంభస్థలములను తొండము చేత తడవుకొనగా, అది చూచిన పార్వతీ కుమారులకు నవ్వు వచ్చెనో – అట్టి నీ స్తన యుగము మా దుఃఖములను తొలగించు గాక!

జగన్మాతా! నీ పుత్రులు – గజముఖుడు అయిన వినాయకుడు, షణ్ముఖుడైన కుమారస్వామి ఒకే సమయంలో, నీ స్తన్యమును త్రాగుతున్నారు. నీ స్తన్యమే వారిరువురినీ అంతటి లోకైక వీరులుగా చేసింది. వారిరువురే కాక మేమందరమూ, నీ బిడ్డలమే కదా. నీ స్తన్యము అనే జ్ఞానమును నాకు కూడా అనుగ్రహించు మాతా!

అమ్మా! భగవతీ! నీస్తన్యము పానముచేస్తున్న వినాయకుడు, తన తల్లి వక్షోజములను చూసి తనకుంభస్థలము ఇక్కడికెలావచ్చింది అనే అనుమానంతో, తన తుండముతో తలను తడివి చూసుకుంటున్నాడు. ఆ సంఘటన నీకు, నీ భర్త అయిన శివుడికీ నవ్వుపుట్టిస్తున్నది. ఏ స్తనద్వయము వినాయకుడికి, కుమారస్వామికీ ఒకేసారి స్తన్యము ఇస్తున్నదో?, అస్తనద్వయము మమ్ములను రక్షించుగాక మా దుఃఖమును పోగొట్టునుగాక.

73. అమూ తే వక్షోజా వమృతరస మాణిక్య కుతుపౌ
న సందేహ స్పందో నగపతిపతాకే మనసి నః।

పిబంతౌ తౌ యస్మా దవిదితవధూ సంగరసికౌ
కుమారా వద్యాపి ద్విరవదన క్రౌంచదళనౌ॥

టీక:- నగపతి పతాకే! = కొండరాజు కులమునకు వన్నె తెచ్చిన గిరిజాదేవీ!, అమూ = ఈ కన్పట్టుచున్న, తే = నీ యొక్క, వక్షోజౌ = స్తనములు, అమృతరస మాణిక్యకుతుపే = అమృతముతో నిండిన మాణిక్యములతో నిర్మింపబడిన సిద్దెలు, లేదా - కుప్పెలు, నః = మా యొక్క, మనసి = మనస్సునందు, సందేహస్పందః = లేశమాత్రమైన సందేహమును, న = లేదు, యస్మాత్ = ఏ కారణము వలన, తే = ఆ కెంపు కుప్పెలైన నీ స్తనములను, పిబంతే = పాలు త్రాగుచున్నవారై, అవిదిత = తెలియని, వధూ = స్త్రీల యొక్క, సంగ = కూటమి యందు, ద్విరవదన క్రౌంచదళనే = గజముఖుడైన వినాయకుడు, క్రౌంచపర్వతమును కొట్టిన కుమారస్వామి ఈ ఇరువురును, అద్య + అపి = ఇప్పటికి గూడ, కుమారౌ = బాలురుగానే వున్నారు.

పర్వతరాజ వంశమునకు వన్నెతెచ్చిన గిరిజాదేవీ! మాకు కనిపించు ఈ నీ స్తనములు అమృత రసముతో నిండినవై, పద్మ రాగమణులచే చేయబడిన సిద్దెలు, లేదా - కుప్పెలుగా నున్నవి. ఈ విధముగా చెప్పుటలో మాకు మనస్సునందు కొంచెమైనను సందేహము లేదు. ఏలయనగా - ఆ నీ స్తన్యమును గ్రోలిన వారైన గజముఖుడైన గణపతి, క్రౌంచపర్వతమును కొట్టిన కుమార స్వామియు నేటి వరకు గూడ ఏ కాంతాసంగము వలన గూడా ఆనందమును పొందురసికులు కానివారై, బాలురుగానే వున్నారు గదా!

(గణేశునికి 'సిద్ధి', 'బుద్ధి' అని ఇద్దరు భార్యలు, కుమారస్వామికి 'వల్లి', 'దేవసేన' అని ఇద్దరు భార్యలు ఉండగా - వీరిరువురూ - స్త్రీ సంగమ విషయమే తెలియని వారనుట విచిత్రము, అతిశయోక్తి గాదా అని అనిపించక మానదు. - కాని, ఈ సిద్ధి, బుద్ధి, వల్లీ, దేవసేన లనగా నేమో తెలిసినపుడు ఈ మాటల వెనుక గల అంతరార్థము తెలియును.

సిద్ధి గురించి - భాద్రపద శుద్ధ చతుర్థినాడు చంద్రుడు కన్యారాశిలోని హస్తా నక్షత్రములో నుండును. ఆనాడు రాత్రిపూట ఆకాశములోని తారలను చూచినచో, హస్తా నక్షత్రపు తారల కూటమి వద్ద జేడిపప్పు ఆకారములో చంద్రుడు కనబడును. చంద్రుడనగా మనస్సు (చంద్రమామనసో జాతః - పురుషసూక్తం), 'హస్త' మనగా చెయ్యి. అనగా గణేశ చతుర్థి రోజున చంద్రుడు అను మనస్సు 'హస్తా' నక్షత్రము అను చేతిలో నుండును. కార్యమును సంకల్పించునది మనస్సుకాగా, దానిని చేయునది చెయ్యి (కర్మేతి హస్తయోః) మనస్సు చేతిలో వుండుట అనగా - సంకల్పము చేతిలోనే వుండుట. సంకల్పించు మనస్సు - పనిని చేయు చేతిలోనే వున్నపుడు ఇక ఆ పని ఎంతో బాగుగా జరుగును కదా! ఇది 'కార్యసిద్ధి' ని సూచించు యోగము. ఇటువంటి - 'సిద్ధి'ని కలిగినవాడు గణేశుడు. దీనిని అర్థవాదకథగా పురాణములలో తెలిపిరి . 'సిద్ధి-గణేశుల భార్యాభర్తల సంబంధము' ఇంతమాత్రమే నని గ్రహించవలెను.

- **బుద్ధి గురించి** - గణేశ చతుర్థినాడు మనస్సు అను చంద్రుడు కన్యారాశిలోని హస్తానక్షత్రములో నుండునని చెప్పబడినదిగదా! హస్తా నక్షత్రము కన్యారాశిలో 10^0 నుండి 25^0 వరకు వుండును. ఈ డిగ్రీలకు మధ్యలోనే 15^0 గూడా వచ్చును. కన్యారాశిలోని 15^0 బుధునకు ఉచ్చ. మనస్సు అను చంద్రుడు - పరిపుష్టమైన నైపుణ్యము గల బుద్ధిని సూచించు - బుధుని ఉచ్చ స్థితిని తెలియచేయు డిగ్రీవద్ద - వుండుటవలన, ఆ గణేశునికి అటువంటి వివేకము, నైపుణ్యము, నైశిత్యము గల బుద్ధి వుండును. ఇట్టి 'బుద్ధి' ని కలిగినవాడు అని, ఆ బుద్ధి ఆయన భార్య వంటిదని చెప్పిరి. దీనిని అర్థవాద కథగా పురాణములలో తెలిపిరి. 'బుద్ధి-గణేశుల భార్యా భర్తల సంబంధము' ఇంతమాత్రమే.)

వల్లి గురించి - శుక్రమును సూక్ష్మదర్శినితో జాగ్రత్తగా పరిశీలించినచో - చిన్న చిన్న సర్పాకృతులలో శుక్రకణములు కనిపించును. కుమారస్వామి సర్వదేవత. శుక్రము యొక్క సూక్ష్మ స్థితులలోని ధాతువులలో చిట్ట చివరి దానికి సంబంధించినదే కుండలినీ శక్తి. కుమారస్వామినే 'సుబ్రహ్మణ్యస్వామి' అని కూడా అందురు. 'మంచి వర్చస్సు గలవాడు' అని సుబ్రహ్మణ్య పదమునకు అర్థము. ఈ వర్చస్సు కుండలినీ శక్తి వల్లనే వచ్చును. అందువలన కుమారస్వామిని వ్యష్టి కుండలినీ శక్తికి అధిపతి అందురు. ఈ కుండలిని వలయాకారపు 3 1/2 చుట్లతో మూలాధారము వద్ద వుండునని చెప్పుదురు. ఇట్టి వలయాకారపు చుట్ల కుండలినిని 'వల్లీ' దేవిగాను, దాని అధిపతి గాబట్టి, కుమారస్వామిని వల్లీనాథునిగాను ఒక అర్థవాద కథగా పురాణములలో చెప్పిరి. 'వల్లీ-కుమారస్వాముల భార్య భర్తల సంబంధము' ఇంత మాత్రమే.

- **ఇక దేవసేన విషయం** - తారకాసుర సంహారార్థమే కుమారస్వామి జననము జరిగినది. అందువలన పుట్టినప్పటి నుండి కుమారస్వామి దేవతల సేనకు నాయకుడై, ఎల్లప్పుడును దేవతల సేనతోనే వుండెడివాడు. ఇల్లు, ఇల్లాలు గూడా ఆ దేవతల సేనే అను విధముగా కుమారస్వామి వుడుటచేత 'దేవసేన' ను ఆయన భార్యగా సంకేతించి, అర్థవాదముగా పురాణకథ వ్రాసిరి. 'దేవసేన-కుమారస్వామి భార్యాభర్తల సంబంధము' ఇంతమాత్రమే అని అర్థము చేసుకొనవలెను. - 'అమ్మవారి స్తన్యము త్రాగినన్నాళ్ళు వారు చిన్నపిల్లలే' 'స్తన్య' మనగా మాతృహృదయ మందలి ప్రేమామృతము' - వారి పట్ల అమ్మవారి ప్రేమ అటువంటిది.)

అమ్మా! జగదీశ్వరీ! నీ స్తన్యములు అమృతధారలు. అటువంటి అమృతధారలను త్రాగడం వలననే అమ్మా! నీ కుమారులైన గణేశుడు, కుమారస్వామి ఇరువురూ కూడా నిరంతర యౌవనము, వార్ధక్యము లేక ఎప్పటికీ బాలురుగానే పూజింపబడుతున్నారు.

ఓ హైమవతీ! మాకు కన్పించుచున్న నీ చనుద్వయము అమృతముతో నిండిన మాణిక్యపు కుంభములు. ఈ విషయంలో మాకు ఏ విధమైన అనుమానము లేదు. ఎందుకంటే నీ చనుబాలు త్రాగిన గజాననుడు, కుమారస్వామి ఇద్దరూ ఈ రోజుకు కూడా జవరాండ్ర చెలువలకూటమి వలన ఆనందరసాస్వాదనము గావించినా రసికులుకానివారై బాలురుగనే ఉన్నారు.

74. వహ త్యంబ స్తంబేరమదనుజ కుంభప్రకృతిభిః
సమారబ్ధాం ముక్తామణిభిరమలాం హారలతికామ్।
కుచాభోగో బింబాధరరుచిభి రన్త శ్శంబలతాం
ప్రతాపవ్యామిశ్రాం పురదమయితుః కీర్తి మివ తే॥

టీక:- (హే) అంబ! = ఓ జగన్మాతా!, తే = నీ యొక్క, కుచ + ఆభోగః = స్తనములకు మెడకు మధ్యనున్న విశాల ప్రదేశము, స్తంబేరమదనుజ = గజాసురుని యొక్క, కుంభ = కుంభస్థలము నుండి, ప్రకృతిభిః = పుట్టిన, ముక్తామణిభిః = ముత్యముల చేత, సమారబ్ధాం = చేయబడినదియు, అమలాం = దోషరహిత మైనదియు, స్వచ్ఛమైనదియు అయిన, హారలతికాం = తీగవంటి ముత్యాల హారమును, బింబాధర రుచిభిః = దొండపండు వంటి కెంపు రూపు గలదైన, క్రింది పెదవి కాంతుల చేత, అంతఃశబలతాం = లోన ప్రతి ఫలించిన చిత్రవర్ణములతో కూడినదియు అయి, ప్రతాపవ్యామిశ్రాం = రక్తవర్ణకాంతులతో, పురదమయితుః = త్రిపురహరుని యొక్క, కీర్తిం ఇవ = కీర్తిని వలె, వహతి = వహించుచున్నది.

ఓ జగజ్జననీ! విశాలముగను, పక్వముగను ఉండు నీ స్తనములకు మెడకు మధ్య నున్న ప్రదేశము - గజాసురుని కుంభస్థలము నుండి పుట్టినదియు, దోషరహితమును, స్వచ్ఛమైనదియు అయిన ముత్యముల చేత కూర్చబడిన తీగల వంటి ముత్యాల హారమును కలిగి, దొండపండు కెంపురూపు గలదైన నీ క్రింది పెదవి కాంతులచేత లోన ప్రతి ఫలించిన చిత్రవర్ణముతో గూడినదై - రక్త వర్ణకాంతులతో త్రిపుర హరుడైన శివుని కీర్తిని పొందిన దానివలె నున్నది.

మాతా! నీ గళసీమను అలంకరించిన హారము స్వచ్ఛమైన ముత్యాలతో కూర్చబడినది. ఎందుకంటే, నీ ఎర్రని అధరముల కాంతి ఆ ముత్యములపై పడి ప్రకాశిస్తోంది. ఆ ఎరుపు వర్ణము ఈశ్వరుని కీర్తిని ప్రతిబింబిస్తున్నది. త్రిపురాసుర సంహారి యైన ఈశ్వరుని కీర్తి పరాక్రమములనే నీవు హారముగా ధరించావేమో అని నా అభిప్రాయము.

అమ్మా! గజాసురుని శిరస్సు అనే కుంభస్థలమే జన్మభూమిగా గలిగిన, దోషములు లేని ముక్తామణుల హారమును నీ స్తనమండల మధ్యమున ధరించు చున్నావు. ఆ ముత్యాల హారము పరమశివుని ప్రతాపాన్ని, కీర్తిని ప్రతిబింబిస్తున్నది. ముత్యాలు ఆరు రకాలుగా లభిస్తాయి అని రత్నశాస్త్రం చెబుతున్నది. 1. ఏనుగుల కుంభస్థలములయందు (కర్పూరకాంతి గలవి), 2. వెదురుబొంగులయందు (తెలుపుతో కూడిన ఎరుపురంగు గలవి), 3. పాముల పడగలయందు (నీలవర్ణము గలవి), 4. మేఘముల యందు (జ్యోతిర్వర్ణములు గలవి), 5. ముత్యపు చిప్పల యందు (తెలుపురంగు గలవి), 6. చెరకుగడల యందు (పసుపువర్ణము గలవి).)

75. తవస్తన్యం మన్యే ధరణిధరకన్యే హృదయతః
పయః పారావారః పరివహతి సారస్వతమివ।

Kiron Type Institute

దయావత్యాదత్తం ద్రవిడశిశు రాస్వాద్య తవ యత్
కవీనాం ప్రౌఢానా మజని కమనీయః కవయితా॥

టీక:- ధరణి ధరకన్యే = పర్వతరాజపుత్రికా ఓ పార్వతీ! తవ = నీయొక్క, స్తన్యం = చనుబాలను, హృదయతః = హృదయము నుండి పుట్టినదైన, పయః పారావారః పాలసముద్రము, సారస్వతం ఇవ = సారస్వతము వలె, లేదా - వాఙ్మయము వలె, పరివహతి = ప్రవహించుచున్నది అని, మన్యే = తలచెదను. యత్ = ఏ కారణము వలన, దయావత్యా = దయతో కూడిన నీచేత, దత్తం = ఈయబడిన చనుబాలను, ద్రవిడ శిశుః = ద్రవిడ దేశమునందు పుట్టిన బాలుడు, (అనగా - ఈ స్తోత్ర కర్త అయిన శంకరులే!) ఆస్వాద్య = త్రాగి, హే ప్రౌఢానం = ప్రౌఢులు నిపుణులు అయిన, కవీనాం = కవీశ్వరులలో, కవయితా = కవియై, అజని = పుట్టెనో (అందువలన).

ఓ పార్వతీ! నీ చనుబాలను - నీ హృదయము నుండి పుట్టి పొరలి వచ్చు పాలసముద్ర రూపమైన సారస్వతము వలె తలంచెదను. లేనిచో - అమిత ప్రేమతో నీవు ఇచ్చిన ఆ నీ చనుబాలను త్రాగి ద్రవిడ దేశములో (అనగా కేరళలోని కాలడి గ్రామములో) పుట్టిన బాలుడు (అనగా ఈ స్తోత్ర కర్త అయిన శంకరాచార్యుల వారే!) ప్రౌఢులు, ఉద్దండులు అయిన కవీశ్వరులలో కెల్ల కమనీయమైన కవిత్వమును చెప్పగల వానిగా ప్రసిద్ధి చెందువాడగునా?

అమ్మా! నీ స్తన్యములో కవిత్వము, వాఙ్మయము నిండి ప్రవహించుచున్నవి. కనుకనే, నీ పుత్రులిరువురూ, పండితులచే ఆరాధించబడుతున్నారు. శ్రీ వేదవ్యాసులు మహాభారతాన్ని చెబుతుంటే, మహా గణపతి తన దంతంతో, ఏకధాటిగా వ్రాయగలిగాడంటే, అది నీ స్తన్య మహిమే. అలాగే ఆకలికి తాళలేని ఆది శంకరులను తల్లి నీ ముందు వదలి వెళ్ళినప్పుడు నీవిచ్చిన స్తన్యమే ఆయనను జగద్గురువుగా నిలిపింది.

ఓ హైమవతీ! నీచనుబాలను పైకి ప్రవహించే సారస్వతరూపమైన వాఙ్మయముగా భావిస్తున్నాను. అలాకానట్లైతే ద్రవిడదేశంలో పుట్టినవాడు ఇంత గొప్పకవి కాలేడు.

76. హరక్రోధజ్వాలావళిభి రవలీఢేన వపుషా
గభీరే తే నాభీసరసి కృతసంగో మనసిజః।
సముత్తస్థౌ తస్మా దచల తనయే ధూమలతికా
జన స్తాం జానీతే తవ జనని రోమావళి రితి॥

టీక:- అచలతనయే = ఓ పార్వతీ! మనసిజ = మన్మథుడు, హర = శివుని యొక్క, క్రోధజ్వాలా + ఆవళిభిః = క్రోధము అను అగ్ని వలన జనించిన జ్వాలల యొక్క సమూహము చేత, అవలీఢేన = క్రమ్మబడిన, వపుషా = శరీరముతో, గభీరే = లోతైన, తే = నీ యొక్క, నాభీ సరసి = బొడ్డు అను సరస్సునందు, కృతసంగః = కూడిన వాడయ్యెను, అనగా - మునిగిన వాడయ్యెను, తస్మాత్ = అందువలన ఆ బొడ్డు అను కొలను నుండి, ధూమలతికా

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

= పొగతీగె, సముత్తస్థా = పైకి ప్రాకెను, జనని = ఓ తల్లీ! తాం = ఆ ధూమలతికను, జనః = జనము, తవ = నీ యొక్క, రోమావళిః ఇతి = నూగారు అని, జానీతే = తెలుసుకొను చున్నారు. లేదా - అనుకొనుచున్నారు.

ఓ పార్వతీ! శివుని క్రోధాగ్ని జ్వాలలు క్రమ్మబడిన తన శరీరముతో మన్మథుడు (ఉపశమనము కోసము) లోతైన నీ బొడ్డు అను కొలనులోనికి దూకి మునిగినపుడు, నిప్పు చల్లారి ఆ కొలను నుండి తీగవలె పొగపైకి ప్రాకినది. దానిని (ఆ పొగతీగను) చూచిన జనులు నీ నూగారుగా అనుకొనుచున్నారు.

జగన్మాతా! నీవు 'లక్ష్యరోమలతాధారతాసమున్నేయమధ్యమా' అని స్తుతించ బడ్డావు. ఈశ్వరుడు, మన్మథుని తన మూడవకంటి కోపాగ్ని మంటలలో దహించినపుడు, అతడు నీ లోతైన నాభి అనే సముద్రములో మునిగిపోయాడు. అప్పుడు పైకి వచ్చిన పొగల సమూహమే నూగారుగా ఏర్పడినట్లున్నది.

తల్లీ! పర్వతరాజపుత్రీ! హరుని క్రోధాగ్నిజ్వాలలచే చుట్టబడిన శరీరముతో మన్మథుడు, తనను తాను కాపాడుకోవటంకోసం లోతైన నీ నాభిఅనే మడుగులో దూకాడు. ఆ సమయంలో కాలుతున్న అతని శరీరం చల్లారటంవలన వచ్చిన పొగ నీ నాభినుంచి పైకిప్రాకి కనిపిస్తున్నది. అలా పైకి వెళ్ళిన పొగచారికనే ఈ లోకంలో నీ నూగారుగా వర్ణిస్తున్నారు.

77. యదే తత్కాళిందీతనుతర తరంగాకృతి శివే
కృశే మధ్యే కించి జ్జనని తవ య ద్భాతి సుధియామ్।
విమర్దా దన్యోన్యం కుచకలశయో రన్తరగతం
తనూభూతం వ్యోమ ప్రవిశదివ నాభిం కుహరిణీమ్॥

టీక:- శివే! = ఓ భగవతీ!, జనని = ఓ జగజ్జననీ!, కృశే = సన్ననైన, తవ = నీ యొక్క, మధ్యే = నడుము నందు, యత్ ఏతత్ = ఏ యది ముందు స్ఫురించుచున్నదో, అనగా - ఎట్ట యెదుట ఏది కనబడుచున్నదో, కాళిందీ = యమునా నదియొక్క, తనుతర = సూక్ష్మాతి సూక్ష్మమైన, తరంగ + ఆకృతి = అలవంటిరూపు గలదై, కించిత్ = కొంచెముగా కనబడు, రోమావళి (నూగారు), తీరు, సుధియాం = విద్వాంసులకు, యత్ = ఏది, భాతి = ప్రకాశించుచు కనబడుచున్నదో, అది, తవ = నీ యొక్క, కుచకలశయోః = కుచ కుంభముల యొక్క, అంతరగతం = మధ్య భాగమున వర్తించునదై, తనూభూతం = సూక్ష్మరూపమైన, వ్యోమ = ఆకాశము, అన్యోన్యం = పరస్పరము, విమర్దాత్ = ఒరసి కొనునట్లు స్పృశించుకొనుట వలన, కుహరిణీం = గుహవంటిదైన, నాభిం = బొడ్డును, ప్రవిశత్ + ఇవ = ప్రవేశించుచున్నది వలె ఉన్నది.

ఓ భగవతీ! జగజ్జననీ! యమునానదీ తరంగము వలె సన్నగా చిన్నగా నుండి, నీ నడుము మధ్యమునందు మెఱయుచూ కనబడెడు నూగారు అను చిన్న వస్తువును చూచు మేధావులకు, విద్వాంసులకు, అది - నీ స్తనముల మధ్యనున్న ఆకాశము - ఆ స్తనములు

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

రెండును ఒరయుట వలన ఆ ఒరిపిడికి తాళలేక, చోటు చాలక నలిగి, నల్లనై, సన్ననై, మెల్లగా అధోమార్గముగా నీ నాభిని ప్రవేశించు చున్నట్లనిపించును.

తల్లీ! నీ సన్ననైన కటి భాగము యమునా నది యొక్క తరంగముల వలె ఉన్నది. దానినుండి అతి సూక్ష్మమైన నూగారు నాభి స్థానమునుండి కుచ భాగము వరకు వ్యాపించి ఉన్నది. యమునా నది నీరు నలుపు వర్ణములో ఉంటుంది కదా. అందువలననే నీ నూగారు నల్లగా శోభిస్తున్నది.

ఓ పరమశివుని పట్టపురాణీ! కృశించిన నీ నడుమునందు ఎదురుగా కనిపిస్తున్నది, సన్నని తరంగములాగా సన్ననైన నీ నూగారును చూసి మేధావులు "నీ కుచకుంభములు ఒకదానితో ఒకటి ఒరిసి ఉండటంవల్ల, వాటి మధ్యగల ఆకాశము నలిగిపోయి, నల్లబడి, సన్నగా నాభివరకు జారిపోయినట్లున్నది - అంటున్నారు.

78. స్థిరో గంగావర్తః స్తనముకుళ రోమావళిలతా
క(కు)లావాలం కుండం కుసుమశరతేజో హుతభుజః
రతేర్లీలాగారం కిమపి తవ నాభి ర్గిరిసుతే
బిలద్వారం సిద్ధే ర్గిరిశ నయనానాం విజయతే॥

టీక:- గిరిసుతే = ఓ హిమగిరిసుతా!, తవ = నీ యొక్క, నాభిః = బొడ్డు, స్థిరం = స్థిరముగా నున్న, గంగావర్తః = గంగానది యొక్క సుడిగాను, స్తనముకుళ = స్తనములు అను పూల మొగ్గల యొక్క, రోమావళిలతా = నూగారు అను తీగకు, ఆవాలం = పాదుగను, కుసుమశర = మన్మథుని యొక్క, తేజస్ హుతభుజః = అగ్నిహోత్రమునకు సంబంధించిన, కుండం = హోమకుండముగను, రతేః = రతీదేవికి, లీలాగారం = విలాసగృహముగను, గిరిశనయనాం = సదాశివుని కన్నులకు, సిద్ధేః = తపస్సు సిద్ధించుటకు, బిలద్వారం = గుహాద్వారముగను (కనబడుచు), కిమపి = వర్ణనాతీతమై, విజయతీ = సర్వోత్కృష్టముగా భాసిల్లుచున్నది.

ఓ గిరిరాజపుత్రికా! పార్వతీ! నీ యొక్క బొడ్డు స్థిరముగా నున్న గంగానది సుడిగాను, స్తనములు అను పూల మొగ్గలను దాల్చు నూగారు అను తీగకు పాదుగాను, మన్మథుని యొక్క తేజస్సుకు, లేదా - అగ్నికి హోమ గుండముగాను, రతీదేవికి శృంగార గృహముగాను, నీ పతి యగు సదాశివుని తపస్సిద్ధికి గుహాద్వారముగాను అగుచు, వర్ణనాతీతమై, సర్వోత్కృష్టముగా ప్రకాశించుచున్నది.

'నాభ్యాలవాలరోమాళిలతాఫలకుచద్వయీ' అని కీర్తింప బడినది అమ్మ. మాతా! నీ నాభి స్థానము పవిత్రమైన గంగా నది వలె అత్యంత లోతైనది. ఆ స్థానము రతీ మన్మథులకు నివాస స్థానమయితే, ఈశ్వరుని నేత్రములకు నయనానంద కరము. వర్ణించ నలవి కాకుండా ప్రకాశించేదే నీ నాభి స్థానము.

Kiron Type Institute
Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

తల్లీ! ఓ పార్వతీదేవీ! నీ యొక్క నాభి చలనము వినాశనము లేని స్థిరమైన గంగానది నీటిసుడి. పాలిండ్లు అనే పూలమొగ్గలు పూచిన నూగారు ఆ తీగెపాదు. మన్మథుని తేజస్సు అనే అగ్నికి హోమగుండము, రతీదేవికి విహారస్థానము, ఈశ్వరుని నేత్రములయొక్క తపస్సిద్ధికి గుహాముఖము. ఈ రకంగా వర్ణించటానికి వీలుకానిదై ఉన్నది.

79. నిసర్గక్షీణస్య స్తనతటభరేణ క్లమజుషో
నమన్మూర్తే ర్నారీతిలక శనకైస్త్రుట్యత ఇవ।
చిరం తే మధ్యస్య త్రుటితతటినీ తీర తరుణా
సమావస్థా స్థేమ్నో భవతు కుశలం శైలతనయే॥

టీక:- శైలతనయే = ఓ పార్వతీ!, నారీ తిలక! = ఓ స్త్రీ రత్నమా! నిసర్గక్షీణస్య = స్వభావసిద్ధముగనే కృశించి సన్నగానున్నదైన, స్తనతట భరేణ = చనుగట్టుల బరువుచే, క్లమజుషః = అలసటను పొందినదైన, నమత్ + మూర్తేః = కొంచెముగా వంగుచున్న రూపు గలదై, శనకైః = కొంచెముగా, త్రుట్యతఃఇవ = తునిగిపోవుచున్నది వలె అయి, త్రుటిత్ = తెగగొట్ట బడినదైన, తటినీ = నదియొక్క, తీర = గట్టునందలి, తరుణా = వృక్షముతో, సమ + అవస్థాస్థేమ్నః = సమముగా పోలెడు అవస్థలో స్థిరముగా నున్న, తే = నీ యొక్క, మధ్యస్య = నడుమునకు, చిరం = కలకాలము, కుశలం = క్షేమము, భవతు = అగుగాక!

ఓ నారీ తిలకమా! పార్వతీ! స్వభావసిద్ధముగనే మిక్కిలి సన్నగా నున్నదై, రెండు స్తనములు అను గట్టుల బరువుచే అలసట పొందుచు కొంచెము వంగిన రూపు గలదై, తునిగి పోవుచున్నట్లనిపించునదై, కట్ట తెగిపోయిన ఏటి గట్టు నందలి చెట్టుతో పోల్చదగిన స్థితిలో స్థిరముగా నున్న – నీ నడుమునకు కలకాలము క్షేమము, కలుగు గాక!

కటి భాగము సన్నగా ఉండుట స్త్రీకి సాముద్రిక శాస్త్ర రీత్యా శుభలక్షణము. కుచ భారముచేత వంగిన సన్నని నడుము కలిగిన ఓ మాతా! నీవు స్త్రీలందరిలోనూ రత్నము వంటి దానివి. జగన్మాత, మాకు సకల శుభములను ప్రసాదించుము.

అమ్మా! స్వభావంచేతనే బాగా సన్ననైనది, వక్షోజముల బరువుచే వంగినట్లుగా ఉన్నది, విరిగిపోతున్నట్లుగా ఉన్నది, తెగిపోయిన ఏటిగట్టుపైనున్న చెట్టులాగా ఉన్న నీ నడుము చిరకాలము కుశలముగా ఉండుగాక.

80. కుచౌ సద్య స్స్విద్య త్తట ఘటితకూర్పా సభిదురౌ
కషంతౌ దోర్మూలే కనకకలశాభౌ కలయతా।
తవ త్రాతుం భఙ్గా దలమితి వలగ్నం తనుభువా
త్రిధా నద్ధం దేవి త్రివళిలవలీ వల్లిభిరివ॥

టీక:- దేవీ! = ఓ దివ్యమంగళ స్వరూపిణీ!, సద్యః = అప్పుడే, స్విద్యత్ = చెమర్చుచున్న, తట = పార్శ్వము లందు, ఘటిత = కూర్చబడిన, కూర్పాస = రవిక, భిదురౌ = పిగిలిపోవునేమో

Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

అనుభావము కలుగు జేయుచు, దోర్మూలే = బాహువుల మూలములను, అనగా - కక్ష ప్రదేశములను, కర్షంతీ = ఒరయుచున్నట్లును, కనక + ఆభౌ = బంగారు కడవల చక్కదనము ఒప్పారి గొప్పగా కనబడు, కుచౌ = స్తనములను, కలయతా = నిర్మించుచున్న వాడైన, తనుభువా = మన్మథుని చేత, భంగాత్ = పీన ఘనస్తనభారముచే నడుము తునిగెడు కీడు రాకుండు గాక అని, త్రాతుం = ముందు జాగ్రత్తగా రక్షణ కొఱకై, త్రివళీ = మూడు వళులు (త్రివళులు, అనగా - మూడు ముడుతలు) గల, తవ = నీ యొక్క, వలగ్నం = మధ్యభాగము, లవలీవల్లిభిః = ఏలకి తీగల చేత, త్రిధా = ముప్పేటలుగా, నద్ధం ఇవ = కట్టబడినదియా అన్నట్లున్నది.

ఓ దేవీ! అప్పటికప్పుడే చెమట పోయుచున్న పార్శ్యములను అంటుకొని వున్న రవికె పిగిలిపోవునేమో అనుభావమును కలుగచేయుచు, బాహుమూల ప్రదేశములను రాచుకొనుచు, బంగారు కడవల చక్కదనముతో ఒప్పారి గొప్పగా కనబడుచు నుండు స్తనములను నిర్మించుచున్న మన్మథుడు ఈ స్తనభారము వలన నడుము తునిగెడు కీడు రాకుండా ఆ నడుమును కాపాడుటకై, ఏలకి తీగెల (అడవిలోని ఒక మొక్క తీగలు) చేత ముప్పేటగా కట్టబడెనా అనునట్లు - త్రివళులతో గూడిన నీ నడుము తోచుచున్నది.

జగన్మాతా! ఉత్తమ స్త్రీ లక్షణములైన ఉన్నతమైన కుచ భాగమును నీ సన్నని నడుము మోయలేదేమో అన్న సందేహముతో నీ నడుమును మూడు పేటలున్న వస్త్రముచే బంధించినపుడు నీ నడుముకు మూడు ముడుతలు ఏర్పడినాయి. ఈ మూడు ముడుతలు త్రికాలములు, త్రిశక్తులు, త్రిగుణములు, త్రిలోకములను సంకేతిస్తున్నాయేమో అనిపిస్తోంది.

ప్రకాశమానమైన రూపం గల ఓ దేవీ! చెమట పోసినప్పుడు వంటికి అంటుకుపోయిన రవికెను పిగుల్చుచున్నవి, బాహుమూలముల సమీపప్రదేశము లందు ఒరుస్తున్నవి, బంగరు కలశముల కాంతులచే విరాజిల్లుతున్నవి, అయిన నీ కుచములను నిర్మిస్తున్న మన్మథుడు, నీ స్తనముల బరువువలన నడుముకు ఏ మాత్రము బంగపాటు కలుగరాదని ఆలోచించి, ఆ నడుమును కాపాడటానికి మూడు కట్లు వేశాడా అన్నట్లుగా నీ పొట్టమీది ముడుతలు అనిపిస్తున్నాయి.

81. గురుత్వం విస్తారం క్షితిధరపతిః పార్వతి నిజాత్
నితంబా దాచ్ఛిద్య త్వయి హరణ రూపేణ నిదధే।
అత స్తే విస్తీర్ణో గురురయ మశేషాం వసుమతీం
నితంబ ప్రాగ్భార స్థగయతి లఘుత్వం నయతిచ॥

టీక:- పార్వతీ! = ఓ గిరిజా! క్షితిధరపతిః = పర్వతరాజగు (నీ తండ్రి) హిమవంతుడు, గురుత్వం = బరువును, విస్తారం = విశాలత్వమును, నిజాత్ = తనకు చెందిన, నితంబాత్ = కొండనడుమ యందు గల చదునైన ప్రదేశము నుండి, ఆచ్ఛిద్య = వేరుచేసి తీసి, త్వయి

= నీయందు, హరణ రూపేణ = కూతురునకు తండ్రి యిచ్చు స్త్రీ ధనము రూపముగా, నిదధే = సమర్పించెను. అతః = ఇందువలననే, తే = నీ యొక్క, అయం = కనబడుచున్న, నితంబప్రాగ్భారః = పిఱుదుల యొక్క అతిశయము, గురుః = గొప్పగా బరువు గలదియు, విస్తీర్ణస్సన్ = విశాలమైనదగుచు, అశేషాం = సమస్తమైన, వసుమతీం = భూమిని, స్థగయతి = ఆచ్ఛాదించుచున్నది. అనగా, కప్పుచున్నది. లఘుత్వం = చులకన చేయుచున్నది, అనగా - తన కంటె తక్కువ చేయుచున్నది, చ = కూడా.

ఆమ్మా పార్వతీ! పర్వతరాజగు నీ తండ్రి హిమవంతుడు బరువు విశాలత్వములను తన కొండ నడుమ యందు గల చదునైన ప్రదేశము నుండి వేరు చేసి, నీకు 'స్త్రీ ధనము' రూపముగా సమర్పించెను. అందువలననే - నీ పిఱుదుల యొక్క గొప్పదనము - బరువు గాను, విశాలముగాను, విరివిగాను వుండి, ఈ సమస్త భూభాగమును కప్పుచుండుటయే గాక, దానిని తక్కువ గూడా చేయుచున్నది.

జగన్మాతా, నీ తండ్రి హిమవంతుడు పర్వతరాజు. ఆయన నుండి జన్మ సమయములో కొండ భాగమువంటి పిరుదులను వారసత్వంగా పొందావా! లేకపోతే భూ మాతయే నీకు పిరుదులుగా అమరిందా! ఈ రెండింటిలో ఏదో ఒకటి సంభవించి ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను.

తల్లీ! పార్వతీదేవి! పర్వతరాజైన నీ తండ్రి హిమవంతుడు తన నితంబ ప్రదేశము నుండి (కొండచరియ) కొంత గురుత్వమును, కొంత వైశాల్యమును తీసి వివాహ సమయంలో కానుకగా నీకు సమర్పించాడు. దానివల్ల నీ పిరుదుల యొక్క సౌందర్యము చాలాగొప్పది, వెడల్పుఅయినది అయి ఈ భూమినంతటినీ కప్పుతున్నది.

82. కరీంద్రాణాం శుండాన్ కనకకదలీ కాండపటలీం
ఉభాభ్యా మూరుభ్యా ముభయమపి నిర్జిత్య భవతి।
సువృత్తాభ్యాం పత్యుః ప్రణతి కఠినాభ్యాం గిరిసుతే
విధిజ్ఞే జానుభ్యాం విబుధకరికుంభద్వయ మసి॥

టీక:- గిరిసుతే! = ఓ పార్వతీ! విధిజ్ఞే = వేద ప్రతిపాదిత విధులను తెలిసి ఆచరించు దేవీ!, భవతి = నీవు, కరీంద్రాణాం = ఏనుగుల యొక్క, శుండాన్ = తొండములను, కనకకదలీ కాండపటలీం = బంగారు అరటి స్తంభముల యొక్క మొత్తమును, ఉభాభ్యాం ఊరుభ్యాం = నీ రెండు తొడలచే, ఉభయం అపి = ఏనుగు తొండములు, అరటి స్తంభములు అను రెంటిని గూడ, నిర్జిత్య = జయించి, సువృత్తాభ్యాం = అందముగాను, వర్తులాకారములోను వుండి, (మంచి ప్రవర్తనకు దోహదపడునవైనవని గూడా అర్థము చెప్పుకొనవచ్చును.) పత్యుః = భర్తయగు పరమేశ్వరునికి, ప్రణతికఠినాభ్యాం = చేయు నమస్కారముల చేత కఠినములైన, జానుభ్యాం = మోకాళ్ళ చేత, విబుధ కుంభద్వయం = ఐరావత కుంభస్థలముల రెంటిని, అసి = (జయించిన దానవు) అగుచున్నావు.

Kiron Type Institute
Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

వేద ప్రతిపాదిత విధులను సక్రమముగా అనుష్ఠించు దేవీ! పార్వతీ! ఏనుగు తొండములను, బంగారు అరటి స్తంభములను – ఈ రెంటిని నీవు – నునుపుగాను, మెత్తగాను నున్న నీ రెండు తొడలచే జయించి; నునుపుగను, సొగసుగను, గుండ్రముగను వుండి – పతియైన పరమేశ్వరునికి నీవు సాగిలపడి మ్రొక్కునపుడు భూమిని తాకుట చేత గట్టిపడిన మోకాటి చిప్పల చేత – దేవలోకమునందలి ఐరావత కుంభస్థలములను గూడా జయించిన దానవగుచున్నావు.

అమ్మా! ఏనుగు తొండములవంటి, అరటి చెట్టు బోదెలవంటి నీ ఊరువుల సౌందర్యము నీ పతియైన కామేశ్వరునికి మాత్రమే తెలియదగినది. మాణిక్యములచే నిర్మింపబడిన నీ మోకాళ్ళు, నీవు నీ పతికి నమస్కరించడానికి వంగినపుడు ద్విగుణీకృతముగా ప్రకాశవంతమౌతాయి.

గిరిరాజపుత్రీ! నీ యొక్క ఊరువులు దిగ్గజేంద్రముల యొక్క తొండములను, బంగారు అరటిస్తంభములను మించి శోభిస్తున్నాయి. అలాగే నీ భర్త అయిన సదా శివునికి నమస్కరించటానికి వంగినప్పుడు నేలకు తగిలి, కఠినములైన నీ మోకాళ్ళు దిగ్గజముల కుంభస్థలములను మించి ఉన్నాయి.

83. పరాజేతుం రుద్రం ద్విగుణ శరగర్భౌ గిరిసుతే
నిషంగౌ జంఘే తే విషమ విశిఖో బాఢమకృత।
యదగ్రే దృశ్యంతే దశ శరఫలాః పాదయుగలీ
నఖాగ్ర చ్ఛద్మాన స్సురమకుట శాణైక నిశితాః॥

టీక:- గిరిసుతే = ఓ గిరిపుత్రీ! విషమశిఖః = బేసి సంఖ్య కల, అనగా – ఐదు బాణములు గలవాడైన మన్మథుడు, రుద్రం = శివుని, పరాజేతుం = పరాజయము పాలు చేయుటకు, ద్విగుణ = రెండురెట్లుగా చేయబడిన, శర = బాణములు (సహజముగా తనకు వున్న ఐదు బాణములు రెండు రెట్లు అయినపుడు పది బాణములు అగును) గర్భౌ = లోపల నిక్షిప్తమైన, (లేదా – ఉంచబడిన) నిషంగౌ = తూణీరములనుగా, తౌ = నీయొక్క, జంఘే = పిక్కలను (మోకాటి చిప్పలకు చీలమండలకు మధ్య భాగము), ఆకృత = చేసినాడు, బాఢం = (ఇది) నిజము, యత్ + అగ్రే = ఏ అమ్ముల పొదుల ముందు భాగములందు, పాదయుగళీ = అడుగుల జంటయొక్క, నఖ + అగ్ర = పది వ్రేళ్ళు గల గోళ్ళ చివరల యొక్క, ఛద్మానః = నెపము గలవైన, సుర = ఇంద్రాది దేవతల యొక్క, మకుట = కిరీటములనెడు, శాణ = సానపెట్టెడు రాళ్ళ యందు, ఏకనిశితాః = ముఖ్యముగా పదును పెట్టబడినవై, దశ = రెండింతలై పదియైన, శర = బాణముల యొక్క, ఫలాః = (ఉక్కు ముక్కల) బాణాగ్రములు – అనగా – బాణపు ములుకులు, లేదా – మొనలు, దృశ్యంతౌ = కనబడుచున్నవి.

ఓ గిరి రాజపుత్రీ! పార్వతీ! పంచశరుడైన మన్మథుడు రుద్రుని గెల్చుట కోసము తన కున్న ఐదు బాణములు చాలవని రెండింతలుగా, అనగా – పదిబాణములుగా చేసుకొన ెంచి, నీ పిక్కలను అమ్ముల పొదులుగను, రెండు కాళ్ళ వ్రేళ్ళను పది బాణములు గాను,

ఇంద్రాది దేవతలు నీ పాదములకు మ్రొక్కి నపుడు వారి కిరీట (రత్న)ముల రాపిడిచే సానపెట్టబడిన నీ పాదముల వ్రేళ్ళ గోళ్ళను - ఆ బాణములకు (ఉక్కు ముక్కలు) ములుకులుగాను చేసుకొనెను. (లేదా - శివుని గెల్చుట కోసము వెళ్ళునపుడు తన ఐదు బాణములను రెండింతలుగా చేసుకొని ఆ బాణములు ఉంచిన అమ్ముల పొదులు నీ రెండు పిక్కలుగను, ఆ పది బాణములు, నీ రెండు పాదముల వ్రేళ్ళుగను, బాణపు ములుకులు నీకు దేవేంద్రులు మ్రొక్కినపుడు వారి కిరీట (రత్న) ములచే సానబెట్టబడిన నీ పాద నఖములు (గ్రోళ్ళు) గను, గోచరించునట్లుగా (నీవే స్ఫురణకు వచ్చునట్లు) చేసి (శివుని) ఓడించెను).

జగన్మాత 'ఇంద్రగోపపరిక్షిప్తస్మరతూణాభజంఘికా' అని కీర్తింపబడ్డది. ఎలాగైనా ఈశ్వరునిజయించాలనుకున్న మన్మథుడు అమ్మవారి గోళ్ళకు పదును పెట్టాలనుకున్నాడు. దేవతలు జనని పాదాలకు నమస్కరిస్తున్నపుడు వారి కిరీటముల ధాటికి గోళ్ళు పదునుగా మన్మథుని బాణపు ములుకులులాగ మారినాయని శంకరులు చమత్కరించారు. అమ్మ జంఘములను మన్మథుని అమ్ములపొదితో పోల్చారు శంకరులు.

ఓ దేవీ! శివుని జయించటానికి మన్మథుడికి తన ఐదు బాణాలు చాలలేదు. అందుచేత వాటిని రెండింతలు అంటే పదిగా చేసుకొనదలచి, నీపిక్కలు అంబుల పొదులుగా, కాలివ్రేళ్ళు బాణాలుగా, కాలివ్రేళ్ళ గోళ్ళు బాణపు ములుకులుగా చేసికొని నీకు నమస్కరించటానికి వచ్చిన దేవతల కిరీటములలోని మణులమీద ఆ బాణపు ములుకులకు పదును పెడుతున్నాడు.

84. శ్రుతీనాం మూర్ధానో దధతి తవ యౌ శేఖరతయా
మమాప్యేతౌ మాత శ్శిరసి దయయా ధేహి చరణౌ।
యయోః పాద్యం పాథః పశుపతి జటాజూటతటినీ
యయో ర్లాక్షాలక్ష్మీ రరుణ హరి చూడామణి రుచిః॥

టీక:- మాతః = ఓ తల్లీ!, తవ = నీ యొక్క, యౌ = ఏ, చరణౌ = పాదములను, శ్రుతీనాం = వేదముల యొక్క, మూర్ధానః = శీర్షములైన వేదాంతములు, లేదా ఉపనిషత్తులు, శేఖరతయా = తలపై పూవుగా, దధతి = ధరించుచున్నవో, (హే) మాతః = ఓ తల్లీ! ఏతౌ = ఈ, చరణౌ = పాదములను, మమ = నా యొక్క, శిరసి = శిరస్సునందు, దయయా = దయతో, ధేహి = వుంచుము, యయోః = ఏ నీ చరణములకు, పాద్యం = పాదములను కడుగు, పాథః = జలము, పశుపతి = శివుని యొక్క, జటాజూట = జడముడి యందలి, తటినీ = గంగయో, యయోః = ఏ చరణముల యొక్క, లాక్షాలక్ష్మీః = లత్తుక రసపు కాంతి, అరుణ = ఎఱ్ఱని, హరి = విష్ణువు యొక్క, చూడామణి = శిరోభూషణము యొక్క, రుచిః = కాంతియో.

తల్లీ! జగజ్జననీ! ఏ పాదముల జంటను - ఉపనిషత్తులు శిరస్సులందు ధరించునో, (లేదా - వేదవనితలు తమ శిరస్సులందు పూవులుగా ధరింతురో), ఏ పాదముల జంటకు శివుని జటాజూట గంగ పాద్యమగునో, (అనగా, పాదములు కడుగు నీరు), ఏ పాదముల

Kiron Type Institute
Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

జంట విష్ణుమూర్తి శిరోభూషణము యొక్క అరుణకాంతికి కారణమో అట్టి నీ చరణములను దయతో నా శిరస్సుపై ఉంచుము.

అమ్మా! శివుని శిరసున ఉన్న గంగ నీ పాదములను కడుగగా, శ్రీ మహావిష్ణువు యొక్క కిరీటములోని ఎర్రని మణుల కాంతి నీ పాదములకు లత్తుకగా మారినది. ఆ పవిత్ర పాదములను ఉపనిషత్తులు శిరసున ఉంచుకున్నాయి. అంత పవిత్రమైన పాదములను నా శిరసుపై ఉంచి, నీ పాద ధూళి నాశిరసుపై ప్రసరింపచేయి తల్లీ.

ఓతల్లీ! ఓజగన్మాతా! వేదములకు శిరస్సులు అని చెప్పబడే ఉపనిషత్తులు అనే పూలను ధరించినవి, శివుని శిరము నుండి వచ్చే గంగాజలాన్ని పాదప్రక్షాళ నానికి ఉపయోగించేవి. శ్రీ మహావిష్ణువు ధరించే కౌస్తుభమణికాంతులు వెదజల్లేవి అయిన నీ పాదములను నా శిరస్సున ధరిస్తాను.

85. నమోవాకం బ్రూమో నయన రమణీయాయ పదయోః
త వాస్మై ద్వంద్వాయ స్ఫుటరుచిరసాలక్త కవతే
అసూయ త్య త్యంతం యదభిహననాయ స్పృహయతే
పశూనా మీశానః ప్రమదవన కంకేళితరవే॥

టీక:- (ఓ జగజ్జననీ) నయనరమణీయాయ = కన్నులకు ఇంపు గొలుపునదై, స్ఫుటరుచి = స్పష్టముగా ప్రకాశించు కాంతి గలదై, రస + అలక్తకవతే = లత్తుక రసముచే తడిసినదియు, పదయోః = నీ పాదముల యొక్క, అస్మై = ఈ కనబడు, ద్వంద్వాయ = జంటకు, నమోవాకం = నమస్కారవచనమును, బ్రూమః = వచించెదను, పశూనాం ఈశానః = పశుపతి అయిన శివుడు, యత్అభిహననాయ = ఏ పాద యుగ్మ తాడనమును, స్పృహయతే = కోరుచున్నాడో, ప్రమదవన = ఉద్యానము నందలి, కంకేళితరవే = అశోక వృక్షము కొఱకు, అనగా – అశోకమును గుఱించి, అత్యంతం = మిక్కిలి, అసూయతి = అసూయపడు చున్నాడో.

అమ్మా భగవతీ! నీ పాదయుగళము చూచువారికి నయనానందకరముగా నున్నది. చక్కని స్పష్టమైన ప్రకాశముతో వెలుగులు విరజిమ్ముచున్నది. లత్తుక రసముచే తడిసి కెంపురంగుతో ఇంపుగా నున్నది. నీ పాద తాడనమును ఎప్పుడును పొందు అవకాశము గలిగిన అలరులతోటలోని అశోక వృక్షములను గాంచి, అసూయ కలిగి, శివుడు నీ పాదతాడనము తనకును చెందవలెనని తహ తహలాడుచున్నాడు. అట్టి నీపాద యుగళమునకు నమస్కార వచనములు పలుకుచున్నాను, అనగా – నమస్కరించు చున్నాను.

శ్రీమాత పారాణితో అద్దబడిన తన పవిత్ర పాదాలతో అశోక వృక్షమును తాకినపుడు అది పుష్పిస్తుంది. తన భార్య పాదములు ఇంకొకరిని ప్రేమతో తాకడం ఇష్టంలేక అసూయతో తిలకిస్తున్నాడు ఈశ్వరుడు. అటువంటి పాదములు మాకు రక్షణ కలిగించుగాక. ఎంత చనువు జగన్మాత దగ్గర పొందితే తప్ప, ఆది శంకరులు ఇటువంటి చమత్కారములు చేయగలరు.

తల్లీ! ఏ నీ పాదములచేత తాడనము అపేక్షించు చున్న ఉద్యానవనం లోని అశోక వృక్షాన్ని చూసి పశుపతి అసూయ పడుతున్నాడో, ఏ నీ పాదములు లత్తుక రసముతో ప్రకాశిస్తున్నవో ఆ నీ పాద ద్వందానికి నమస్కారము.

86. మృషా కృత్వా గోత్రస్ఖలనమథ వైలక్ష్యనమితం
లలాటే భర్తారం చరణకమలే తాడయతి తే।
చిరా దంతశ్శల్యం దహనకృత మున్మూలితవతా
తులాకోటిక్వాణైః కిలికిలిత మీశానరిపుణా॥

టీక:- (ఓ జగజ్జననీ!) మృషా = పొరబాటున, గోత్రస్ఖలనం = (భార్యవద్ద) సవతి పేరును ఉచ్చరించుట, కృత్వా = చేసి, అథ = ఆ విధముగా పలికిన తర్వాత, వైలక్ష్యనమితం = ఏమి చేయుటకు తోచక పోవుటచే, నమితం = పాదప్రణామము చేసిన వాడును, భర్తారం = పతియును అగు శివుని, తే = నీ యొక్క, చరణ కమలే = పాదపద్మము నందు, లలాటే = లలాట ప్రదేశమునందు, అనగా – ఫాల భాగము నందు, తాడయతిసతి = తన్నినదగుచుండగా, ఈశానరిపుణా = శివుని శత్రువైన మన్మథుని చేత, చిరాత్ = చాలా కాలము నుండి (బాధించు చున్న) దహనకృతం = (శివుని మూడవకంటి) చిచ్చుచేత, కాల్చబడినదై చేయబడిన, అంతశ్శల్యం = హృదయమునందు బాణమువలె బాధించుచున్న దైన వైరమును, ఉన్మూలితవతా = పెళ్లగించి వేయుట గలవాని చేత, తులాకోటి = కాలిఅందెల యొక్క, క్వాణైః = మ్రోతల చేత, కిలికిలితం = కిలకిలా రావానుకరణముతో (మన్మథునికి) విజయసూచక మగుచున్నది.

తల్లీ! జగజ్జననీ! త్వరపడి పొరపాటున నీ దగ్గఱ నీ సవతి పేరును పలికి, తరువాత ఏమి చేయుటకును తోచక పోవుటచే నీకు పాద ప్రణామము చేసి లొంగిపోయిన నీ భర్తను నీ పాద పద్మముతో నుదుట తాడనము జరుపగా – దానిని గమనించిన శివుని శత్రువైన మన్మథుడు – హృదయశల్యమైన తన చిరకాల బాధ తీరి, శివునికి తగిన శాస్తి జరిగినదని కిలకిలా నవ్వినట్లు నీ కాలి గజ్జెల చిరు సవ్వడులు తోచుచున్నవి.

అమ్మా! ఒకసారి వేళాకోలముగా నిన్ను వేరే పేరుతో పిలిచి తలవంచిన శివుని ఫాలభాగమునకు పొరపాటున నీ పాదము తగిలి, నీ పాదమునకు ఉన్న కాలి మువ్వల ధ్వనితో, మన్మథుడు తిరిగి జనించాడట. ఆ పాదమును నాకు కూడా ఒకసారి తగిలించు తల్లీ!

తల్లీ! నీపతి అయిన శివుడు నీ దగ్గిర ఉండగా పొరపాటున నీ సవతి పేరు ఉచ్ఛరించి, చేసిన తప్పు ఏరకంగా దిద్దుకోవాలో తెలియక తొట్రుపడుతున్న సమయంలో నీవు నీకాలితో అతని నుదుటన ఒక్కతాపుతన్నగా, శివునికి విరోధియైన మన్మథుడు, నీమంజీరధ్వని రూపంతో కిలాకిలా రావములు చేశాడు.

87. హిమానీహంతవ్యం హిమగిరినివాసైక చతురౌ
నిశాయాం నిద్రాణాం నిశి చరమభాగే చ విశదౌ।

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

పరం లక్ష్మీపాత్రం శ్రియమతిసృజంతౌ సమయినాం
సరోజం త్వత్పాదౌ జనని జయత శ్చిత్ర మిహ కిమ్॥

టీక:- (హే) జననీ! = ఓ తల్లీ! పార్వతీ! హిమగిరినివాస + ఏకచతురౌ = మంచుకొండ యందు నివసించుటలో బాగుగా అలవాటు, నైపుణ్యము గలవియు, నిశి = రాత్రియందును, చరమభాగేచ = రాత్రి చివరి సమయములందు గూడ, విశదే = ప్రకాశ వికాసము గలవియు, సమయినాం = సమయాచారపరులైన భక్తులకు, లేదా సమయాదేవిగా అమ్మవారిని ఆరాధించు భక్తులకు, శ్రియం = సంపదను, అతిసృజంతౌ = మిక్కుటముగా కలుగ జేయునవియును, అయిన, త్వత్పాదౌ = నీ పాదములు - హిమనీ హంతవ్యం = మంచుచే నశింపచేయ దగినవియు, నిశాయాం = రాత్రియందు, నిద్రాణాం = నిద్రించునదియు, వరం = ఇష్టమైన, లక్ష్మీపాత్రం = లక్ష్మీదేవి అధిష్టించుటకు పీఠమైన, సరోజం = తామరపద్మమును, జయతః = జయించుచున్నవి. ఇహ = ఈ విషయమునందు, కించిత్రం = ఏమి ఆశ్చర్యము?

తల్లీ! జగజ్జననీ! నిత్యము మంచుకొండ యందు నివసించుచు, సంచరింపగలవియు, రాత్రిపూట, రాత్రి చివరి భాగ సమయములలో గూడ ప్రకాశ వికాస అనుగ్రహము కలవి, సమయాచార పరులకు సిరిసంపదలను మిక్కుటముగా కలుగజేయునవియు, అయిన నీ అడుగులు (పాదములు) - మంచు మొత్తము చేత నశింప చేయతగినదియు, రాత్రివేళ ముడుచుకొని వుండునదియు, పగలు మాత్రమే లక్ష్మీదేవి అధిష్ఠించుటకు అనువైనదియు అగు - తామరపద్మమును జయించు చున్నవి. ఈ విషయములో ఆశ్చర్యపడవలసినది ఏమియు లేదు.

అమ్మా! హిమవంతుని పుత్రికవైన నీవు సదా మంచు పర్వతాలలో చరిస్తుంటావు. కానీ ఆ మంచు యొక్క చల్లదనానికి నీ పాదములు ముడుచుకొని పోవు. పద్మములు సూర్యకాంతికి వికసించి, మంచుకు, రాత్రిలోను ముడుచుకుంటాయి. నీ పాదాలు మాత్రం ఎల్లప్పుడు వికసించే ఉంటాయి. నీ పాదాలకూ, పద్మములకు సామ్య మెక్కడిదమ్మా!

తల్లీ! మంచుకొండయందు నివసించుటలో నేర్పుగలవి, రాత్రులందు, తెల్లవారు ఝామున ప్రసన్నములైనవి, సమయాచారులైన నీ భక్తులకు లక్ష్మీ ప్రద మైనవి అయిన నీ పాదాలు, మంచువలన నాశనము పొందునవి, రాత్రులందు ముడుచుకు పోయేవి, లక్ష్మీదేవికి కొంచెము పీఠముగా నుండదగినవి అయిన కమలములను జయిస్తున్నాయి. ఈ విషయంలో ఆశ్చర్యం లేదు.

88. పదం తే కీర్తీనాం ప్రపద మపదం దేవి విపదాం
కథం నీతం సద్భిః కఠినకమఠీ కర్పరతులాం।
కథం వా పాణిభ్యా ముపయమనకాలే పురభిదా
యదాదాయ న్యస్తం దృషది దయమానేన మనసా॥

టీక:- (హే) దేవి! = ఓ దేవీ! పార్వతీ! కీర్తీనాం = యశస్సులకు, పదం = ఉనికిపట్టును, విపదాం = ఆపదలకు, అపదం = కానిచోటును, (అగు) తే = నీ యొక్క, ప్రపదం = పాదముపై భాగము, సద్భిః = సత్కవులచేత, కఠిన = గట్టిదైన, కమఠీ = ఆడు తాబేలు యొక్క, కర్పర = వీపుపై డిప్పను, తులాం = పోలికను, కథం = ఏ విధముగా, నీతం = కొనియాడబడినది అనగా చెప్పబడినది? దయామానేన = దయగల, మనసా = మనస్సు చేత, పురభిదా = త్రిపురహరుడైన శివునిచేత, ఉపయమనకాలే = వివాహ సమయమందు, పాణిభ్యాం = హస్తములచేత, యత్ = ఏ నీ పాదము, ఆదాయ = పట్టుకోబడి, కథం వా = ఏవిధముగా, దృషది = సన్నికల్లునందు, న్యస్తం = వుంచ బడినదో!

అమ్మా! జగజ్జననీ! ఎల్ల సత్కీర్తులకు ఆలవాలమై, అన్ని ఆపదలకు ఇరవుగానిదైన నీ పాదముల పై భాగమును సత్కవీంద్రులు - మిక్కిలి గట్టిగా నుండు ఆడు తాబేలు యొక్క వీపు పై డిప్పతో సరిపోల్చుటకు ఎట్లు ప్రయత్నించు చున్నారు? త్రిపుర హరుడైన శివుడు నిర్దయుడై వివాహ సమయమున సన్నికల్లు (పసుపు నూరుకొను పాత్రమునకు ఆధారము) మీద మెత్తని నీ పాదమును ఏ విధముగా ఉంచగలిగినాడు.

'గూఢగుల్ఫాకూర్మపృష్ఠజయిష్ణుప్రపదాన్వితా' అనేది శ్రీమాత పాదముల వర్ణనే. అమ్మా! మీ వివాహ సమయమున ఈశ్వరుడు నీ పాదములను సన్నికల్లుపై ఉంచి స్పృశించినాడు. నీ పాదములపై భాగము తాబేలు ఉపరితలముతో పోల్చబడినది. ఆకారములో తప్ప మృదుత్వంలో ఈ పోలిక సరైనది కాదేమో అని భావిస్తున్నాను తల్లీ!

తల్లీ! సత్కీర్తులకు స్థానమై, ఆపదలను తొలగించునట్టి నీ మీగాళ్ళను, కఠినమైన తాబేలు వీపు చిప్పలతో ఏ రకంగా పోలుస్తున్నారు? దయా స్వరూపుడైన శివుడు వివాహ సమయంలో మృధువైన నీ పాదాలను సన్నె కల్లుమీద ఎలా ఉంచగలిగాడు?

89. నఖై ర్నాక స్త్రీణాం కరకమల సంకోచశశిభిః
స్తరూణాం దివ్యానాం సహతఇవ తే చణ్డిచరణౌ।
ఫలాని స్వస్స్థేభ్యః కిసలయ కరాగ్రేణ దదతాం
దరిద్రేభ్యో భద్రాం శ్రియ మనిశ మహ్నాయ దదతౌ॥

టీక:- (హే) చండీ! = ఓ దుర్గాదేవీ! కిసలయ = చిగురుటాకులు అను, కరాగ్రేణ = హస్తముల యొక్క కొనలచేత, స్వస్స్థేభ్యః = స్వర్గలోకములో నుండు, దేవతల కొఱకు, ఫలాని = కోరిన వాటిని, దదతాం = ఇచ్చునట్టి, దివ్యానాం = స్వర్గ మందున్న, తరూణాం = కల్పవృక్షములను, దరిద్రేభ్యః = దీనజనుల కొఱకు, భద్రాం = మంగళకరమైన, శ్రియం = సంపదను, అనిశం = ఎల్లప్పుడు, అహ్నాయ = వెంట వెంటనే, దదతౌ = ఇచ్చు చున్నట్టి, తే = నీ యొక్క, చరణే = పాదములు, నాకస్త్రీణాం = స్వర్గలోకపు స్త్రీల యొక్క, కరకమల = హస్తము అను పద్మముల యొక్క, సంకోచ = ముకులించుట యందు, శశిభిః = చంద్రుని పోలినదైన, నఖైః = గోళ్ళ చేత, హసతః ఇవ = నవ్వుచున్నవి వలె ఉన్నవి.

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

అమ్మా! చండీ! జగజ్జననీ! సకల సంపదలతో తులతూగుచూ నుండు దేవతల కోరికలను మాత్రమే కోరికలను తమ చిగురుటాకులు అను హస్తముల చేత తీర్చు కల్ప వృక్షములను చూచి - దీన దరిద్ర జనులకు శుభప్రదమైన అధిక సిరిసంపదలను ఎప్పటికప్పుడు, వెంట వెంటనే ఒనగూర్చుచుండు నీ పాదములు - శచీదేవి మొదలైన దేవతా స్త్రీల యొక్క చేతులనే పద్మములను ముకుళింప చేయు గోళ్ళు అను చంద్రుల చేత - పరిహసించు చున్నట్లున్నవి.

అమ్మా! కిరీటధారులైన దేవతా స్త్రీలు నీ పాదములు ఆశ్రయించి నమస్కరించినపుడు నీ పాద నఖముల కాంతి వారి అజ్ఞానాంధకారమును పటాపంచలు చేస్తుంది. నీ పాదముల నఖముల కాంతి ఈ విశ్వములోని సమస్త జనుల అన్ని కోరికలను తీర్చటమే కాక, వారి అజ్ఞానాన్ని తరిమివేస్తుంది.

చండీపేరుతో ప్రసిద్ధి చెందిన ఓ దేవీ! సకలసంపదలతో తులతూగుతున్న దేవతలకు మాత్రమే కోరికలు తీర్చే కల్పవృక్షాన్ని, దీనులై దరిద్రులైన జనానికి అధికమైన సంపదలను ఇచ్చే నీ పాదాలు శచీదేవి మొదలైన దేవతాస్త్రీల కరపద్మాలను ముకుళింపచేసే గోళ్ళు అనే చంద్రులచేత పరిహసింపబడుతున్నాయి.

90 దదానే దీనేభ్యః శ్రియమనిశ మాశానుసదృశీ
మమందం సౌందర్య ప్రకర మకరందం వికిరతి
తవాస్మిన్ మందార స్తబక సుభగే యాతు చరణే
నిమజ్జ న్మజ్జీవః కరణ చరణై ష్షట్చరణతామ్॥

టీక:- (హే జగజ్జననీ!) దీనేభ్యః = దరిద్రుల కొఱకు, శ్రియం = సిరిసంపదలను, అనిశం = ఎల్లప్పుడు, ఆశానుసదృశీం = కోర్కెలకు తగిన దానిని, దదానే = ఇచ్చుచున్నదియు, అమందం = అధికమైన, సౌందర్య = అందము యొక్క, ప్రకర = అన్ని గుణములు అను, మకరందం = తేనెను, వికిరతి = వెదజల్లునదియు, మందారస్తబకశుభగే = మందారము అను కల్పవృక్షము యొక్క పుష్పగుచ్ఛము వలె శోభాయమాన మైనదియు అగు, అస్మిన్ = ఈ (కనబడు), తవ = నీ యొక్క, చరణే = పాదమునందు - కరణచరణః = మనస్సు, పంచేంద్రియములతో కూడి ఆరు పాదములు గలవాడైన, మత్‌జీవః = నేను అను జీవుడు, నిమజ్జన్ = మునుగుచున్నవాడై, షట్చరణతాం = ఆరు పాదములు గలదైన, భ్రమర భావమును, యాతు = పొందుగాక!

తల్లీ! జగజ్జననీ! దీనజనులకు ఎల్లపుడు వారు కోర్కెలకు తగిన విధముగా సిరిసంపదలను అనుగ్రహించునదియు, అధికమైన లావణ్య, సౌభాగ్యములు అను పూదేనియను చల్లు చున్నదియు, కల్పవృక్ష పుష్పగుచ్ఛము వలె అందమైనదియు, అగు నీ పాదపద్మమునందు - మనస్సు తో కూడిన పంచజ్ఞానేంద్రియములు ఆఱును పాదములుగా గలవాడనైన నేను మునుగుచు భ్రమర భావమున వసింతును గాక!

Kiron Type Institute

Kiron Type Institute

జగన్మాతా! నీ పాదములు కల్పవృక్షపు పూలగుత్తులు. వానిపై భ్రమరమునై వాటి మకరందమును ఆస్వాదించే అదృష్టమును నాకు కలిగించు. జనని నేత్రములయందలి అమృతము మన్మథుని తిరిగి బ్రతికించడానికి, అధరా మృతము కామేశ్వరునికొరకు, స్తన్యములోని అమృతము గణపతి, కుమారస్వామి కొరకు, పాదములలో ఉన్న అమృత రసము భక్తులకు ఉద్దేశించబడినది.

తల్లీ! దీనజనులకు ఎప్పుడూ వారు కోరిన విధంగా సిరిసంపదలను గ్రహించేది, అధికమైన లావణ్యము, సౌభాగ్యము అనే పూదేనియను చల్లేది, కల్ప వృక్షపు పూలగుత్తిలాగా అందమైనది, అయిన నీపాద పద్మమునందు, జ్ఞానేంద్రియాలు, మనస్సు వెరసి ఆరుపాదములుగా గల తుమ్మెదనై నివసిస్తాను.

91. పదన్యాసక్రీడా పరిచయమి వారబ్ధు మనసః
స్థ(స్ఖ)లంత స్తే ఖేలం భవనకలహంసా న జహతి
అత స్తేషాం శిక్షాం సుభగమణిమంజీర రణిత
చ్ఛలా దాచక్షాణం చరణ కమలం చారుచరితే॥

టీక:- (హే) చారుచరితే = సుందరమైన చరిత, నడత గల దేవీ! పద = పాదముల యొక్క, న్యాస = ఉంచుట యందలి, క్రీడా = ఆటయందు, పరిచయం ఇవ = శిక్షణవలె, ఆరబ్ధుమనసః = పొందగోరు మనస్సుగలవైన, భవన కలహంసాః = రాజు భవనము నందు పోషింపబడిన రాజహంసలు, స్థలంతః = జారుచున్న నడక గలవై, తే = నీ యొక్క, ఖేలం = విలాసగమనమును, నజహతి = వదలుట లేదు, అతః = ఇందువలన, చరణకమలం = నీ పాదపద్మము, సుభగ = సుందరమైన, మణిమంజీర = మణులతో గూడిన అందియ యొక్క, రణిత + ఛలాత్ = సవ్వడుల యొక్క నెపము వలన, తేషాం = ఆ కలహంసలకు, శిక్షాం = నడకకు సంబంధించిన శిక్షణ గఱపుటకు, ఆచక్షానం ఇవ = వచించు చున్నది, లేదా - నేర్పుచున్నది వలె వున్నది.

ఓ చారుచరితా! అందమైన నీ పాద విన్యాస, క్రీడాభ్యాసమును, తామునూ పొందగోరినవైన నీ పెంపుడు రాజహంసలు తొట్రుపాటు చెందుచూ, నీ విలాస గమనమును వీడలేకున్నవి. అందువలన నీ పాదపద్మము - కెంపులు మొదలగు రత్నములు తాపిన అందియ చిరుసవ్వడులనెడి నెపముతో ఆ రాజహంసలకు విలాస గమనక్రీడా శిక్షణను నేర్పుచున్నట్లున్నది.

అమ్మా! నీ వనములో ఉన్న హంసలు నిన్ను చూసి, నీలాగ నడవాలని ప్రయత్నించి తడబడుతున్నాయి. నీ పాదాలకు ఉన్న మంజీరములు ఆ హంసలకు నీలాగ ఎలా నడవాలో చెబుతున్నాయి. నీ నడక హంసలకే నడక నేర్పుతోందమ్మా! 'మరాళీమందగమనా' అన్నది జగన్మాత సార్థక నామము.

Kiron Type Institute
Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

సుందరమైన చరిత్రగల ఓ దేవీ! నీ పెంపుడు హంసలు నీ పదన్యాస క్రీడను అభ్యాసం చేయటానికి తొట్రుపడుతున్నప్పటికీ, నీ విలాస గమనాన్ని విడవటం లేదు. అందువల్ల నీపాదాలకు గల ఆభరణాలలోని రత్నాలు, కెంపులు విచిత్రమైన శబ్దాలను చేస్తూ ఆ హంసలకు శిక్షణ ఇస్తున్నట్టున్నది.

92. గతా స్తే మంచత్వం ద్రుహిణహరిరుద్రేశ్వర భృతః
శివ స్వచ్ఛచ్ఛాయా ఘటిత కపట ప్రచ్ఛదపటః।
త్వదీయానాం భాసాం ప్రతిఫలన రాగారుణతయా
శరీరీ శృంగారోరస ఇవ దృశాం దోగ్ధి కుతుకమ్॥

టీక:- (హే జగజ్జననీ!) తే = నీ యొక్క, మంచత్వం = మంచము యొక్క, రూపముగా అగుటకు, ద్రుహిణ = బ్రహ్మ, హరి = విష్ణువు, రుద్ర = రుద్రుడు, ఈశ్వర = ఈశ్వరుడు, భృతః = భరించువారుగా ఈ నలుగురు, గతాః = పొందిన వారై, శివః = సదాశివతత్త్వము, స్వచ్ఛచ్ఛాయా = నిర్మలమైన కాంతి అను, ఘటిత = కూడబడిన, కపట = నెపము గల, ప్రచ్ఛద పటస్సన్ = కప్పుకొను దుప్పటియై, త్వదీయానాం = నీకు సంబంధించిన వారైన, భాసాం = కాంతుల యొక్క, ప్రతిఫలన = ప్రతిఫలించుటచే, రాగ = ఏ ఎఱ్ఱదనము సంక్రమించినదో దానిచే, అరుణతయా = రక్తవర్ణమగుటచే, శరీరీ = బౌతికమైన రూపు పొందినదై, శృంగార రస ఇవ = శృంగార రసము వలె, దృశాం = నీ యొక్క వీక్షణములకు, కుతుకం = ఆనందమును, దోగ్ధి = పిదుకుచున్నాడు, అనగా = కలిగించుచున్నాడు.

తల్లీ! జగజ్జననీ! బ్రహ్మ, విష్ణు, రుద్ర, ఈశ్వరులు నలుగురు నీవు అధిష్ఠించు మంచము యొక్క నాలుగు కోడుల రూపమున నున్నారు. సదాశివుడు తన స్వచ్ఛమైన తెల్లని కాంతిచే అను నెపముతో ఆ మంచముపై కప్పు దుప్పటి అగుచు, ఎఱ్ఱని నీ మేని కాంతులు తనపై ప్రతిఫలించుట వలన తాను పూర్తిగా ఎఱ్ఱగా మారి, మూర్తీభవించిన శృంగార రసము వలె నయనములకు ఆనందమును ఇచ్చుచున్నాడు.

శక్తి తోడులేక ఎంతటి వారైనా శక్తిహీనులే. అందుకే బ్రహ్మ, విష్ణు మహేశ్వరులు ఒక మంచమునకు కోళ్లుగా రూపొందారు. నీ భర్తయైన ఈశ్వరుడు నీకు దుప్పటిగా ఉండి, నిన్ను కప్పుకొని, తన తెల్లని శరీరమును ఎర్రగా మార్చుకున్నాడు. అందుకనే నీవు "శివాకారమంచే" అనీ, "పంచబ్రహ్మాసనస్థితా" అని కీర్తింపబడ్డావు.

ఓ దేవీ! బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు అనే వారు నీ మంచానికి కోళ్ళుకాగా, సదాశివుడు నీవు కప్పుకునే వస్త్రమయినాడు.

93. ఆరాళా కేశేషు ప్రకృత సరళా మందహసితే
శిరీషాభా చిత్తే దృషదుపలశోభా కుచతటే।

భృశం తన్వీ మధ్యే పృథురురసిజారోహవిషయే,
జగత్త్రాతుం శంభో ర్జయతి కరుణా కాచిదరుణా॥

టీక:- (హే జగజ్జననీ) కేశేషు = కురులందు, ఆరాళా = వంకరయైనదియు, మందహసితే = మెల్లని నవ్వునందు, ప్రకృతి సరళా = స్వభావము చేతనే ఋజువర్తనము, సౌజన్యము గలదియు, చిత్తే = మనస్సునందు, శిరీష + అభా = దిరిసెన పూవు వంటి మెత్తని స్వభావము గలదియు, కుచతటే = వక్షస్థలము, దృషత్ + ఉపలశోభా = సన్నికల్లు పొత్రమువంటి బలుపుగలదియు, ఉరసిజ = స్తనముల విషయమునందును, ఆరోహ = పిఱుదుల విషయమునందును, పృథుః = స్థూలమైనదియు, శంభోః = సదాశివుని యొక్క, కాచిత్ = వర్ణనాతీతమైన, అరుణా = 'అరుణ' అను శక్తి, కరుణా = దయాస్వరూపము గలది, జగత్ = ప్రపంచమును, త్రాతుం = రక్షించుటకు, జయతి = సర్వోత్కర్షతో వర్తించుచున్నది.

తల్లీ! జగజ్జననీ! తలకురులయందు వంకరయైనది, లేత నవ్వునందు స్వభావము చేతనే చక్కనిదియు, మనస్సునందు దిరిసెన పువ్వువలె మెత్తదనము గలదియు, వక్షములు సన్నికల్లు పొత్రము వలె బలుపుదనము గలదియు, నడుమునందు మిగుల సన్నదనము గలదియు, వక్షస్థలము వద్దను పిఱుదుల వద్దను విశాలత్మము గలదియు, ఈ విధముగా నుండునని చెప్పనలవి కానిదియు, శంభుని కరుణారూపమైన 'అరుణ' అనుశక్తి – జగద్రక్ష నిపుణయై సర్వోత్కర్షతో విరాజిల్లుచున్నది.

జగన్మాత సౌందర్యనిధి. అందముగా వంకరలు తిరిగిన కేశ సంపద కలది. మందస్మితవదనారవింద. మృదువైన హృదయము కలది. కఠినమైన కుచములు, సన్నైన నడుము కలది. అరుణవర్ణముపై మక్కువ కలది అయిన జగన్మాత అరుణ వర్ణముతో కూడిన ఈ ప్రపంచమును రక్షించుటకు ఈశ్వరునితో కలసి ఉన్నది.

తల్లీ! "ఆరాళా" అనే అనిర్వచనీయమైన శక్తి నీ కురులలో ప్రకాశిస్తున్నది. చిరునవ్వులో ప్రకృతి స్వభావంచేతనే "సరళా" అనే శక్తి ప్రకాశిస్తున్నది. చిత్తములో మహామృదువైన శక్తి ప్రకాశిస్తున్నది. స్తనమండలంలో సన్నికల్లు శోభగల శక్తి ప్రకాశిస్తున్నది. కుచములయందు, పిరుదులయందు స్థూలశక్తి ప్రకాశిస్తున్నది. ఈ జగత్తును రక్షించటానికి "అరుణ" అనే శక్తి, "కరుణ" అనే శక్తి ప్రకాశిస్తున్నాయి.

94. కలంకః కస్తూరీ రజనికరబింబం జలమయం
కళాభిః కర్పూరై ర్మరకతకరండం నిబిడితమ్।
అత స్త్వ ద్భోగేన ప్రతిదిన మిదం రిక్తకుహరం
విధి ర్భూయో భూయో నిబిడయతి నూనం తవ కృతే॥

టీక:- (హే జగజ్జననీ!) కలంకః = మచ్చ, కస్తూరీ = కస్తూరి అగును. రజనికరబింబం = చంద్రబింబము, జలమయం = జలస్వరూపమైనది, కళాభిః = కళా స్వరూపములైన, కర్పూరైః

= పచ్చకర్పూరపు ముక్కలతో, నిబిడితం = నిండింప బడినది అగు, మరకతకరండం = గరుడ పచ్చలచే నిర్మింపబడిన బరణియగును, అతః = ఇందువలన, ఇదం = ఈ కనబడు చంద్రమండలము, ప్రతిదినం = దినదినమునందు, త్వత్‌భోగేన = నీవు ఉపయోగించుట చేత, రిక్తకుహరం = ఖాళీ అయిన లోపలి భాగము కలది, విధిః = బ్రహ్మ, భూయః భూయః = మరల మరల, తవకృతౌ = నీ కొఱకు, నిబిడయత = ఆయా వస్తువులచేత నిండించు చున్నాడు. నూనం = నిశ్చయము, ('భరణి' అను సంస్కృత పదమునకు 'బరణి' అనునది తెలుగు పదమగును. కాని, వాడుకలో దీనిని 'బరిణె' అనుచుందురు).

తల్లీ! జగజ్జననీ ఆకాశములో కనబడు చంద్రమండలము – మరకత మణులచే చేయబడి, నువ్వు – కస్తూరి, కాటుక, పన్నీరు మొదలైన వస్తువులను ఉంచుకొను బరణియే! చంద్రునిలో మచ్చవలె నల్లగా కనబడునది – కస్తూరి. ఆ చంద్రుని లోని జలతత్త్వము – నువ్వు జలకమాడుటకు ఉపయోగించు పన్నీరు చంద్రుని కళలుగా భావించబడునవి – పచ్చకర్పూరపు ఖండములు. ఈ వస్తువులు ఆ భరణి నుండి నువ్వు ప్రతిదినము వాడు కొనుచుండుట వలన తరిగిపోవుటచే – నీ ఆజ్ఞను అనుసరించి నీ పాలనలో సృష్టిపనిచేయు బ్రహ్మ మరల ఆ వస్తువులను పూరించుచున్నాడు. (అనగా – అయి పోయినపు డెల్ల నింపుచున్నాడని అర్థము).

అమ్మా! ఈ లోకములోని జనులు తెలియక చంద్రునిలో మచ్చ ఉందని భావిస్తారు. నిజానికి అది నీ అలంకార పేటిక. అందులో ఉన్న కస్తూరి, పన్నీరు, పచ్చ కర్పూరము, మొదలైనవి నీవు తీసి అలంకరించు కుంటుంటే, బ్రహ్మదేవుడు వాటిని తిరిగి నింపుతూ ఉంటాడు. అందుకే క్షీణించిన చంద్రుడు కూడా పూర్ణచంద్రుడవుతాడు. శంకరుల ఉపమానములకు శంకరులే సాటి.

తల్లీ! ఈ లోకంలో జనులు చంద్రమండలాన్ని చూసి అజ్ఞానంతో చంద్రుడని, చంద్రునిలో కళంకమని, చంద్రకిరణాలని, చంద్రబింబమని అనుకుంటున్నారు. నిజానికి అది చంద్రమండలం కాదు. నువ్వు కస్తూరి మొదలైన ద్రవ్యాలు పెట్టుకోవటానికి పచ్చలతో చేయించిన పెట్టె. అక్కడ కళంకముగా భావించేది కస్తూరి. నువ్వు జలకాలాడటానికి పన్నీరు నింపిన కుప్పెనే చంద్రుడు అనుకుంటున్నారు. పచ్చకర్పూరపు పలుకులను చంద్రకళలుగా భావిస్తున్నారు ఈ వస్తువులను నువ్వు వాడుతుంటే, తరిగిపోతాయి, అప్పుడు నీ సేవకుడైన బ్రహ్మ మళ్ళీ వాటిని నింపుతున్నాడు.

95. పురారాతే రంతః పురమసి తత స్త్వ చ్చరణయో
స్సపర్యా మర్యాదా తరళకరణానా మసులభా।
తథా హ్యేతే నీతా శ్శతమఖముఖా స్సిద్ధి మతులాం
తవ ద్వారోపాంత స్థితిభి రణి మాద్యాభి రమరాః॥

టీక:- (హే జగజ్జననీ!) పుర + ఆరాతౌ = త్రిపుర హరుడైన శివుని యొక్క, అతఃపురః = అంతఃపురము, అనగా – పట్టమహిషి, అసి = అగుచున్నావు. తతః = ఆ కారణము వలన,

త్వత్ చరణయోః = నీ పాదముల యొక్క, సపర్యామర్యాదా = పూజాభాగ్యము, తరళకరణానాం = చపల చిత్తులకు, అసులభా = సులభమైనది కాదు, తథాహి = అది యుక్తమే అగును (ఎందువలన అనగా), ఏతే = ఈ, శత ముఖముఖాః = ఇంద్రాదులైన, అమరాః = దేవతలు, తవ = నీ యొక్క, ద్వార + ఉపాంతస్థితిభిః = అంతఃపుర ద్వార సమీపము నందుండు, అణిమాదిభిఃసహి = అణిమ, గరిమా మొదలగు అష్టసిద్ధుల చేత, అతులాం = సాటిలేని, సిద్ధిం = ఇష్టార్థ ఫలసిద్ధిని, నీతాః = పొందిరి.

అమ్మా! జగజ్జననీ! నీవు త్రిపురహరుడైన శివుని పట్టమహిషివి. అందువలన నీ పాద పద్మపూజ చేయగల భాగ్యము చపల చిత్తులైన వారికి లభించునది గాదు. అందువలననే ఈ ఇంద్రాది దేవత లందఱు తాము కోరుకున్న అల్పమైన అణిమాది అష్టసిద్ధుల గూడి, వారితో పాటు నీ ద్వార సమీపము నందే కావలి వారి వలె పడిగాపులు గాచుచున్నారు.

అమ్మా! నీవు జగదీశ్వరుడైన పరమశివుని దేవేరివి. సామాన్యులు నీ పాదసేవ తేలికగా చేయలేరు. సకల సిద్ధులను పొందిన ఇంద్రాది దేవతలు కూడా, నీ పాదముల వద్దకు చేరలేక, ద్వారము వద్దనే నిలిచి ఉండిపోయారు. కాబట్టి ఆ అణిమాది సిద్ధులను దాటి ఇంకా పురోగమించిన వారికే నీ పాద దర్శనము, సేవనము సాధ్యమౌతుంది.

ఓ తల్లీ! నీవు త్రిపురాంతకుడైన పరమేశ్వరుని పట్టపురాణివి. అందువల్ల నీ చరణ సపర్య, చపలచిత్తులకు లభించదు. ఆ కారణంచేతనే ఇంద్రాదిదేవతలు నీ ద్వారపాలకులైన అణిమాది అష్ట సిద్ధులను కొలిచి, దానివల్ల సాటిలేని అభీష్టఫలసిద్ధి పొందారు.

96. కళత్రం వైధాత్రం కతికతి భజంతే న కవయః
శ్రియో దేవ్యాః కోవా న భవతి పతిః కై రపి ధనైః।
మహాదేవం హిత్వా తవసతి సతీనామచరమే
కుచాభ్యా మాసంగః కురవకతరో ర ప్యసులభః॥

టీక:- (హే) సతి = ఓ పతివ్రతా శిరోమణీ! పార్వతీ!, వైధాత్రం = విధాతకు, అనగా – బ్రహ్మకు సంబంధించిన దైన, కళత్రం = భార్య అయిన సరస్వతిని, కతికతి = ఎందఱెందఱు, కవయః = కవులు, నభజంతే = సేవించుట లేదు, శ్రియః దేవ్యా = లక్ష్మీదేవి యొక్క, కైః అపిధనైః = ఏదో కొంత ధనము చేత కాని, కోవా = ఏ పురుషుడు, పతిః = భర్త, నభవతి = కాకున్నాడు? (హే) సతీనాంఅచరమే = పతివ్రతలలో అగ్రగణ్యమైన దేవీ! మహాదేవం = సదాశివుని, హిత్వా = వీడి, తవ = నీ యొక్క, కుచాభ్యాం = స్తనయుగము చేతనైన, ఆసంగః = కౌగిలింత, కురవక = గోరంటచెట్టునకు సైతము, అసులభః = సులభము కాదు.

ఓ పతివ్రతా శిరోమణీ! పార్వతీ! బ్రహ్మదేవుని భార్య అయిన సరస్వతిని ఎందరెందఱు కవులు సేవింపకున్నారు. లక్ష్మీదేవి యొక్క ధన సంపదలను పొంది ఏ పురుషుడు ధనపతి కాకున్నాడు? కాని పతివ్రతలలో మొట్టమొదట లెక్కింపదగిన దేవీ! నీ స్తనయుగముతోడి కౌగిలింత ఆ సదాశివునికి ఒకనికే తప్ప గోరంట చెట్టునకు గూడా లభించునది లేదు గదా!

Kiron Type Institute
Kiron Type Institute
కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

జగన్మాతా! లోకములో కొందరు సరస్వతీ దేవిని ఆశ్రయించి విద్యావంతులు, లక్ష్మీదేవిని ఆశ్రయించి ధనవంతులు అవుతారు. నిన్ను మాత్రము ఎవరు వశపరచుకోలేరు. నీ ఆలింగనము కేవలము నీ పతి అయిన ఈశ్వరునికే స్వంతము.

పతివ్రతలలో శ్రేష్ఠురాలా! మహాకవులు సరస్వతీదేవిని పొంది సరస్వతీ వల్లభులమని చెప్పుకుంటున్నారు. కొందరు బాగా ధనము సంపాదించి లక్ష్మీపతి అని చెప్పుకుంటున్నారు. కాని నిన్ను ఆలింగనం చేసుకోవటము కురవక వృక్షానికి (గోరింట చెట్టు) కూడా లభించదు. కవి సరస్వతీపతి అవుతాడు. ధనవంతుడు లక్ష్మీపతి అవుతాడు. కాని పార్వతీపతి మాత్రం మహాదేవుడొక్కడే.

97. గిరా మాహు ర్దేవీం ద్రుహిణ గృహిణి(ణీ) మాగమవిదో
హరేః పత్నీం పద్మాం హరసహచరీ మద్రితనయామ్।
తురీయా కాపి, త్వం దురధిగమ నిస్సీమ మహిమా
మహామాయా విశ్వం భ్రమయసి పరబ్రహ్మ మహిషి॥

టీక:- (హే) పరబ్రహ్మమహిషి = ఓ సదాశివుని పట్టమహిషీ! ఆగమవిదః = వేదార్థ రహస్యార్థములు తెలిసిన వారు, త్వాం ఏవ = నిన్నే, ద్రుహిణ గృహిణీం = బ్రహ్మ ఇల్లాలైన, గిరాందేవి = వాగ్దేవి అయిన సరస్వతినిగా, అహః = వచింతురు, త్వాఏవ = నిన్నే, హరేః = విష్ణువు యొక్క, పత్నీ = భార్యఅయిన, పద్మాం = కమలవాసిని అయిన లక్ష్మీదేవినిగా, అహః = చెప్పుదురు, త్వమేవ = నిన్నే, హరసహచరీం = శివుని సహధర్మచారిణి అయిన, అద్రితనయాం = పార్వతినిగా, అహుః = చెప్పుదురు, త్వం = నీవు, తురీయా = ఆ ముచ్చురి కంటె నాల్గవ ఆమెవై, కాపి = ఇట్టిదని చెప్పనలవి కాని, దురధిగమ = మిక్కిలి కష్టసాధ్యమయిన, నిస్సీమ = హద్దులేని, మహిమా = ప్రభావము, లేదా - మహాత్మ్యము కలదైన, మహామాయా సతీ = మాయాతత్త్వమగుచు, విశ్వం = ఈ జగత్తును, భ్రమయసి = భ్రమింపచేయుచున్నావు.

ఓ పరబ్రహ్మమైన సదాశివుని పట్టమహిషీ, ఆగమ రహస్యార్థములు తెలిసిన విద్వాంసులు నిన్ను - బ్రహ్మదేవుని ఇల్లాలు, వాగ్దేవి అయిన సరస్వతీదేవిగా - చెప్పుదురు. ఆ నిన్నే - శ్రీ మహావిష్ణుమూర్తి భార్య, కమలవాసిని అయిన మహాలక్ష్మీదేవిగా - చెప్పుదురు. మరియు ఆ నిన్నే - సహధర్మచారిణి అయిన పార్వతిగా గూడా చెప్పుదురు. కాని, నీవు ఈ ముచ్చురికంటె వేరుగా నాల్గవ దానివై, ఇట్టిదని చెప్పనలవికాని ఆమెవై, అనిర్వాచ్యమై, మహాకష్టసాధ్యమై, మహామాయా తత్త్వమై, ఈ సర్వజగత్తును నానా విధములుగా మోహపెట్టుచున్నావు.

తల్లీ, వేదమూర్తులు కొందరు నిన్ను సరస్వతి గాను, మరికొందరు మహాలక్ష్మి గాను, ఇంకొందరు రుద్రాణి గానూ భావిస్తుంటారు. కానీ నీవు వీరెవరూ కాదు. అమ్మలగన్న అమ్మ ముగురమ్మల మూలపుటమ్మ వైన నీవు ఈ చరాచర జగత్తును పరిపాలిస్తుంటావు.

ఓ పరబ్రహ్మ మహిషీ! బ్రహ్మవాదులు నిన్నే బ్రహ్మదేవునిభార్య, వాక్కుకు అధిష్ఠానధాత్రివైన సరస్వతి అంటున్నారు. విష్ణుమూర్తిభార్య అయిన లక్ష్మీదేవి అంటున్నారు. శివుని భార్య

అయిన పార్వతి అంటున్నారు. కాని నీవుమాత్రం ఈ ముగ్గురూ కాకుండా, వీరికన్న వేరైనది, అనిర్వచనీయమైనది, అతికష్టము చేత మాత్రమే పొందదగినది, అపారమహిమగలది అయిన శుద్ధవిద్యాతత్త్వమై, మాయామయమైన ఈ ప్రపంచాన్ని భ్రమింపచేస్తున్నావు.

98. కదా కాలే మాతః కథయ కలితాలక్తకరసం
పిబేయం విద్యార్థీ తవ చరణ నిర్ణేజన జలమ్।
ప్రకృత్యా మూకానాం మపి చ కవితాకారణతయా
కదా ధత్తే వాణీ ముఖ కమల తాంబూల రసతామ్॥

టీక:- (హే) మాతః = ఓ తల్లీ, కలిత + అలక్తరసం = లత్తుకరసము గలదైన, తవ = నీయొక్క, చరణ నిర్ణేజన జలం = అడుగులు కడిగిన ఉదకమును, విద్యార్థీ = (బ్రహ్మ) విద్యనర్థించువాడు (అయిన), అహం = నేను, కదాకాలే = ఎప్పుడు, పిబేయం = త్రాగుదునో, కథయ = చెప్పుము. తచ్చ = ఆ జలము, ప్రకృత్యా = స్వభావముచేతనే, మకానాం అపి = మూగ, చెవిటి వారలకు సైతము, కవితాకారణతయా = కవిత్వ రచన గావించుటకు కారణమైనదగుటచేత, వాణీ = సరస్వతి యొక్క, ముఖకమలం = ముఖపద్మము నందలి, తాంబూలరసతామ్ = తాంబూలరసము అగుటకు, కదా = ఎప్పుడు ధరించుచున్నదో.

తల్లీ! జగజ్జననీ! స్వాభావికముగానే - చెవిటివారికి వినికిడి శక్తిని, మూగవారికి మాట్లాడుశక్తిని కలిగించునదై (పూర్వానుభవము, సామర్థ్యము లేకున్నను) కవిత్వరచనా సౌభాగ్యమును ప్రసాదించునదై, సరస్వతీదేవి తాంబూల రసము వంటిదగు లత్తుకరసముతో కలసిన నీ పాద ప్రక్షాళన జలమును - విద్యార్థినైన నేను ఎప్పుడు గ్రోలుదునో చెప్పుము.

ఓ మాతా, నీ పాదములు కడిగిన జలమును స్వీకరించిన మూగవాడు మహాకవిగా మారగా, చెవిటివాడు అత్యద్భుతమైన శ్రవణ శక్తిని పొందాడు. మరి నాకు నీ పాదోదకమును స్వీకరించే భాగ్యం ఎప్పుడు కలుగుతుందో కదా మాతా!

తల్లీ! నీ పాదాలకు పైపూతగా పూసిన ఎర్రని లత్తుక రసముతో కూడిన పాదాలను కడిగి, ఆ పాదోదకాన్ని, బ్రహ్మవిద్యనర్థించే విద్యార్థినైన నేను మరణించే లోపల ఎప్పుడు పుచ్చుకోగలుగుతాను? నీ పాద ప్రక్షాళితజలం స్వాభావికంగానే చెవిటివారికి వినే శక్తిని, మూగవారికి మాటాడేశక్తిని, కలిగించినదై, వారికి కవచమునకు హేతువవటం చేత వాణీముఖకమల తాంబూలరస సారస్యమును ఎప్పుడు స్వీకరించగలుగుతాను?

ఫలశ్రుతి:

99. సరస్వత్యా లక్ష్మ్యా విధిహరి సపత్నో విహరతే
రతేః పాతివ్రత్యం శిథిలయతి రమ్యేణ వపుషా।
చిరం జీవన్నేవ క్షపితపశు పాశవ్యతికరః
పరానందాభిఖ్యం రసయతి రసం త్వద్భజనవాన్॥

టీక:- (హే) జగజ్జననీ! త్వత్ + భజనవాన్ = నిన్ను సేవించు భక్తుడు, సరస్వత్యా = వాణితోడను, లక్ష్మ్యా = లక్ష్మీదేవితోడను గూడిన, విధి హరి = వరుసగా బ్రహ్మకు విష్ణువునకును, సపత్నఃసన్ = ప్రత్యర్థి, లేదా - పోటీదారుడగుచు, విహరతే = విహరించుచున్నవాడై, రమ్యేణ = అతిసుందరమైన, వపుషా = శరీరము చేత, రతేః = రతీదేవి యొక్క, పాతివ్రత్యం = పతివ్రతా ధర్మమును, శిథిలయతి = సడలింప జేయుచున్నాడు, క్షపిత = విదళింపబడిన, పశు = జీవుల యొక్కయు, అవిద్య యొక్కయు, వ్యతికరః = సంబంధము లేనివాడై, పరానంద + అభిఖ్యం = పరానంద స్వరూపము అను పేరు గల, రసం = సుఖమును, రసయతి = ఆస్వాదించు చున్నాడు.

తల్లీ! జగజ్జననీ! నిన్ను సేవించు భక్తుడు సరస్వతీ కటాక్షము చేతను, లక్ష్మీ కటాక్షము చేతను వరుసగా బ్రహ్మ, విష్ణువులకు ప్రత్యర్థిగా మారి విహరించును. అత్యంత సుందరమైన రూపముతో మన్మథపత్ని అయిన రతీదేవి పాతివ్రత్యమును కూడా సడలింప చేయును. చివరకు జీవ సంబంధ, అవిద్యా సంబంధముల నుండి దూరుడై, జీవన్ముక్త స్థితిలో పరానంద సుఖమును, అనగా - మోక్షానందమును అనుభవించును.

ఈ శ్లోకములో శంకరులు అద్భుతమైన చమత్కారమును ఉపయోగించారు. అమ్మా! లక్ష్మిని అనగా ఐశ్వర్యమును పొందినవారు విష్ణువునకు విరోధులవుతారు. విద్యను అనగా సరస్వతిని పొందినవారి పట్ల బ్రహ్మకు అసూయ కలుగుతుంది. కానీ నీ భక్తులు ఐశ్వర్యము, విద్య సౌందర్యము, దీర్ఘాయుస్సును ఎవరి అసూయ లేకుండానే పొందగలుగుతారు.

ఓ తల్లీ! నిన్ను అర్చించిన సాధకుడు సరస్వతీదేవితోను, లక్ష్మీదేవితోను విహరించువాడై, బ్రహ్మకు విష్ణువుకు అసూయ పుట్టిస్తున్నాడు. మన్మథునితో సమానమైన సౌందర్యము గలిగి రతీదేవినికూడా మోహింపచేసి, ఆమెపాతివ్రత్యానికి భంగంకలిగిస్తున్నాడు. చివరకు అవిద్యా సంబంధిత భావాలను వదిలి, జీవన్ముక్తుడై పరమానందాన్ని అనుభవిస్తున్నాడు.

అంకితం:

100. ప్రదీపజ్వాలాభి ర్దివసకర నీరాజనవిధిః
సుధాసూతే శ్చంద్రోపలజలలవై రర్ఘ్యరచనా।
స్వకీయై రంభోభి స్సలిలనిధి సౌహిత్య కరణం
త్వదీయాభి ర్వాగ్భిస్తవ జనని వాచాం స్తుతి రియమ్॥

టీకా:- (హే) వాచాంజనని = వాక్ప్రపంచమునకు తల్లీ!, యథా = ఏ విధముగా, స్వకీయాభిః = తనకు సంబంధించినవే అయిన, ప్రదీపజ్వాలాభిః = చే దివిటీల యొక్క జ్వాలలచే, దివసకర = సూర్యునికి, నీరాజనవిధిః = కర్పూరహారతి నిచ్చుటయో, యథా = ఏ విధముగా, స్వకీయైః = తనకు సంబంధించినవే అయిన, చంద్ర + ఉపజలలవైః = స్రవించు చంద్రకాంత శిలా జల బిందువలచేత, సుధాసూతేః = చంద్రునికి, అర్ఘ్యరచనా = అర్ఘ్యము సమర్పించుటయో, యథా = ఏ ప్రకారము, స్వకీయైః = తనకు సంబంధించినవే

అయిన, అంభోభిః = జలముల చేత, సలల నిధి = సముద్రునకు, సౌహిత్యకరణం = తృప్తికొఱకు తర్పణము చేయుటయో, తథా = ఆ ప్రకారము, త్వదీయాభిః = నీ వలన ఉత్పన్నములైన, వాగ్భిః = వాక్కుల చేత, తవ = నీకు, ఇయం = ఈ, స్తుతిః = స్తోత్రము (అగుచున్నది).

వాక్ప్రపంచమున కెల్ల తల్లివగు ఓదేవి! భగవతీ! తన సంబంధము వలననే జ్వలించు దివిటీ జ్వాలలచేత సూర్యునికి హారతి నిచ్చుట ఎట్లో, అట్లే తన సంబంధము వలననే స్రవింపబడు చంద్రకాంతా శిలాజల బిందువుల చేత చంద్రునికి అర్ఘ్యము సమర్పించుట యెట్లో, అట్లే తనకు సంబంధించినవే అయిన సముద్రోదకముల చేతనే ఆ సముద్రుని తృప్తికి తర్పణము చేయుట ఎట్లో – అట్లే – నీ అనుగ్రహము వలన నీ స్వరూపములో నా నుండి వ్యక్తమగు వాక్కుల కూర్పులచే ఈ స్తుతి నీకు నా చేత చేయబడు చున్నది.

జగన్మాతా, నా ఈ వాక్కు నీ అనుగ్రహ దత్తమే. సూర్య భగవానుని దివిటీ కాంతిలో చూపించినట్లు, చంద్రునకు చంద్రకాంత శిలలతో అర్ఘ్యమిచ్చినట్లు, సముద్రమునకు ఆ జలముతోనే తర్పణమిచ్చినట్లు, నీవు ప్రసాదించిన విద్యతో నిన్నే స్తుతిస్తూ అహంకరిస్తున్నాను. నన్ను మన్నించు తల్లీ.

తల్లీ! నేను ఇంతవరకు నిన్ను చేసిన స్తోత్రమంతా నీవు నాకిచ్చిన వాక్కులచేత, నీవిచ్చిన జ్ఞానంచేత, బుద్ధిచేత చేసినదే. ఈ స్తోత్రమంతా కూడా సూర్యుడికి దివిటీ వెలిగించినట్లుగా, చంద్రకాంత శిలలనుండి జాలువారే బిందువులచేత చంద్రునికి అర్ఘ్యమిచ్చినట్లుగా, సముద్రంలోని జలం తీసి సముద్రుడికి తర్పణలిచ్చినట్లుగా ఉన్నది.

– – – = "లోకాసమస్తా స్సుఖినో భవన్తు" = – – –

// ఇతి జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యకృత సౌందర్యలహరీ సంపూర్ణమ్. //

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

పూర్వాంగం:- శ్రీ ఆది శంకర భగవత్పాదులు రచనలలో (స్తోత్రాలలో) తలమానికమైనది "సౌందర్యలహరి". ఇది మంత్ర, తంత్ర, యంత్ర, సౌందర్య, యోగసమన్వితమైన స్తోత్రము. త్రిపుర సుందరి అయిన అమ్మవారి అంద చందాలు, అనురాగ, అనుగ్రహాలు, నవరసోపేతమైన అమ్మ వారి దినచర్య - ఈ స్తోత్రంలో వుంటాయి.

ఈ స్తోత్ర శీర్షికను ఆంగ్లంలో "DELIGHTFUL FLOOD OF DIVINE BEAUTY" అని అనువదించడం జరిగింది. అంటే "వరద" అని అర్థం. "వరద" అనంగానే భయంవేస్తుంది. కానీ, ఇది ఆహ్లాదకరంగా ఉండే అందం యొక్క వరద కాబట్టి, ఆ అందం దివ్యమంగళ స్వరూపిణి అయిన అమ్మవారిది కాబట్టి -"DIVINE BEAUTY" అని అనువదించడం జరిగింది.

'అవిద్యానామంతః...' 'శరజ్జ్యోత్స్నా...' 'శివశ్శక్త్యాయుక్తో...'

ఆరాధనా పద్ధతులు: 1) సూర్యారాధనము(సౌరము), 2) గణపతి ఆరాధనము (గాణాపత్యము), 3) శక్తి ఆరాధనము (శాక్తేయము), 4) విష్ణువు ఆరాధనము (వైష్ణవము), 5) శివ ఆరాధనము (శైవము).

చేతులతో చేయు పూజ (కాయిక పూజ), వాక్కులతో చేయు పూజ (వాచిక పూజ), ధ్యానముతో చేయు పూజ (మానసిక పూజ).

దేవతను ధ్యానించుటకు, జపించుటకు అవసరమైన సంకేత బీజాక్షర సముదాయమును, ఆ దేవతకు సంబంధించిన 'మంత్రము' అందురు.

'పంచదశాక్షరీ మంత్రము' (పంచదశి): "క ఏ ఈ ల హ్రీం; హ స క హ ల హ్రీం; స క ల హ్రీం" (చివర "శ్రీం" చేర్చిన "షోడశి" అగును) "హ స క ల హ్రీం, హ స క హ ల హ్రీం, స క ల హ్రీం" ....

ఆనందలహరి (1-41శ్లోకములు) సౌందర్యలహరి (42-100శ్లోకములు)

మొదటి భాగము నందు కుండలినీ యోగమునకు సంబంధించిన షట్చక్ర, తంత్ర, యంత్ర, మంత్ర శాస్త్ర రహస్యములు ; రెండవ భాగమున అమ్మవారి కిరీటాది పాద పర్యంతము వర్ణన (ఇందు శ్రీ విద్యారహస్యములు, సాముద్రిక శాస్త్ర రహస్యములు ఇమిడి ఉండును)

- - - = - - -

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్
Kiron Type Institute
Kiron Type Institute

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)

Kiron Type Institute